ప్రజా కలం
Digital Editions
http://prajakalam.com
epaper.prajakalam.com
paperboy.com
www.magzter.com

epaper.prajakalam.in
www.prajakalam.in
Published From Nizamabad
PRGI No.TELTEL/2010/33275

# ప్రజా కలం

PRAJA KALAM Telugu Daily  తెలుగు దినపత్రిక

ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
Classifieds
&
Public Notice
Advertising
5 Lines Rs.250 only
క్లాసిఫైడ్స్
సంప్రదించండి
9010972526

బుధవారం | 12-08- 2026  సంపుటి: 17,  సంచిక: 130,  నిజామాబాద్,  పేజీలు : 12,  వెల : 3/-  ◆ ఎడిటర్: కలకొండ రామకృష్ణ ◆

### ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో

# వేగం పెంచండి

## వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి

### మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్ లు కొనుగోలు చేయాలి : ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి



హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాకలం) :
హైదరాబాద్ నగర ప్రజా రవాణా వ్యవస్థను మరింత బలోపేతం చేయడంతో పాటు తెలంగాణను పెట్టుబడులకు మరింత ఆకర్షణీయ గమ్యస్థానంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం చర్యలు వేగవంతం చేస్తోంది. ఒకవైపు పాతబస్తీ మెట్రో రైల్ పనులను త్వరితగతిన చేపట్టాలని, మరోవైపు డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌ను అంతర్జాతీయ స్థాయిలో నిర్వహించేలా ఏర్పాట్లు చేయాలని ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి అధికారు లను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్)పై ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్షలో ముఖ్యమంత్రి పాతబస్తీ మెట్రో విస్తరణపై ప్రత్యేకంగా దృష్టి సారించారు. మెట్రో ఫేజ్-2లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు చేపట్టనున్న 7.5 కిలోమీటర్ల కారిడార్ పనులను వీలైనంత త్వరగా ప్రారంభించి పూర్తి చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించిన టెండర్ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని, పనులకు అడ్డంకిగా ఉన్న పెండింగ్ భూసేకరణ ప్రక్రియను కూడా వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. పాత బస్తీ ప్రాంతానికి మెట్రో రైలు సేవలు అందుబాటులోకి వస్తే నగరంలోని కీలక ప్రాంతాలకు మెరుగైన ప్రజా రవాణా సౌకర్యం ఏర్పడటంతో పాటు ట్రాఫిక్ సమస్యలు కొంతమేర తగ్గే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు పనుల్లో జాప్యం లేకుండా సమన్వయంతో ముందుకు సాగాలని సీఎం స్పష్టం చేశారు. ఎంజీబీఎస్-చాంద్రాయణ గుట్ట కారిడార్‌కు సంబంధించి ప్రస్తుతం అందుబాటులో ఉన్న ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంపై ఢిల్లీ మెట్రో అధికారులతో సంప్రదించి అవసరమైన సాంకేతిక సలహాలు తీసుకోవాలని సూచించారు. ఇదిలా ఉండగా, హైదరాబాద్ మెట్రోలో పెరుగుతున్న ప్రయాణికుల రద్దీని దృష్టిలో ఉంచుకుని అదనపు కోచ్‌లను అందుబాటులోకి తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ప్రయాణికుల సంఖ్యకు అనుగుణంగా మెట్రో రైళ్ల సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన కోచ్‌ల కొనుగోలు ప్రక్రియను చేపట్టాలని సూచించారు.

తరువాయి 2వ పేజీలో...




### పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి

# ఇబ్బందులు లేకుండా చూడాలి

## 15-30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలి

జిల్లా మానిటరింగ్ కమిటీలలో రైతులను భాగస్వాములను చేయాలి

కపాస్ కిసాన్ యాప్ లో స్లాట్ బుకింగ్ విధానాన్ని మరింత సరళీకృతం చేయాలి

రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు సమన్వయంతో పనిచేసి రైతులకు మేలు కలిగేలా చూడాలి

పత్తి రైతుల ఫిర్యాదుల పరిష్కారం కోసం ప్రత్యేక హెల్ప్ లైన్ నెంబర్లు 1800 599 5779 మరియు 88971 81111 వాట్సాప్ చాట్ బాట్ ఏర్పాటు

సీసీఐ అధికారులతో సమీక్షలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాకలం) :రాష్ట్రంలో రానున్న 2026-27 పత్తి సీజన్‌లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా పత్తి కొనుగోళ్లు సజావుగా, పారదర్శకంగా నిర్వహించాలని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత, జౌళి శాఖల మంత్రి శ్రీ తుమ్మల నాగేశ్వరరావు అధికారులను ఆదేశించారు. పత్తి కొనుగోలు ఏర్పాట్లపై సీసీఐ అధికారులతో హైద్రాబాద్ లోని గోల్కొండ హోటల్లో మంత్రి తుమ్మల సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. కష్టపడి పంట పండించిన రైతులకు మార్కెటింగ్‌లో ఎక్కడా ఇబ్బంది కలగకూడదని, ఒకరిద్దరి కారణంగా మొత్తం వ్యవస్థలకు చెడ్డపేరు

తరువాయి 2వ పేజీలో...

## కలం కౌంటర్




### టెస్సరాక్ట్‌కు భూ కేటాయింపులపై

# సమగ్ర విచారణ జరపాలి

## వాస్తవాలు తేలే వరకు వదిలిపెట్టం - బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వెల్లడి

హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాకలం) :
ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సోదరుడు అనుముల కొండల్‌రెడ్డికి చెందిన టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ కంపెనీకి విలువైన ప్రభుత్వ భూమి కేటాయించిన వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ డిమాండ్ చేశారు. సీఎం సోదరులంతా పెద్దపెద్ద కంపెనీలకు



యజమానులవుతున్నారని ఆరోపించారు. ఒక్క ఉద్యోగి లేని, రూ. లక్ష మూలధనం ఉన్న కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ఐదెకరాల భూమి ఎలా కేటాయించారు? అని ప్రశ్నించారు. ఈ విషయంపై గవర్నర్‌ను కలిసి ఫిర్యాదు చేస్తామన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# ఆ కంపెనీతో సీఎం సోదరులకు సంబంధం లేదు

### కేటీఆర్‌పై మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు ఆగ్రహం



హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాకలం) :
భూముల కేటాయింపులపై కేటీఆర్ చేస్తున్న ఆరోపణల్లో వాస్తవం లేదని మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. సీఎం రేవంత్‌రెడ్డి సోదరులకు భూ కేటాయింపులు చేశారని కేటీఆర్ అవాస్తవాలు మాట్లాడుతున్నారని, టెస్సరాక్ట్ కంపెనీకి సీఎం సోదరులతో సంబంధం లేదన్నారు. బీఆర్ఎస్ హయాంలో రూ.90 లక్షలకు ఎకరం భూమి ఇస్తే..తమ ప్రభుత్వం రూ.కోటిన్నరకు ఎకరం భూమి ఇచ్చిందని తెలిపారు.

తరువాయి 2వ పేజీలో...



# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

## ఆగస్టు 15న సంగారెడ్డి నుంచి స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సీఎం రేవంత్ శ్రీకారం

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో ఏకకాలంలో కార్యక్రమాలు

1.06 కోట్ల కార్డులు.. ప్రతి లబ్ధిదారుడికి నెలకు 6 కిలోల ఉచిత సన్నబియ్యం

2025 జనవరి 26 నుంచి కొత్తగా 16.32 లక్షల ఆహార భద్రత కార్డులు

ఏర్పాట్లలో ఎక్కడా లోటు ఉండొద్దు: మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాకలం) :
తెలంగాణలో ఆహార భద్రతకు ఇక 'స్మార్ట్' రూపం రానుంది. రాష్ట్రవ్యాప్తంగా 3.43 కోట్ల మంది లబ్ధిదారులకు సంబంధించిన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి స్వాతంత్ర్య దినోత్సవమైన ఆగస్టు 15న ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి శ్రీకారం చుట్టనున్నారు. సంగారెడ్డిలో జరిగే రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి ఈ ప్రక్రియను లాంఛనంగా ప్రారంభించనుండగా, అదే రోజు రాష్ట్రంలోని 33 జిల్లా కేంద్రాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ ఏర్పాట్లపై మంగళవారం పౌర సరఫరాల శాఖ

తరువాయి 2వ పేజీలో...

### వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్సే

# గెలుస్తుంది

కాంగ్రెస్‌లో చేరితే బిల్లులు ఇస్తామన్నారు.. ఇప్పుడు నా ఫోన్ ఎత్తట్లేదు

బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం సంచలన వ్యాఖ్యలు



బాన్సువాడ, ఆగస్టు 11(ప్రజాకలం) :
తాను కాంగ్రెస్ జెండా కప్పుకోలేదని, జాతీయ జెండా మాత్రమే కప్పుకున్నానని.. కేసీఆర్‌ను మోసం చేసి కాంగ్రెస్‌లో చేరే ఉద్దేశం తనకు లేదని, అన్నం పెట్టిన వాళ్లను ఎప్పుడూ మర్చిపోనని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. నియోజకవర్గ అభివృద్ధి, బిల్లుల నిమిత్తమే సీఎం రేవంత్‌ను కలిశానని,

తరువాయి 2వ పేజీలో...

### నిషేధిత భూములపై ప్రజలు ఎలాంటి

# ఆందోళన చెందొద్దు

### చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికీ న్యాయం చేస్తాం : మంత్రి పొంగులేటి

యుద్ధ ప్రాతిపదికన దరఖాస్తులను పరిష్కరించాలి

ఈనెల 14లోగా అన్ని డాక్యుమెంట్లను ఆన్‌లైన్‌లో అప్ లోడ్ చేయాలి

అర్హులకు అన్యాయం జరుగదు - ప్రభుత్వ ఆస్తుల పరిరక్షణలో రాజీ లేదు

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలకు చెక్ - ఆన్‌లైన్‌లో ఉన్న వివరాల మేరకే నిర్ణయాలు



హైదరాబాద్, ఆగస్టు 11 (ప్రజాకలం) :
నిషేధిత ఆస్తుల పిఓబి / 22ఎ జాబితాలో ఉన్న భూములకు సంబంధించి ప్రజలు ఎలాంటి అపోహలు పెట్టుకోవాల్సిన అవసరం లేదని, చట్టబద్ధంగా అర్హులైన ప్రతి ఒక్కరికి న్యాయం చేస్తామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి హామీ ఇచ్చారు. కొత్తగా ఎలాంటి భూములను తమ ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చలేదని, గత ప్రభుత్వం నుంచి కొనసాగుతున్న చట్టపరమైన సాంకేతిక చిక్కులను పరిష్కరించి బాధితులకు ఊరట కలిగిస్తామని స్పష్టం చేశారు. భూముల రెగ్యులరైజ్‌కు సంబంధించి ప్రభుత్వం ఇప్పటివరకు జారీ చేసిన జీవోలు, ఉత్తర్వులు, మెమోలు, భూసేకరణ ప్రొసీడింగ్స్, లే-అవుట్ల అనుమతులు తదితర వివరాలతో కూడిన అన్ని డాక్యుమెంట్లను ఈనెల 14వ తేదీ లోగా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని అధికారులను ఆదేశించారు. తద్వారా ఫోర్జరీ డాక్యుమెంట్లకు చెక్ పెట్టవచ్చని రిజిస్ట్రేషన్ సమయంలో సబ్ రిజిస్ట్రార్‌లకు స్పష్టత వస్తుందని, ఏది బోగస్ డాక్యుమెంట్, ఏది నిజమైన డాక్యుమెంట్ అనేదానిపై సూపర్ చెక్ చేసుకోవడానికి వీలుకలుగుతుందన్నారు. మరింత పారదర్శకత కోసం పహాణీలు కూడా సబ్ రిజిస్ట్రార్‌కు ఏక్సెస్ ఉండేలా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. వచ్చిన దరఖాస్తుల్లో ఏది జెన్యూన్ ఏది కాదు గుర్తించి జెన్యూన్ ఉన్నవాటిని యుద్ధప్రాతిపదికన పరిష్కరించాలని కలెక్టర్లకు సూచించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి ఆలోచనలు, సూచనలకు అనుగుణంగా ప్రజా కోణంలో ఆలోచించి కలెక్టర్లు నిర్ణయాలు తీసుకోవాలని అన్నారు. ఈ విషయంలో కలెక్టర్లు మరింత క్రియాశీలక పాత్ర పోషించాలన్నారు. మంగళవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో 22ఎ/ పిఓబి అంశంపై హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, సంగారెడ్డి కలెక్టర్లు, జిల్లా సబ్‌రిజిస్ట్రార్లతో మంత్రి గారు సుదీర్ఘంగా చర్చించారు. 22ఎకు సంబంధించి ప్రజావాణితో పాటు కలెక్టర్లు, ఆర్డీవోలు, తహశీల్దార్లకు, సబ్ రిజిస్ట్రార్లకు జిల్లాల వారీగా వచ్చిన దరఖాస్తులు ఎన్ని, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ "సమస్య వచ్చినపుడు పరిష్కరించేదానికన్నా సమస్య రాకుండా చూడాల్సిన బాధ్యత జిల్లా కలెక్టర్లపై ఉందన్నారు.

తరువాయి 2వ పేజీలో...

# ఓల్డ్ సిటీ మెట్రో పనుల్లో వేగం పెంచండి

మొదటి పేజీ తరువాయి...

నగర విస్తరణ, పెరుగుతున్న రవాణా అవసరాలకు అనుగుణంగా మెట్రో వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు.

**పెట్టుబడులే లక్ష్యం**

తెలంగాణలో పెట్టుబడులను మరింతగా ఆకర్షించేందుకు డిసెంబర్‌లో నిర్వహించనున్న ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్‌పై కూడా సీఎం ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ రంగాల్లో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రపంచస్థాయిలో పరిచయం చేసేలా సదస్సు ఏర్పాట్లు ఉండాలని ఆదేశించారు. అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు అవసరమైన కార్యాచరణను సిద్ధం చేయాలని సూచించారు. వ్యాపార రంగంలోని వివిధ సెక్టార్లలో విశేష గుర్తింపు పొందిన ప్రముఖులను సదస్సులో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు. దీనివల్ల తెలంగాణలో పెట్టుబడులకు ఉన్న అవకాశాలను ప్రముఖ పారిశ్రామికవేత్తలు, పెట్టుబడిదారులకు మరింత సమర్థవంతంగా వివరించేందుకు అవకాశం ఉంటుందని ప్రభుత్వం భావిస్తోంది. గత ఏడాది నిర్వహించిన గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణకు వచ్చిన పెట్టుబడుల వివరాలతో పాటు ఆయా పెట్టుబడులకు సంబంధించిన ప్రస్తుత పురోగతిని పూర్తిస్థాయిలో నివేదించాలని అధికారులను సీఎం ఆదేశించారు. గత సదస్సులో వచ్చిన పెట్టుబడుల హామీల అమలు పరిస్థితిని సమీక్షించి, మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను రూపొందించాలని సూచించారు. రాష్ట్రంలో పరిశ్రమలు, ఐటీ, మౌలిక వసతులు, ఇతర కీలక రంగాల్లో పెట్టుబడులను పెంచేలా సమ్మిట్‌ను వేదికగా ఉపయోగించుకోవాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ఒకవైపు హైదరాబాద్ మెట్రో విస్తరణతో నగర రవాణా వ్యవస్థను బలోపేతం చేస్తూనే, మరోవైపు అంతర్జాతీయ పెట్టుబడులను ఆకర్షించేందుకు గ్లోబల్ సమ్మిట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఈ రెండు సమీక్షల్లో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, ప్రత్యేక ప్రధాన కార్యదర్శి జయేష్ రంజన్, సలహాదారులు రామకృష్ణారావు, ఎన్‌వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డితో పాటు పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

## పత్తి కొనుగోళ్లలో రైతులకు ఎలాంటి
# ఇబ్బందులు లేకుండా చూడాలి

మొదటి పేజీ తరువాయి...

రాకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. "మనం బతకాలంటే రైతు బతకాలి" అనే విషయాన్ని ప్రతి ఒక్కరూ గుర్తుంచుకుని పనిచేయాలని అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో ముందుకు వెళ్లి పత్తి రైతులకు మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. పంట కోతకు దాదాపు రెండు నెలల ముందుగానే పత్తి కొనుగోళ్లపై సమీక్ష నిర్వహించడం మంచి పరిణామమని పేర్కొన్నారు. తెలంగాణలో ప్రకృతిపై ఆధారపడి పత్తి సాగు చేసే రైతులలో సన్న చిన్నకారు రైతులే అధికంగా ఉన్నందున, వారి ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని కొనుగోలు ప్రక్రియను ముందుగానే పకడ్బందీగా సిద్ధం చేయాలని ఆదేశించారు. పత్తి కొనుగోలు ప్రక్రియలో మధ్యవర్తుల జోక్యానికి ఎలాంటి అవకాశం ఇవ్వకూడదని మంత్రి స్పష్టం చేశారు. రైతుల నుంచి నేరుగా, పారదర్శకంగా పత్తి కొనుగోలు జరిగేలా అధికారులు పర్యవేక్షించాలని అన్నారు. గత సీజన్లలో పత్తి కొనుగోళ్లపై విజిలెన్స్, ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం గుర్తించిన అంశాలను పూర్తిగా పరిగణనలోకి తీసుకుని, ఈ సీజన్‌లో అటువంటి లోపాలు, అవకతవకలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. 2026–27 సీజన్‌లో రాష్ట్రంలో సుమారు 46.33 లక్షల ఎకరాల్లో పత్తి సాగు జరుగుతుందని, సుమారు 25.85 లక్షల మెట్రిక్ టన్నుల పత్తి ఉత్పత్తి అయ్యే అవకాశం ఉన్నట్టు అంచనా వేసినట్టు మంత్రి తెలిపారు. ఈ సీజన్‌కు Long Staple Cottonకు కేంద్ర ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.8,667 కనీస మద్దతు ధర ప్రకటించిందని, గత ఏడాదితో పోలిస్తే రూ.557 మీరా పెరిగిందని చెప్పారు.ప్రతి అర్హత కలిగిన రైతుకు MSP ప్రయోజనం అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని, రైతులు MSP కంటే తక్కువ ధరకు పత్తిని విక్రయించే పరిస్థితి ఎట్టి పరిస్థితుల్లోనూ రావద్దని ఆదేశించారు. రాష్ట్రంలోని 356 జిన్నింగ్ మిల్లులను నోటిఫై చేసి పత్తి కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా L1 నుంచి L12 వరకు అన్ని కేటగిరీల మిల్లులను అవసరానికి అనుగుణంగా ఒకేసారి ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. 15 నుంచి 30 రోజుల వ్యవధిలో అన్ని జిల్లాల్లో మిల్లులు అందుబాటులోకి వస్తే రైతులకు ఎంతో మేలు జరుగుతుందని అన్నారు. గత సీజన్‌లో 122 CCI కొనుగోలు కేంద్రాలు ఉండగా, ఈ సీజన్‌లో వాటి సంఖ్యను 131 కేంద్రాలకు పెంచినట్లు మంత్రి తెలిపారు. అన్ని కేంద్రాలు పూర్తిస్థాయిలో పనిచేసేలా ముందస్తు ఏర్పాట్లు చేయాలని ఆదేశించారు. మార్కెట్‌కు పత్తి రాక అధికంగా ఉండే ప్రాంతాల్లో అవసరమైన మేరకు అదనపు కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయాలని సూచించారు. ఒక ప్రాంతంలో జిన్నింగ్ మిల్లు అందుబాటులో లేకపోతే, సంబంధిత గ్రామాలు, మండలాలను సమీపంలోని నోటిఫైడ్ మిల్లుకు అనుసంధానం చేసి రైతులకు ఎక్కువ దూరం ప్రయాణించకుండా చూడాలన్నారు. ప్రతి జిల్లాలో జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి మానిటరింగ్ కమిటీలు సమర్థవంతంగా పనిచేయాలని మంత్రి ఆదేశించారు.

## నిషేధిత భూములపై ప్రజలు ఎలాంటి
# ఆందోళన చెందొద్దు

మొదటి పేజీ తరువాయి...

పిఓబి దరఖాస్తులకు సంబంధించి కేస్‌బై కేస్ ప్రతి రోజూ సమీక్షించాలి. 22ఎ పేరిట ఉద్దేశపూర్వకంగా పేదోడికి అర్హులకు అన్యాయం చేసే విధంగా వ్యవహరిస్తే ఊరుకునేదిలేదు.

సబ్ రిజిస్ట్రార్లకు విచక్షణాధికారాలు ఉండకూడదని అదనపు అధికారాలు వద్దని ఈ విషయంపై గతంలోనే చాలా స్పష్టత ఇచ్చాను. ఆన్‌లైన్‌లో ఏది ఉంటే దానికి ఆమోదం తెలిపేవరకే వారి అధికారాలను పరిమితం చేయాలని అధికారులను ఆదేశిస్తున్నాను. ప్రభుత్వ ఆస్తులను కాపాడే విషయంలో ఏమాత్రం రాజీపడే ప్రసక్తేలేదు. ఏ చిన్న తప్పుచేసినా క్షమించేదిలేదు, కఠిన చర్యలు తీసుకుంటాను. ఏదైనా సమస్య ఉంటే జిల్లా సబ్ రిజిస్ట్రార్‌లు కలెక్టర్ దృష్టికిగాని ఐజీ దృష్టికిగాని తీసుకురావాలి. పిఓబీ జాబితాలో ఉన్న ఆస్తుల రిజిస్ట్రేషన్‌లను గుడ్డిగా తిరస్కరించకుండా మూడు రోజుల సమయం తీసుకొని ఎందుకు తిరస్కరించవలసి వస్తుందన్న వివరాలను తెలియజేయాలి. పిఓబీకి సంబంధించి వచ్చిన ప్రతి దరఖాస్తును ఇకనుండి తహశీల్దార్‌కు పంపకుండా నేరుగా కలెక్టర్‌కే పంపించాలి. కలెక్టర్ నుండి డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్, డిస్ట్రిక్ట్ రిజిస్ట్రార్ నుండి కలెక్టర్ మధ్యనే ఉత్తర ప్రత్యుత్తరాలు జరగాలి, గతంలో నాన్ అగ్రికల్చర్, అగ్రికల్చర్, పీఓబీ జాబితాలు వేర్వేరుగా ఉండేవి. వీటిని సమీకృతం చేయడం వలన సబ్ రిజిస్ట్రార్ పరిశీలనలో కొన్ని ఆస్తులు, నిషేధిత జాబితాలో ఉన్నట్లు కనిపిస్తున్నందున మొత్తం రిజిస్ట్రేషన్ ఆపుతున్నారని ఫిర్యాదుల వస్తున్నాయి. తాజాగా అప్‌లోడ్ చేస్తున్న సమాచారంతో సరిపోల్చుకొని నిర్ణయాలు తీసుకోవాలి. సాయంత్రంలోగా నాలుగు జిల్లాల పరిధిలోని సబ్ రిజిస్ట్రార్ లతో సమావేశం నిర్వహించి ఉన్నత స్థాయి సమావేశంలో తీసుకున్న నిర్ణయాలను వారికి తెలియజేసి తక్షణం అమలుచేసే విధంగా చర్యలు తీసుకోవాలని స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ శాఖ ఐ.జి. ని ఆదేశించారు. ఈ సమావేశంలో రెవెన్యూ సెక్రెటరీ డి.ఎస్. లోకేశ్ కుమార్, స్టాంప్స్ & రిజిస్ట్రేషన్ ఐ.జి. రాజీవ్ గాంధీ హనుమంత్, ఆయా జిల్లాల కలెక్టర్లు, జిల్లా రిజిస్ట్రార్ లు పాల్గొన్నారు.

# 3.43 కోట్ల మందికి 'స్మార్ట్' ఆహార భద్రత

మొదటి పేజీ తరువాయి...

కమిషనర్ స్టీఫెన్ రవీంద్ర, పౌర సరఫరాల సంస్థ డైరెక్టర్ రోహిత్ సింగ్ తదితర ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌తోనూ మాట్లాడి ముఖ్యమంత్రి పర్యటన, బహిరంగ సభ ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. రాష్ట్రంలో ప్రస్తుతం 1,06,28,092 ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది లబ్ధిదారులు ఆహార భద్రత పరిధిలో ఉన్నారని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ప్రతి అర్హుడైన లబ్ధిదారుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా ప్రభుత్వం అందిస్తోందన్నారు. స్మార్ట్ రేషన్ కార్డుల ప్రవేశంతో ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత, సామర్థ్యం, లబ్ధిదారుల సౌలభ్యం మరింత పెరుగుతాయని చెప్పారు.

**ఏడాదిన్నరలో 16.32 లక్షల కొత్త కార్డులు**

2025 జనవరి 26 నుంచి ఇప్పటి వరకు 16,32,810 కొత్త ఆహార భద్రత కార్డులను జారీ చేసి, వాటి ద్వారా 61,08,544 మంది లబ్ధిదారులకు ఆహార భద్రత కల్పించినట్లు మంత్రి వెల్లడించారు. ఆగస్టు 2026 నాటికి రాష్ట్రంలో మొత్తం ఆహార భద్రత కార్డుల సంఖ్య 1.06 కోట్లకు చేరిందన్నారు.
తెలంగాణలో ఆహార భద్రత కార్యక్రమం ఏ స్థాయిలో కొనసాగుతోందో ఇందుకు ప్రభుత్వం చేస్తున్న వ్యయమే నిదర్శనమన్నారు. రేషన్ బియ్యం కోసం ఏటా సుమారు రూ.14 వేల కోట్లు, రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు మరో రూ.20 వేల కోట్ల వరకు ప్రభుత్వం వెచ్చిస్తోందని తెలిపారు.

**లబ్ధిదారుడికి ఇబ్బంది కలగొద్దు**

సంగారెడ్డి కార్యక్రమాన్ని ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని మంత్రి అధికారులను ఆదేశించారు. లబ్ధిదారుల తరలింపు, సీటింగ్, భద్రత, కార్డుల పంపిణీతో పాటు ముఖ్యమంత్రి పర్యటనకు సంబంధించిన ప్రతి అంశాన్ని ముందుగానే పకడ్బందీగా ప్రణాళిక చేయాలన్నారు. కార్యక్రమానికి సంబంధించిన మినిట్-టు-మినిట్ షెడ్యూల్ సిద్ధం చేసి నిర్దేశిత సమయంలో పూర్తి చేయాలని సూచించారు. సమాజంలోని వివిధ వర్గాలకు ప్రాతినిధ్యం వహించే వాస్తవ లబ్ధిదారులను గుర్తించి ముఖ్యమంత్రి చేతుల మీదుగా స్మార్ట్ రేషన్ కార్డులు అందించాలని చెప్పారు. అనంతరం రాష్ట్రవ్యాప్తంగా కార్డుల పంపిణీలో లబ్ధిదారుల గుర్తింపును ధ్రువీకరించి, పూర్తి పారదర్శకతతో కార్డులు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మిగిలిన జిల్లాల్లో నిర్వహించే కార్యక్రమాలకు సంబంధించి కలెక్టర్లకు స్పష్టమైన మార్గదర్శకాలు పంపాలని, అవసరమైన వ్యయంపై ముందుగానే స్పష్టత ఇవ్వాలని పౌర సరఫరాల శాఖ అధికారులకు సూచించారు.

**'ప్రతి అర్హుడికీ ఆహార భద్రతే లక్ష్యం'**

"తెలంగాణలో 1.06 కోట్ల ఆహార భద్రత కార్డుల ద్వారా 3.43 కోట్ల మంది ప్రజలకు ఆహార భద్రత కల్పిస్తున్నాం. ప్రతి అర్హుడికి నెలకు ఆరు కిలోల సన్నబియ్యాన్ని ఉచితంగా అందిస్తున్నాం. ఇంత భారీ సంక్షేమ కార్యక్రమాన్ని మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా లబ్ధిదారుడి చెంతకు తీసుకెళ్లడమే స్మార్ట్ రేషన్ కార్డుల లక్ష్యం" అని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ప్రభుత్వ ఆహార భద్రత కార్యక్రమం విస్తృతిని ప్రజల్లోకి తీసుకెళ్లాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 1.06 కోట్ల కార్డులు-3.43 కోట్ల లబ్ధిదారులు-ఉచిత సన్నబియ్యం వంటి కీలక అంశాలతో ప్రింట్, ఎలక్ట్రానిక్, సోషల్ మీడియాతో పాటు షార్ట్ వీడియోలు, రీల్స్ ద్వారా విస్తృత ప్రచారం చేపట్టాలని సూచించారు.

## టెస్సరాక్ట్‌కు భూ కేటాయింపులపై
# సమగ్ర విచారణ జరపాలి

మొదటి పేజీ తరువాయి...

అవసరమైతే లోకాయుక్త, న్యాయస్థానాలను ఆశ్రయిస్తామని, వాస్తవాలు తేలే వరకు వదిలిపెట్టబోమని స్పష్టం చేశారు. కాంగ్రెస్, బీజేపీ ఎంపీలు జీరో అని ఊరికే అనలేదు.. పాలమూరు-రంగారెడ్డి జాతీయ హోదాపై ఎంపీల వైఖరేందో చెప్పాలన్నారు. తెలంగాణ ప్రాజెక్టుల అనుమతులు రద్దు చేసే కుట్రను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకోవాలని, జీఆర్ఎంబీ (గోదావరి రివర్ మేనేజ్మెంట్ బోర్డు) సమావేశాన్ని తెలంగాణ ప్రభుత్వం బహిష్కరించాలని, లేకుంటే జల ఉద్యమం తప్పదని ఆయన హెచ్చరించారు. తెలంగాణ భవన్‌లో మంగళవారం కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. కొండల్‌రెడ్డి చెందిన కంపెనీ వివరాలు, దాని మూలధనం, ఉద్యోగుల సంఖ్య, కార్యాలయ చిరునామా, కంపెనీ చైర్మన్ వ్యవహారం, ప్రభుత్వ భూమి కేటాయింపు తదితర అంశాలను పరిశీలిస్తే ఇందులో భారీ కుంభకోణం జరిగిందని స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఈ వ్యవహారం రాష్ట్రంలో జరిగిన అతిపెద్ద భూ కేటాయింపు అక్రమాల్లో ఒకటిగా తాము అనుమానిస్తున్నామని పేర్కొన్నారు. కొండల్‌రెడ్డి తన లింక్డ్ ఇన్ ప్రొఫైల్లో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్, భూపాల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు తాను బాధ్యత వహిస్తున్నట్లు పేర్కొన్నారని కేటీఆర్ తెలిపారు. టెస్సరాక్ట్ సంస్థ ఏరోస్పేస్, డిఫెన్స్ రంగంలో పనిచేస్తున్నట్లు పేర్కొంటూ నిర్వహించిన కార్యక్రమంలో అమెరికా కాన్సుల్ జనరల్ కూడా పాల్గొన్న విషయాన్ని ఆయన ప్రస్తావించారు. అనంతరం యూఎస్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ ఎగ్జిక్యూటివ్ బోర్డులో టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ చైర్మన్‌గా కొండల్ చేరినట్లు సంబంధిత సంస్థ స్వయంగా ప్రకటించిందని కేటీఆర్ తెలిపారు.

**ఐదెకరాలు ఎలా కేటాయించారు?**

టెస్సరాక్ట్ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ వివరాలను పరిశీలించినప్పుడు అనేక అనుమానాస్పద అంశాలు బయటపడుతున్నాయని కేటీఆర్ అన్నారు. కంపెనీ వెబ్‌సైట్‌లో పేర్కొన్న ఫోన్ నంబర్ 123456789గా ఉందని, ఇలాంటి వివరాలు ఎలా ఉన్నాయో అర్థం కావడం లేదని వ్యాఖ్యానించారు. అంతేకాకుండా, 2025 మార్చి 31 నాటికి కంపెనీలో ఒక్క ఉద్యోగి కూడా లేరని, ఉద్యోగుల సంఖ్య సున్నా అని కంపెనీ వివరాల్లోనే పేర్కొన్నట్లు తెలిపారు.కంపెనీ పెయిడ్‌అప్ క్యాపిటల్ కేవలం రూ.1 లక్ష మాత్రమేనని, పటాన్‌చెరు ప్రాంతంలో ఒక చిన్న చిరునామాను కార్యాలయంగా చూపిస్తున్నారని ఆరోపించారు. ఇలాంటి ఆర్థిక సామర్థ్యం ఉన్న కంపెనీకి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం సుమారు ఐదెకరాల ప్రభుత్వ భూమిని కేటాయించిందని, ఆ భూమి విలువ సుమారు రూ.200 కోట్లు ఉంటుందని కేటీఆర్ ఆరోపించారు. అయితే ఆ భూమిని సుమారు రూ.7 కోట్లకే, గజానికి సుమారు రూ.3,700 చొప్పున కేటాయించినట్లు వివరాలను వెల్లడించారు.ఒక్క ఉద్యోగి లేని, రూ.లక్ష పెయిడ్‌అప్ క్యాపిటల్ ఉన్న కంపెనీకి రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని కేటాయించడం ఎలా సాధ్యమైంది? ఇది స్కాం కాదా?అని కేటీఆర్ ప్రశ్నించారు. భూమి కేటాయింపునకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు, ధర నిర్ణయం, అర్హత ప్రమాణాలు, పెట్టుబడి ప్రతిపాదనలు, ఉద్యోగాల కల్పన హామీలు,అధికారుల నిర్ణయాలుఅన్నింటినీ ప్రభుత్వం ప్రజలముందుఉంచాలని డిమాండ్ చేశారు.

**సంబంధంలేదని శ్రీధర్‌బాబు ఎలా చెబుతారు?**

టెస్సరాక్ట్ కంపెనీకి, సీఎం సోదరుడు కొండల్‌రెడ్డికి ఎలాంటి సంబంధం లేదని మంత్రి శ్రీధర్‌బాబు చెబుతున్నారన్నారు. అయితే కొండల్ రెడ్డి స్వయంగా తన లింక్డ్‌ఇన్ ప్రొఫైల్లో టెస్సరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నారని, యూఎస్ స్ట్రాటజిక్ పార్ట్‌నర్‌షిప్ ఫోరమ్ కూడా ఆయనను టెస్సరాక్ట్ చైర్మన్‌గా పేర్కొన్నప్పుడు మంత్రి శ్రీధర్‌బాబు ఎలా సంబంధం లేదని చెబుతున్నారని ప్రశ్నించారు. 'మీ శాఖలో ఏం జరుగుతుందో మీకు తెలియదా? ముఖ్యమంత్రి సోదరుడికి ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా?' అని శ్రీధర్‌బాబును ఆయన నిలదీశారు. కేవలం టెస్సరాక్ట్ వ్యవహారం మాత్రమే కాకుండా ముఖ్యమంత్రి కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన ఇతర వ్యాపారాలు, భూములు, ఒప్పందాలు, కాంట్రాక్టులపైనా గతంలో తాము ప్రశ్నలు లేవనెత్తామన్నారు. ముఖ్యమంత్రి మరో సోదరుడు అనుముల జగదీశ్‌రెడ్డి అమెరికాలో ఉండగా, ముఖ్యమంత్రి అమెరికా పర్యటన సందర్భంగా స్వచ్ఛ్ బయో సంస్థతో సుమారు రూ.1,000 కోట్ల ఒప్పందానికి సంబంధించిన ఎంఓయూ జరిగిందని కేటీఆర్ పేర్కొన్నారు. ఆ ఒప్పందం తర్వాత ఆ సంస్థకు ఎక్కడైనా భూములు కేటాయించారా? పెట్టుబడులు వచ్చాయా? అనే అంశాలను కూడా వెలికి తీస్తామని తెలిపారు.

**అప్పుడు అమృత్ కూడా..**

ముఖ్యమంత్రి బావమరిది సృజన్‌రెడ్డికి సంబంధించిన రూ.1,137 కోట్ల అమృత్ కాంట్రాక్టులపై గతంలోనే ప్రశ్నలు లేవనెత్తామని కేటీఆర్ గుర్తుచేశారు. సింగరేణి, సైట్ విజిటేషన్ సర్టిఫికెట్లు, ఇతర కాంట్రాక్టుల్లోనూ అక్రమాలు జరిగాయని తాము గతంలో ఆధారాలతో సహా ప్రజల ముందుంచామని అన్నారు. ఇప్పుడు టెస్సరాక్ట్ వ్యవహారం అదే పరంపరలో తాజాగా వెలుగులోకి వచ్చిన అంశమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి మరో సోదరుడు అనుముల తిరుపతిరెడ్డికి ఎలాంటి అధికారిక హోదా లేకపోయినా కొడంగల్‌లో అధికారిక కార్యక్రమాల్లో పాల్గొంటున్నారని కేటీఆర్ ఆరోపించారు. అధికారిక హోదా లేని వ్యక్తికి ఇంత ప్రోటోకాల్ ఎలా వస్తోంది?, ముఖ్యమంత్రి సోదరులకు ప్రత్యేక అధికారాలు, ప్రత్యేక నిబంధనలు ఉన్నాయా? అని ప్రశ్నించారు.

**సమగ్ర విచారణ జరగాలి..**

సీఎం కుటుంబ సభ్యులు, బంధువులకు సంబంధించిన అన్ని భూములు, కంపెనీలు, కాంట్రాక్టుల వివరాలను ప్రజల ముందుంచుతామని కేటీఆర్ తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కుటుంబ సభ్యులకు సంబంధించిన కాంట్రాక్టులు, కంపెనీల పైనా తాము గతంలో ప్రశ్నలు లేవనెత్తామన్నారు. అధికారంలో ఉన్న వ్యక్తుల కుటుంబ సభ్యులకు ప్రభుత్వ వనరులు, భూములు, కాంట్రాక్టులు దక్కుతున్నాయనే అంశంపై సమగ్ర దర్యాప్తు జరగాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కర్ణాటకలో మాజీ ముఖ్యమంత్రి సిద్ధరామయ్య సతీమణికి భూమి కేటాయింపు వ్యవహారాన్ని కూడా కేటీఆర్ ప్రస్తావించారు.

కర్ణాటకలో మూడు ఎకరాల భూ కేటాయింపుపై విచారణ, రాజకీయ ప్రకంపనలు వచ్చినప్పుడు తెలంగాణలో రూ.200 కోట్ల విలువైన ప్రభుత్వ భూమి కేటాయింపుపై ఎందుకు విచారణ జరగకూడదు? అని కేటీఆర్ ప్రశ్నించారు. కర్ణాటకలో ఒక న్యాయం, తెలంగాణలో మరో న్యాయం ఎలా ఉంటుందని నిలదీశారు. టెస్సరాక్ట్ భూ కేటాయింపు వ్యవహారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ వదిలిపెట్టబోమని కేటీఆర్ స్పష్టం చేశారు. త్వరలోనే తెలంగాణ గవర్నర్‌ను కలిసి అధికారికంగా ఫిర్యాదు చేస్తామని, సమగ్ర విచారణ జరిపించాలని కోరుతామని తెలిపారు. అవసరమైతే లోకాయుక్తను, న్యాయస్థానాలను కూడా ఆశ్రయిస్తామన్నారు.

# ఆ కంపెనీతో సీఎం సోదరులకు సంబంధం లేదు

మొదటి పేజీ తరువాయి...

బోర్డు డిసైడ్ చేసినదాని కంటే తాము రూపాయి కూడా తక్కువకు ఇవ్వలేదని, 32 మంది దరఖాస్తు చేసుకుంటే అందులో ఒకటి టెస్సరాక్ట్ కంపెనీ ఉందన్నారు. బీఆర్ఎస్ హయాంలో ముడుపులు తీసుకునే కంపెనీలకు భూములు ఇచ్చారా..? 'మీరు ఎందుకు తక్కువ ధరకు భూములు ఇచ్చారో కేటీఆర్ సమాధానం చెప్పాలి'అని మంత్రి శ్రీధర్‌బాబు డిమాండ్ చేశారు. 'నా శాఖలో ఎవరో చెబితే నేను పనిచేసే రకం కాదు .. నా శాఖలో జరిగిన ప్రతీ నిర్ణయం నాకు తెలుసు' అని మంత్రి పేర్కొన్నారు. మంగళవారం ఆయన సీఎల్పీ కార్యాలయంలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఏ కంపెనీ అయినా ప్రారంభంలో క్యాపిటల్ అమౌంట్ తక్కువ ఉంటుందన్నారు. టెస్సరాక్ట్‌కు సీఎం సోదరులకు సంబంధం లేదని, సోషల్ మీడియా పోస్టుల ఆధారంగా కేటీఆర్ ఆరోపణలు చేయడం ఆశ్చర్యంగా ఉందని మంత్రి శ్రీధర్‌బాబు మండిపడ్డారు. 5 ఎకరాలలో రూ.34 కోట్లతో ఏర్పాటయ్యే కంపెనీని రూ.200 కోట్ల కంపెనీ అని కేటీఆర్ చెప్పడం ఆశ్చర్యంగా ఉందన్నారు. నియమ నిబంధనల ప్రకారమే కేటాయింపులు జరిగాయని, ఎవ్వరికైనా ఫిర్యాదు చేసుకోవచ్చు. వాళ్లకి పూర్తి స్వేచ్ఛ ఉందన్నారు. పత్రికల్లో రాస్తారని నోటికొచ్చినట్లు మాట్లాడడం సరికాదన్నారు. రాష్ట్రానికి పరిశ్రమలు రావొద్దనే హిడెన్ ఎజెండాతో కేటీఆర్ ఇదంతా చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ హయాంలో లీజుకు ఇచ్చిన భూములను రెగ్యులరైజ్ చేశారని, అప్పుడు కేటీఆర్‌కు తప్పు అనిపించలేదా? అని మంత్రి శ్రీధర్‌బాబు నిలదీశారు.

'మేము హిల్ట్ పాలసీ ద్వారా నిరూపయోగంగా ఉన్న రెగ్యులరైజ్ అయిన భూములను బదలాయింపునకు ప్రయత్నం చేస్తున్నాం' అని అన్నారు. బీఆర్ఎస్ హయాంలోనే దోపిడీ జరిగిందని, భూముల కేటాయింపుపై విచారణ చేయిస్తామన్నారు. ఈ విషయంలో 'మాకు లేని ఆలోచనలు కల్పించారు'అని తెలిపారు. బీఆర్ఎస్ మళ్లీ అధికారంలోకి రావడం కలలో మాట అని అన్నారు. తమ ప్రభుత్వానికి కక్షధోరణి కానీ వ్యక్తిగతంగా కానీ లేదని, చట్ట ప్రకారం ముందుకు వెళ్లుతున్నామని, తాము కక్షతో ముందుకెళ్లితే మీరంతా ఎక్కడో ఉండేవాళ్లో తెలుసుకోవాలని మంత్రి హితవు పలికారు. తమ ప్రభుత్వం రెండున్నరేళ్లుగా ప్రతిపక్షాలు దుష్ప్రచారం చేస్తున్నా.. భయపెట్టినా పరిశ్రమలు వస్తున్నాయని తెలిపారు. పీఎం ఏక్తా మాల్ టెండర్లు పారదర్శకంగా జరిగాయని, ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ రూల్స్ ప్రకారం మాల్ నిర్మాణం జరుగుతోందన్నారు. రూ.200 కోట్ల సాఫ్ట్ లోన్ తిరిగి చెల్లించాల్సిందేనని, పీపీపీ మోడల్‌లో టెండర్ జరిగిందన్నారు. ప్రీ బిడ్డింగ్‌లో 7 మంది బిల్డర్లు పాల్గొంటే ఇద్దరిని ఎంపిక చేసారని మంత్రి తెలిపారు. పీఎం ఏక్తా మాల్ నిర్మాణంలో ప్రభుత్వపై భారం లేకుండా లాభం జరుగుతుందన్నారు.

# వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్సే గెలుస్తుంది

మొదటి పేజీ తరువాయి...

కొందరు దౌర్భాగ్యుల వల్లే కండువా కప్పుకున్నానని తీవ్రంగా చెప్పారు. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్సే గెలుస్తుందని ఘంటాపథంగా చెప్పారు. కామారెడ్డి జిల్లా బాన్సువాడ నియోజకవర్గంలోని బీర్కూర్ మండల కేంద్రంలో మంగళవారం నిర్వహించిన కార్యకర్తల సమావేశంలో పోచారం చేసిన వ్యాఖ్యలు రాజకీయవర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. మాజీ సీఎం కేసీఆర్‌ను మోసం చేసి కాంగ్రెస్ పార్టీలో చేరాలనే ఉద్దేశం తనకు లేదన్నారు. మాజీ సీంఎ కేసీఆర్ హయాంలోనే తన నియోజకవర్గంలో అభివృద్ధి జరిగిందని చెప్పారు. నియోజకవర్గంలోని కార్యకర్తలు చేసిన అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లుల కోసం తన కుమారుడు పోచారం భాస్కర్‌రెడ్డిని సీఎం సోదరుడు కృష్ణారెడ్డి వద్దకు పంపించానని తెలిపారు. అక్కడ బీఆర్ఎస్ ఎమ్మెల్యేల పనులకు సంబంధించిన బిల్లులు చెల్లించాలన్నా, కొత్త పనులు మంజూరు కావాలన్నా పార్టీ మారి కాంగ్రెస్ కండువా కప్పుకోవాల్సిందేనని స్పష్టంగా చెప్పారని పోచారం ఆరోపించారు. ఈ కారణంగానే తాను పార్టీ మారాల్సిన పరిస్థితి ఏర్పడిందని వివరించారు. తాను ఇప్పటికీ కాంగ్రెస్ జెండా కప్పుకోలేదు.. జాతీయ జెండానే కప్పుకున్నాను అని వ్యాఖ్యానించారు. కాంగ్రెస్‌లో చేరితే ఆరు నెలల్లోనే తన నియోజకవర్గానికి సంబంధించిన పెండింగ్ బిల్లులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారని.. కానీ ఇప్పటి వరకు సగం నిధులు మాత్రమే ఇచ్చారని చెప్పారు. బిల్లులు రాకపోవడంతో కాంట్రాక్టర్లు పనులు ఆపేశారని తెలిపారు. బిల్లుల విషయమై గత నవంబరులో నిర్వహించిన ఫిరాయింపు ఎమ్మెల్యేల భేటీలో తాను సీఎం రేవంత్‌ను సూటిగా ప్రశ్నించానని చెప్పారు. తన ఎమ్మెల్యేగిరిని కొన్నారా, తాను అమ్ముడుపోయానా? అని ప్రశ్నించానని వెల్లడించారు. అయితే నిధుల మంజూరుకు సంబంధించి సీఎం చెప్పినట్లుగా డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి పొంగులేటి మంజూరు చేయలేదన్నారు. పెండింగ్ నిధులు, అభివృద్ధి పనుల గురించి అడిగేందుకు తాను ఫోన్ చేస్తే సీఎం గానీ, మంత్రులు గానీ ఫోన్ ఎత్తడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజాప్రతినిధిగా నియోజకవర్గ ప్రజలకు ఇచ్చిన మాట నిలబెట్టుకోవడం కోసం అధికారులు, నాయకుల చుట్టూ తిరగాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. బాన్సువాడ నియోజకవర్గంలో నిర్వహించిన ఇంటెలిజెన్స్ సర్వేలో బీఆర్ఎస్‌కు అనుకూలంగా ఫలితాలు రాబోతున్నాయని, రానున్న ఎన్నికల్లో బీఆర్ఎస్సే గెలుస్తుందని కార్యకర్తలకు పోచారం ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు శశికాంత్, నార్ల రవీందర్, ఏర్వాల కృష్ణారెడ్డి, ఏజాజ్ శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

**మళ్లీ బీఆర్ఎస్‌లోకి పోచారం!**

పోచారం శ్రీనివాస్‌రెడ్డి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం ఇది తొలిసారేమీ కాదు. గతంలోనూ చాలా సందర్భాల్లో ఆయన ఇలాంటి వ్యాఖ్యలు చేశారు. అయితే ఈసారి చేసిన వ్యాఖ్యలను గమనిస్తే ఆయన మళ్లీ బీఆర్ఎస్‌కు దగ్గరవుతున్నట్టుగా ఉన్నాయని రాజకీయ పరిశీలకులు అంటున్నారు. అయితే పార్టీ మార్పు వెనుక ఉన్న కారణాలను కార్యకర్తల సమావేశంలో పోచారం వెల్లడించడంతో ఆయన వ్యాఖ్యలు ప్రస్తుతం అటు కాంగ్రెస్ పార్టీలో.. రాష్ట్ర రాజకీయాల్లో దుమారాన్ని రేపుతున్నాయి.

## జగద్గురు శంకరాచార్యులను దర్శించుకున్న మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం)శ్రీ హంపి విరూపాక్ష విద్యారణ్య మహా సంస్థానం హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య స్వామివారిని మెట్‌పల్లి మున్సిపల్ చైర్మన్ మైలారపు లింబాద్రి, పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మైలారపు రాంబాబు దర్శిం చుకుని ఆశీర్వాదం పొందారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని ప్రత్యేకంగా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు విధుమౌళి శర్మ, బాలకృష్ణ శర్మ, 13వ వార్డు కౌన్సిలర్ గుడికందుల అజయ్, ప్రముఖ వ్యాపారవేత్త చాడ చందు, ప్రధాన కార్యదర్శి ఎల్మీ రవి, కోశాధికారి దొంతుల లక్ష్మీనారాయణ, దేవాదాయ అధ్యక్షులు చాడ సురేష్ తదితరులు పాల్గొన్నారు.





## మెట్ పల్లి గంగపుత్ర సంఘం ఎన్నికలు ఏకగ్రీవం



మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) పట్టణంలోని గంగపుత్ర బెస్త సంఘం ఎన్నికలు ఏకగ్రీవం అయ్యాయి. మంగళవారం సమావేశంను నిర్వహించగా, నూతన అధ్యక్షునిగా పారిపెల్లి కిషన్,ఉపాధ్యక్షులుగా మాంకాల పోచయ్య, కార్యదర్శిగా కుడుముల సాయన్న ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అలాగే సహాయ కార్యదర్శిగా దీటి సుభాశ్, కోశాధికారిగా పర్రే చింతకింది సురేశ్, సలహాదారులుగా పరిమి నరసయ్య, మాంకాల చిన్నయ్య, కార్యవర్గ సభ్యులుగా పర్రే లింగయ్య, పారిపెల్లి రమేశ్, శంకర్, ప్రకాశ్, పారిపెల్లి శంకర్, చౌది గోపాల్, పారిపెల్లి శంకర్, బొబ్బిలి శ్రీనివాస్, బీటీ రవికుమార్, డిటి దీపక్, పారిపెల్లి కిషోర్ లను నూతన కార్యవర్గ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాగా వారిని మత్స్య పరిశ్రమిక అధ్యక్షులు పర్రే శంకర్ సన్మానించి సత్కరించారు. అనంతరం ఏకగ్రీవంగా ఎన్నికలకు సహకరించిన సంఘ సభ్యులకు ఎన్నికైన వారు కృతజ్ఞతలు తెలిపారు ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బీజేపి ముఖ్య కార్యకర్తల సమావేశం



ధర్మారం, ఆగస్టు 11 : ( ప్రజా కలం ప్రతినిధి ) పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రం లో వైశ్య భవన్ లో బీజేపి ముఖ్య కార్యకర్తల సమావేశం మంగళవారం రోజున జరిగినది ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా ధర్మారం మండల ఇన్చార్జి కొమ్ము రాంబాబు పాల్గొనగా బీజేపి మండల పార్టీ అధ్యక్షులు తీగుళ్ల సతీష్ రెడ్డి ఆధ్వర్యం లో ఈ కార్య క్రమం జరిగింది మండల భూత్ అదక్షులు శక్తి కేంద్రాల అధ్యక్షులను బలోపేతం చేయడమే లక్ష్యంగా బీజేపి ముంద అడుగు వేసింది, హర్ ఘర్ తిరంగ్ యాత్ర సందర్భంగా మండల కేంద్రం లో ఈనెల 15 ఆగస్టు రోజున బైక్ ర్యాలీ నిర్వహించబడు తుందని తీగుళ్ల సతీష్ రెడ్డి అన్నారు, ఈ కార్యక్రమం లో సీనియర్ నాయకులు శ్రీనివాస్ సందన వేణి లక్ష్మణ్, మండల ప్రధాన కార్యదర్శి దేవి రాజలింగు గోనే సాయి, మండల వైస్ ప్రెసిడెంట్ కర్రె లక్ష్మణ్ దేవి కొమరేష్ , కర్రే లక్ష్మణ్, సామంతుల కిరణ్, బీజేవైఎం మండల అధ్యక్షులు మామిడి చెందు, మాజీ యూత్ మండల అధ్యక్షులు కొలిపాక మణికంఠ, కేశినేని నాగరాజు, పల్లె లక్ష్మణ్, సగంటి నర్సయ్య, పాలమాకుల కర్ణాకర్ రెడ్డి, వన్నెల బాల్ రెడ్డి, బాపురెడ్డి, మేడవేణి మహేష్, రమేష్ నాడెం మల్లేశం, కొలిపాక మహేష్, మేడి రమేష్, శాఖపురం వెంకటేష్, రెడ్ల శ్రీనివాస్, చేనేల్లి సతీష్ కుమార్, ఎత్తరి గణేష్, కోటగిరి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.



## అంబరాన్నంటిన 'హర్ ఘర్ తిరంగా' వేడుకలు

### - కిలోమీటరుకు పైగా జాతీయ జెండాతో విద్యార్థుల ప్రదర్శన..
### - మార్మోగిన భారత్ మాతాకీ జై, వందేమాతరం నినాదాలు

మెట్‌పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) పట్టణంలో 'హర్ ఘర్ తిరంగా' వేడుకలు అంబరాన్నంటాయి. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో భాగంగా పట్టణంలో భారీ తిరంగా ర్యాలీని అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానిక ప్రజలతో పాటు విద్యార్థులు భారీ సంఖ్యలో తరలివచ్చారు. మెట్‌పల్లి పట్టణ వీధులు ముచ్చన్నెల జెండాల శోభతో పులకించిపోయాయి. ప్రధాన రహదారుల గుండా సాగిన తిరంగా ర్యాలీలో దారిపొడవునా 'భారత్ మాతాకీ జై', 'వందేమాతరం' నినాదాలు మార్మోగాయి. చేతబూనిన జాతీయ జెండాలతో విద్యార్థులు ఉత్సాహంగా ర్యాలీలో పాల్గొన్నారు. దాదాపు కిలోమీటరుకు పైగా పొడవైన జాతీయ జెండాతో విద్యార్థులు నిర్వహించిన ప్రత్యేక ప్రదర్శన పట్టణ ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ర్యాలీని తిలకించేందుకు రహదారులకు ఇరువైపులా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి జాతీయ జెండాకు నీరాజనాలు పలికారు. దేశభక్తిని చాటిచెప్పేలా నిర్వహించిన ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు, ఉపాధ్యాయులు సమన్వయంతో పాల్గొని ర్యాలీని విజయవంతం చేశారు. భావి భారత పౌరులైన విద్యార్థుల్లో దేశభక్తి భావనను పెంపొందించడంతో పాటు జాతీయ ఐక్యతను చాటిచెప్పేందుకే భారీ తిరంగా ర్యాలీ నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఇంత పెద్ద ఎత్తున విద్యార్థులు, ప్రజలు కలిసి తిరంగా ర్యాలీ నిర్వహించడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్లపై జాతీయ జెండాను ఎగురవేసి దేశభక్తిని చాటుకోవాలని పిలుపునిచ్చారు. మెట్‌పల్లిలో నిర్వహించిన ఈ తిరంగా ర్యాలీ పట్టణంలో పండుగ వాతావరణాన్ని నింపడమే కాకుండా ప్రజల్లో నవచైతన్యాన్ని తీసుకొచ్చింది.

## రౌడీ షీటర్ల కదలికలపై నిఘా ఉంచాలి

### జిల్లా ఎస్పీ అశోక్ కుమార్

కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ శ్రీ అశోక్ కుమార్

కేసుల దర్యాప్తు వేగవంతం చేయాలి – ప్రజలకు మెరుగైన సేవలు అందించాలి










మెట్ పల్లి:(కోరుట్ల) ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) : కోరుట్ల పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. జిల్లాలోని పోలీస్ స్టేషన్ల పనితీరు, నేరాల దర్యాప్తు పురోగతి, ప్రజలకు అందిస్తున్న పోలీస్ సేవలను నిరంతరం పర్యవేక్షించే క్రమంలో భాగంగా ఎస్పీ అశోక్ కుమార్ తనిఖీ నిర్వహించారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని కేసుల నమోదు, దర్యాప్తు పురోగతి, పెండింగ్ కేసుల వివరాలు తదితర అంశాలను ఎస్పీ పరిశీలించారు. ప్రతి కేసులో దర్యాప్తును నిబంధనల ప్రకారం సమర్థవంతంగా చేపట్టి, పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. అలాగే పోలీస్ స్టేషన్‌లో నిర్వహిస్తున్న స్టేషన్ రికార్డులు, కేసు డైరీలు, వివిధ రిజిస్టర్లు పరిశీలించారు. పోలీస్ సిబ్బంది విధుల్లో క్రమశిక్షణ, బాధ్యతాయుతంగా వ్యవహరించడం ఎంతో ముఖ్యమని, స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారుడి పట్ల మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను చట్టపరంగా పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. స్టేషన్ పరిధిలో బీట్ వ్యవస్థ అమలు, రాత్రి గస్తీ, నేరాల నియంత్రణ చర్యలు తదితర అంశాలపై ఎస్పీ సమీక్ష నిర్వహించారు. రౌడీషీటర్లు, పాత నేరస్తులు, నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతరం నిఘా ఉంచాలని, నేరాలు పునరావృతం కాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఫిర్యాదులపై వేగంగా స్పందిస్తూ బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగంపై జీరో టాలరెన్స్ విధానాన్ని అమలు చేయాలని, గంజాయి, డ్రగ్స్, నిషేధిత పదార్థాల అక్రమ రవాణాను అరికట్టేందుకు ప్రత్యేక నిఘా కొనసాగించాలని, యువతను మాదకద్రవ్యాల బారిన పడకుండా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. సైబర్ నేరాల పట్ల ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు గ్రామాలు, విద్యాసంస్థలు, వ్యాపార సంస్థల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని, ఆన్‌లైన్ మోసాలు, ఓటీపీ, కేవైసీ, ఫేక్ ఇన్వెస్ట్‌మెంట్ యాప్‌లు, డిజిటల్ అరెస్ట్ వంటి మోసాలపై ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. రోడ్డు భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు, హెల్మెట్, సీట్‌బెల్ట్ వినియోగంపై ప్రత్యేక డ్రైవ్‌లు నిర్వహించాలని, ప్రమాదకర డ్రైవింగ్, మైనర్ల వాహనాల వినియోగం, మోడిఫైడ్ సైలెన్సర్ల పై చట్టపరమైన చర్యలు కొనసాగించాలని తెలిపారు. ఎస్పి వెంట డిఎస్పి రాములు ,ఎస్.ఐ లు శ్యామ్ రాజ్, గంగాధర్ సిబ్బంది ఉన్నారు.

## వృద్ధులకు టాస్క సేవలు అభినందనీయం

మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 11(ప్రజాకలం): జిల్లాలో సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో సంఘాల ప్రతినిధులు చేస్తున్న సేవలు అభినందనీయమని మెట్ పల్లి మున్సిపల్ చైర్ పర్సన్ మైలారపు లింబాద్రి అన్నారు. మంగళవారం మెట్ పల్లి లో మున్సిపల్ చైర్ పర్సన్ స్వగృహ భవన్ లో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజెన్స్ అసోసియేషన్ జిల్లా శాఖ అధ్యక్షులు హరి అశోక్ కుమార్ ముద్రించిన వృద్ధుల చట్టం పత్రికలను మున్సిపల్ చైర్పర్సన్ లింబాద్రి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైర్ పర్సన్ మాట్లాడుతూ మెట్ పల్లి డివిజన్ కేంద్రం లో సీనియర్ సిటిజెన్స్ అధ్యక్షులు



వొజ్జెల బుచ్చి రెడ్డి, కార్యదర్శి సౌడాల కమలాకర్, కోశాధికారి ఎం. స్వామిల బృందం నిరాధరణకు గురవుతున్న వృద్ధులకు అండగా ఉంటూ వారి కేసుల పరిష్కారంకు చేస్తున్న కృషి ని అభినందించారు. సీనియర్ సిటిజెన్స్ జిల్లా అధ్యక్షులు హరి అశోక్ కుమార్ మాట్లాడుతూ అనేక సందర్భాల్లో పలువురు భాధిత వృద్ధులు మా అసోసియేషన్ ను ఆశ్రయిస్తున్నారని, వారి పిల్లలకు కౌన్సిలింగ్ ఇస్తూ పరిష్కారం చూపుతున్నామని, వినని వారిపై ఆర్డీ వో లకు ఫిర్యాదు చేసి కేసులు నమోదు చేయిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు పి. హన్మంత్ రెడ్డి,మెట్ పల్లి డివిజన్ అధ్యక్షులు వొజ్జెల బుచ్చి రెడ్డి, కార్యదర్శి సౌడాల కమలాకర్, కోశాధికారి మద్దెనపల్లి స్వామీ, ఎం. డీ. యాకుబ్ తదితరులు పాల్గొన్నారు.

## కేంద్రీయ విద్యాలయంలో వాక్-ఇన్ ఇంటర్వ్యూలు



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా చల్ గల్ కేంద్రీయ విద్యాలయంలో 2026–27 విద్యా సంవత్సరానికి వివిధ పోస్టుల్లో ఒప్పంద ప్రాతిపదికన సిబ్బంది ఎంపిక కోసం వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. ఆగస్టు 24న బాలవాటిక ఉపాధ్యాయులు, ప్రాథమిక ఉపాధ్యాయుల పోస్టులకు, ఆగస్టు 25న కంప్యూటర్ ఇన్‌స్ట్రక్టర్, స్పెషల్ ఎడ్యుకేటర్, సంగీతం, నృత్య శిక్షకుల పోస్టులకు వాక్–ఇన్ ఇంటర్వ్యూలు నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. అర్హత, ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంబంధిత విద్యార్హతలు, ధ్రువపత్రాలతో నిర్ణీత తేదీల్లో కేంద్రీయ విద్యాలయ చల్గల్‌కు హాజరు కావాలని కలెక్టర్ సూచించారు. ఇంటర్వ్యూలకు సంబంధించిన అర్హతలు, ఖాళీలు, సమయాలు, అవసరమైన ధ్రువపత్రాల వివరాల కోసం కేంద్రీయ విద్యాలయంలో సంప్రదించాలని, అలాగే కేంద్రీయ విద్యాలయ సంఘటన్ అధికారిక వెబ్‌సైట్‌ను పరిశీలించాలని తెలిపారు.

## ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకురావడంలో వార్తా పత్రికల పాత్ర కీలకం..

### - సంక్షేమ శాఖమంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్

వెల్గటూర్, ఆగస్టు 11, ప్రజాకలం ప్రతినిధి :ప్రజా సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకురావడంతో పాటు, సమాజాన్ని చైతన్యవంతం చేయడంలో వార్తా పత్రికలు కీలకమైన పాత్ర పోషిస్తున్నాయని రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్‌లో జరిగిన ఓ వార్తా



పత్రిక వార్షికోత్సవ వేడుకల్లో ఐటీ శాఖ మంత్రి దుద్దిల్ల శ్రీధర్ బాబుతో కలిసి, అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు వెలుగులోకి తీసుకురావడంలో వార్తా పత్రికలు చేస్తున్న కృషి అభినందనీయమని అన్నారు. ప్రజాస్వామ్యంలో పత్రికా స్వేచ్ఛకు, బాధ్యతా యుతమైన జర్నలిజానికి ఎంతో ప్రాధాన్యత ఉందని పేర్కొన్నారు. ప్రజల గొంతుకగా నిలుస్తూ, ప్రభుత్వానికి ప్రజలకు మధ్య వారధిగా పని చేయడం వార్తా పత్రికల బాధ్యత అని అన్నారు. పత్రికలు ఉన్నత ప్రమాణాలతో ప్రజాసేవలో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

## సింగిల్ విండో చైర్మన్ పదవిని బీసీలకే కేటాయించాలి

### - మండల బీసీ కులాల ఐక్యవేదిక గౌరవ అధ్యక్షులు అల్లె వెంకటేష్ యాదవ్



ఎండపల్లి, ఆగస్టు 11 : (ప్రజా కలం ప్రతినిధి ) ఎండపల్లి మండల కేంద్రం లోని సింగిల్ విండో చైర్మన్ పదవిని ఈసారి బీసీ సామాజిక వర్గానికే కేటా యించాలని బీసీ కులాల ఐక్యవేదిక మండల శాఖ గౌరవ అధ్యక్షులు అల్లే వెంకటేష్ యాదవ్ డిమాండ్ చేశారు. సింగిల్ విండో చైర్మన్ పదవిలో గత నలభై ఏళ్లుగా అగ్ర వర్గాల లో ఒకే సామాజిక వర్గానికి చెందిన వారు కొనసాగు తున్నారని సింగిల్ విండో చైర్మన్ పదవికి బీసీ సామాజిక వర్గ నాయకులు అర్హులు కారా అని అల్లె వెంకటేష్ యాదవ్ ప్రశ్నించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం సింగిల్ విండో చైర్మన్ లను నామి నేటెడ్ పద్ధతిలో నియమి స్తున్నందున ఈసారి బీసీలకు అవకాశం కల్పించాలని లేనియెడల ప్రత్యక్ష ఎన్నికలు నిర్వ హించాలని అల్లె వెంకటేష్ యాదవ్ డిమాండ్ చేశారు.

## పోలీస్ శాఖకు మంచి పేరు తేవాలి : జిల్లా ఎస్పి అశోక్ కుమార్

జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం)

కొత్త బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తూ పోలీస్ శాఖకు మంచి పేరు తీసుకురావాలని జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆకాంక్షించారు. జిల్లా పోలీస్ ఇంటిలిజెన్స్ విభాగంలో హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్న వావిలాల గంగాధర్ ఇటీవల ఏఎస్ఐగా పదోన్నతి పొందారు. ఈ సందర్భంగా మంగళవారం జిల్లా ఎస్పీ అశోక్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం ఎస్పీ అశోక్ కుమార్ మాట్లాడుతూ పదోన్నతి పొందిన గంగాధర్‌కు అభినందనలు తెలిపారు. ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందిస్తూ, విధి నిర్వహణలో నిబద్ధత, క్రమశిక్షణతో ముందుకు సాగాలని సూచించారు. పదోన్నతి అనేది బాధ్యతను మరింత పెంచుతుందని, ప్రజలతో సత్సంబంధాలు కొనసాగిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో కీలకంగా వ్యవహరించాలని ఎస్పీ సూచించారు. పదోన్నతి పొందిన గంగాధర్ ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు.



ప్రజా కలం
బుధవారం, ఆగస్టు 12, 2026

# ఉచిత హామీలు.. భవిష్యత్ తరాలపై భారం?

భారత రాజకీయాల్లో 'ఉచితాలు' గత రెండు దశాబ్దాలుగా ఎన్నికల చర్చల్లో కీలక అంశంగా మారాయి. ఒకప్పుడు విద్య, మధ్యాహ్న భోజనం, ఆహార భద్రత వంటి ప్రాథమిక సంక్షేమ కార్యక్రమాలకే పరిమితమైన ప్రభుత్వ జోక్యం, క్రమంగా ఉచిత విద్యుత్, ఉచిత బస్సు ప్రయాణం, నగదు బదిలీలు, ఉచిత గ్యాస్ సిలిండర్లు, గృహోపకరణాలు, మహిళలకు ఆర్థిక సహాయం, నిరుద్యోగ భృతి వంటి పథకాల వరకు విస్తరించింది. అయితే సంక్షేమం, ఉచితం రెండూ ఒకటేనని భావించడం సరికాదు. భారత రాజ్యాంగంలోని ఆదేశిక సూత్రాలు ప్రజల విద్య, ఆరోగ్యం, ఆహార భద్రత, సామాజిక న్యాయం, జీవన ప్రమాణాల మెరుగుదలకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని నిర్దేశిస్తున్నాయి. ఈ నేపథ్యంలో పేదలకు ఆహారం, వైద్యం, విద్య, సామాజిక భద్రత వంటి సేవలు అందించడం సంక్షేమ రాజ్య బాధ్యతగా చూడవచ్చు. అయితే ఉత్పాదకతను పెంచే లక్ష్యం లేకుండా, దీర్ఘకాలిక సామాజిక లేదా ఆర్థిక ప్రయోజనాలను పరిగణనలోకి తీసుకోకుండా కేవలం ఎన్నికల ప్రయోజనం కోసం ప్రకటించే పథకాలపై మాత్రం ఆర్థికపరమైన పరిశీలన అవసరం. రిజర్వ్ బ్యాంక్ సహా పలు ఆర్థిక సంస్థలు కూడా రాష్ట్రాల ఆర్థిక స్థిరత్వంపై ఇటువంటి వ్యయాల ప్రభావాన్ని పదేపదే ప్రస్తావిస్తున్నాయి. భారతదేశంలో సంక్షేమ పథకాల చరిత్ర సుదీర్ఘమైనది. తమిళనాడులో విద్య, మధ్యాహ్న భోజన పథకాలు సామాజిక మార్పుకు దోహదపడ్డాయి. అనంతరం తక్కువ ధరకు ఆహార ధాన్యాలు, ఉచిత టెలివిజన్లు, మిక్సీలు, గ్రైండర్లు, ల్యాప్‌టాప్‌లు వంటి పథకాలు వివిధ రాష్ట్రాల్లో ఎన్నికల హామీలుగా మారాయి. ఇటీవలి కాలంలో కర్ణాటకలో గృహలక్ష్మి, శక్తి, తెలంగాణలో రైతు భరోసా, మహిళా సంక్షేమ పథకాలు, ఆంధ్రప్రదేశ్‌లో నగదు బదిలీ ఆధారిత సంక్షేమ కార్యక్రమాలు, తమిళనాడులో ఉచిత బస్సు ప్రయాణం, పంజాబ్, ఢిల్లీ తదితర ప్రాంతాల్లో ఉచిత విద్యుత్, నీటి వంటి పథకాలు రాజకీయ చర్చలో నిలిచాయి. వీటిలో కొన్ని నిజమైన సామాజిక భద్రతను అందిస్తుండగా, మరికొన్నింటి దీర్ఘకాలిక ఆర్థిక ప్రభావాన్ని నిరంతరం సమీక్షించాల్సిన అవసరం ఉంది. అయితే ఉచితాలు లేదా సబ్సిడీలన్నింటినీ ప్రతికూలంగా చూడటం కూడా సరైన దృక్పథం కాదు. ఆహార ధాన్యాల సాయం కోట్లాది పేద కుటుంబాలకు ఆహార భద్రత కల్పిస్తోంది. ఆరోగ్య పథకాలు పేద కుటుంబాల వైద్య వ్యయాన్ని తగ్గిస్తున్నాయి. విద్యార్థులకు సైకిళ్లు, పుస్తకాలు లేదా డిజిటల్ పరికరాలు అందించడం విద్యావకాశాలను విస్తరించగలదు. మహిళలకు లక్ష్యిత ఆర్థిక సహాయం కుటుంబ ఆర్థిక భద్రతతో పాటు వారి నిర్ణయాధికారాన్ని పెంచగలదు. కాబట్టి ప్రతి ఉచిత పథకాన్ని ఒకే గాటన కట్టడం కన్నా దాని సామాజిక ప్రయోజనం, లక్ష్యిత లబ్ధి, ఆర్థిక భారం, దీర్ఘకాలిక ఫలితాలను విడివిడిగా పరిశీలించడం అవసరం. ఇదే సమయంలో రాష్ట్రాల ఆర్థిక పరిస్థితిని విస్మరించలేం. నిరంతరం పెరుగుతున్న రెవెన్యూ వ్యయం, అప్పులు, వడ్డీ భారం మధ్య భారీ స్థాయి నగదు బదిలీలు లేదా సబ్సిడీలను కొనసాగించడం భవిష్యత్ ఆర్థిక స్థిరత్వంపై ప్రభావం చూపవచ్చు. సంక్షేమ వ్యయం పెరిగి, రహదారులు, సాగునీరు, పారిశ్రామిక మౌలిక వసతులు, పాఠశాలలు, ఆసుపత్రులు వంటి దీర్ఘకాలిక ఆస్తుల సృష్టికి నిధులు తగ్గితే అభివృద్ధి వేగం దెబ్బతినే ప్రమాదం ఉంది. ముఖ్యంగా స్థిరమైన ఆదాయ వనరులు లేకుండా దీర్ఘకాలిక హామీలను అమలు చేస్తే వాటి భారాన్ని చివరకు భవిష్యత్ తరాలే మోయాల్సి రావచ్చు.

అందుకే అవసరమైంది సంక్షేమానికి వ్యతిరేకత కాదు; సమతుల్య సంక్షేమ విధానం. ఎన్నికల హామీగా ప్రకటించే ప్రతి పెద్ద పథకానికి ముందుగానే ఆర్థిక ప్రభావ అంచనా ఉండాలి. దాని వార్షిక వ్యయం ఎంత? నిధులు ఎక్కడి నుంచి సమకూరుతాయి? లబ్ధిదారులు ఎవరు? ఎంతకాలం అమలు చేయాలి? ఉపాధి, ఉత్పాదకత, మానవ వనరుల అభివృద్ధిపై దాని ప్రభావం ఏమిటి? వంటి అంశాలను ప్రజలకు స్పష్టంగా వెల్లడించాలి.

అలాగే రాష్ట్రాల అప్పులు, ఆఫ్-బడ్జెట్ రుణాలు, గ్యారంటీలు, సబ్సిడీలు, నగదు బదిలీలను కలిపి చూసే సమగ్ర ఆర్థిక పారదర్శకత అవసరం. ఎన్నికల హామీల ఆర్థిక సాధ్యతపై ఓటర్లకు సులభంగా అర్థమయ్యే సమాచారాన్ని అందించే వ్యవస్థను కూడా పరిశీలించాలి. ప్రజాస్వామ్యంలో ఓటరుకు హామీ మాత్రమే కాదు, ఆ హామీని అమలు చేయడానికి అయ్యే ఖర్చు, దాని మూలం కూడా తెలిసే హక్కు ఉంది. సంక్షేమ రాజ్యం రాజ్యాంగ లక్ష్యమే. కానీ సంక్షేమం అంటే కేవలం ఉచితాల పంపిణీ కాదు. నాణ్యమైన విద్య, అందుబాటులో ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధి, ఉపాధి అవకాశాలు, మౌలిక వసతులు, పారిశ్రామిక పెట్టుబడులు, వ్యవసాయ ఉత్పాదకత పెంపు కూడా ప్రజా సంక్షేమంలో భాగమే. ప్రజలకు ఈరోజు ఉపశమనం కల్పించడంతో పాటు రేపు వారు ప్రభుత్వ సాయంపై ఆధారపడకుండా స్వయం సమృద్ధి సాధించేలా చేయడం మరింత శాశ్వతమైన సంక్షేమం. అందువల్ల 'ఉచితం' అనే రాజకీయ ఆకర్షణకు, 'సంక్షేమం' అనే సామాజిక బాధ్యతకు మధ్య స్పష్టమైన రేఖ అవసరం. పేదలకు భద్రత కల్పించే పథకాలు కొనసాగాలి; అయితే ఆర్థిక స్థిరత్వాన్ని దెబ్బతీసే హామీలకు నియంత్రణ ఉండాలి. ప్రజల తక్షణ అవసరాలకు అండగా నిలుస్తూనే, భవిష్యత్ తరాలకు ఆర్థిక భారం మిగల్చని విధానమే నిజమైన సంక్షేమం. అదే సామాజిక న్యాయానికి, ఆర్థిక క్రమశిక్షణకు, దీర్ఘకాలిక అభివృద్ధికి బలమైన పునాది.

**- హెచ్. ప్రతాప్**

# బోనాల సాక్షిగా.. కళాకారుల ఐక్యత!

## రాష్ట్రం సుభిక్షంగా ఉండాలి - రైతాంగానికి మంచి పంటలు పండాలి
## కళాకారులకు ఎల్లప్పుడూ అండగా ఉంటా - మాజీ మంత్రి జీవన్ రెడ్డి



జగిత్యాల ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా కేంద్రంలో కళాకారుల ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల పండుగలో మాజీ మంత్రి,బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తాటిపర్తి జీవన్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా కళాకారులు, ఆడబిడ్డలు బోనాలు ఎత్తుకుని ఘనంగా నిర్వహించిన ఉత్సవాల్లో ఆయన పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా జీవన్ రెడ్డి మాట్లాడుతూ.. రాష్ట్రం సుభిక్షంగా ఉండాలని, వర్షాలు సమృద్ధిగా కురిసి కాలం అనుకూలంగా ఉండాలని ఆకాంక్షించారు. రైతాంగానికి మంచి పంటలు పండాలని, సమాజం శాంతి,సౌభాగ్యాలతో కళకళలాడాలని కోరుతూ ఆడబిడ్డలు బోనాలు ఎత్తుకుని పండుగను ఘనంగా నిర్వహించడం అభినందనీయమన్నారు.తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు ఉద్యమంలో అప్పటి ఉద్యమ నాయకత్వం పిలుపు మేరకు కళాకారులు, జానపద కళాకారులు కీలక పాత్ర పోషించారని జీవన్ రెడ్డి గుర్తుచేశారు. గజ్జె కట్టి ప్రజలను చైతన్యపరిచారని, తెలంగాణ భావనలను ప్రజల్లోకి తీసుకెళ్లారని అన్నారు. నీళ్లు, నిధులు,నియామకాలు తెలంగాణ ప్రజల హక్కులనే భావనను ప్రజల్లో బలంగా నాటడంలో కళాకారుల పాత్ర మరువలేనిదన్నారు.గోదావరి, కృష్ణా జలాలపై తెలంగాణకు హక్కులు సాధించుకోవాలనే ఉద్యమ స్ఫూర్తిని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కళాకారులు ముందుండి పనిచేశారని తెలిపారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడి దశాబ్ద కాలం పూర్తయినప్పటికీ ఇంకా సాధించాల్సింది ఎంతో ఉందన్నారు.రాబోయే కాలంలో జల వనరులపై హక్కులు సాధించడంతో పాటు యువతకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరికీ విద్య,ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వ లక్ష్యంగా ఉండాలని ఆకాంక్షించారు.జగిత్యాల ఉద్యమాల గడ్డ అని, తెలంగాణ ఉద్యమంలో జగిత్యాల ప్రత్యేక పాత్ర పోషించిందని జీవన్ రెడ్డి అన్నారు.తెలంగాణ రాష్ట్ర ఉద్యమాన్ని బలోపేతం చేసేందుకు జగిత్యాల కళాకారులు నిస్వార్థంగా ముందుకు వచ్చి ప్రజలను చైతన్యపరిచారని గుర్తుచేశారు.ప్రస్తుతం కళాకారులు,ఆడబిడ్డలు బోనాలు ఎత్తుకుని నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని చూస్తుంటే తెలంగాణ తల్లి బోనం ఎత్తుకుని ముందుకు సాగుతున్నట్లుగా అనిపిస్తోందన్నారు.తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో కళాకారులు చేసిన కృషికి అభినందనలు తెలిపారు. భవిష్యత్తులోనూ కళాకారులను ఆదరించే విధంగా, వారికి అండగా నిలిచే విధంగా తాము కృషి చేస్తామని చెప్పారు. కళాకారులకు బీఆర్ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ నాయకత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,తాను కూడా ఒక సోదరుడిగా,ఆప్తుడిగా వారికి తోడుగా ఉంటానని మాజీ మంత్రి జీవన్ రెడ్డి భరోసా ఇచ్చారు.

# డ్రంక్ అండ్ డ్రైవ్ లో పట్టుబడ్డ వ్యక్తికి రూ.5000 జరిమానా




మెట్ పల్లి టౌన్ ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) జగిత్యాల జిల్లా మెట్ పల్లి పట్టణంలో సోమవారం సాయంత్రం పోలీసులు డ్రంక్ అండ్ డ్రైవ్ వాహనాల తనిఖీలు నిర్వహించగా పట్టణానికి చెందిన రంగు హరీష్ అనే వ్యక్తి మద్యం సేవించి పట్టుబడితే అతని పై కేసు నమోదు చేసి మంగళవారం మెట్ పల్లి కోర్టులో హాజరుపరచగా, అతనికి సెకండ్ క్లాస్ మేజిస్ట్రేట్ దయ్య రాజారాం రూ. 5 వేలు జరిమానా విధించినట్లు మెట్ పల్లి ఎస్సై పబ్బ కిరణ్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా మెట్ పల్లి ఎస్సై మాట్లాడుతూ.. ఎవరైనా మద్యం సేవించి వాహనాలు నడిపితే చట్టరీత్యా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్సై పబ్బ కిరణ్ కుమార్ పేర్కొన్నారు.

# మాల్టాలో జగిత్యాల యువకుడి దుర్మరణం





జగిత్యాల్ ప్రతినిధి ఆగస్టు 11 (ప్రజాకలం) జిల్లా కేంద్రంలోని ఇస్లాంపురకు చెందిన (27) ఏళ్ల యువకుడు యూరప్‌లోని మాల్టాలో జరిగిన రోడ్డు ప్రమాదంలో దుర్మరణం చెందినట్లు కుటుంబ సభ్యులకు సమాచారం అందింది. మహమ్మద్ జవ్వాద్ (27)మాల్టాలోని ఓ కంపెనీలో ఉద్యోగం చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. కాగా, మంగళవారం కారులో వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ట్రక్కు అతని కారును బలంగా ఢీకొట్టినట్లు సమాచారం. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ముజాహిద్ మహ్మద్ అక్కడికక్కడే మృతి చెందినట్లు తెలిసింది. విదేశీ గడ్డపై జగిత్యాల యువకుడు మృతి చెందడంతో ఇస్లాంపురలో విషాదఛాయలు అలుముకున్నాయి.ముజాహిద్ మృతదేహాన్ని స్వస్థలానికి తీసుకురావడానికి కుటుంబ సభ్యులు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

# చిన్నపేల్లి దేవేందర్ మాతృమూర్తి కి నివాళులర్పించిన మాజీ జెడ్పిటిసి మేడిశెట్టి రాములు

(వరంగల్/పర్వతగిరి) ఆగస్టు 11, ప్రజాకలం ప్రతినిధి:

పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు వీరాభిమాని చినపెల్లి దేవేందర్ మాతృమూర్తి చినపెల్లి కమలమ్మ సోమవారం మరణించారు. ఈ విషయం తెలుసుకున్న జిల్లా కాంగ్రెస్ నాయకులు, మాజీ జడ్పీటీసీ మేడిశెట్టి రాములు మంగళవారం కమలమ్మ భౌతికకాయాన్ని సందర్శించి, పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తల్లిని కోల్పోయి కన్నీటిపర్యంతమవుతున్న దేవేందర్‌ను రాములు ఓదార్చి, ఆయన కుటుంబానికి ధైర్యం చెప్పారు. కమలమ్మ ఆత్మకు శాంతి చేకూరాలని, వారి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ గంగాధర్ రావు, మాజీ జిల్లా పరిషత్ సభ్యులు మహమ్మద్ సర్వర్, కాంటెస్టెడ్ జడ్పీటీసీ జాటోత్ శ్రీనివాస్, కాంటెస్టెడ్ సర్పంచ్ సింగారం రమేష్, మాజీ సర్పంచ్‌లు బొట్ల కిష్టయ్య, గోనె సంపత్, మాజీ ఉప సర్పంచ్‌లు రంగు జనార్దన్,



ఆదొండ బిక్షపతి, పార్టీ నాయకులు జిల్లా ధర్మయ్య, డాక్టర్ శ్రీనివాస్, కొండల వెంకన్న, సోషల్ మీడియా ప్రతినిధి బోట్ల భాస్కర్, డీలర్ దర్గస్వామి, మైనార్టీ నాయకురాలు సుల్తానా, జూలపల్లి సురేందర్ రావు, కంటెం ఏకాంతం, సుధాకర్, బొట్ల కుమార్, చినపాక శ్రీకాంత్, కనకరాజు, మొగిలి యాకయ్య, వీరాస్వామి తదితరులు పాల్గొని కమలమ్మ భౌతికకాయానికి నివాళులు అర్పించారు.

# మృతురాలి భౌతిక దేహానికి నివాళులర్పించిన దళిత రత్న అవార్డు గ్రహీత చిన్నపాక శ్రీనివాస్




(వరంగల్/ పర్వతగిరి) ఆగస్టు 11, ప్రజాకలం ప్రతినిధి

పర్వతగిరి మండల కేంద్రానికి చెందిన సీనియర్ నాయకులు చిన్నపెల్లి దేవేందర్ మాతృమూర్తి చిన్నపెల్లి కమలమ్మ సోమవారం సాయంత్రం అనారోగ్యంతో స్వర్గస్తులైన విషయం తెలుసుకొని మంగళవారం వారి ఇంటికి వెళ్లి కమలమ్మ భౌతిక దేహానికి నివాళులర్పించి, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించిన దళిత రత్న అవార్డు గ్రహీత చిన్నపాక శ్రీనివాస్. ఈ కార్యక్రమంలో మాజీ ఏఎంసి డైరెక్టర్ పట్టాపురం ఏకాంతం గౌడ్, అంబేద్కర్ ఫిలాసఫీ అవార్డు గ్రహీత జంగిలి బాబు, జిల్లా కార్యదర్శి మాసానీ యాకూబ్, సీనియర్ నాయకులు వడ్లకొండ శ్రీనివాస్, సీనియర్ నాయకులు జిల్లా కనకయ్య, పట్టణ అధ్యక్షులు మెరుగు వెంకన్న, ఎమ్మార్పీఎస్ జిల్లా అధికార ప్రతినిధి జిల్లా ధర్మయ్య, మాజీ సర్పంచ్ రాపాక రేణుక నాగయ్య, సీనియర్ నాయకులు చిన్నపాక వెంకటయ్య, తాటికాయల నరసయ్య, సీనియర్ నాయకులు జీడి వల్ రాజు, సీనియర్ నాయకులు బొట్ల మధు, సోషల్ మీడియా అధ్యక్షులు బోట్ల భాస్కర్, రావుర్ రవి, వల్లందాస్ కుమార్, కందికట్ల సమ్మయ్య తధితరులు పాల్గొన్నారు.

# పలు బాధిత కుటుంబాలకు మాజీ మంత్రి ఎర్రబెల్లి పరామర్శ



(వరంగల్/ పర్వతగిరి ) ఆగస్టు 11, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి మండలం కేంద్రంలో ఇటీవల రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతు మృతిచెందిన సమీప బంధువు విశ్వజెనీత్ కరస్పాండెంట్ ఎర్రబెల్లి హరీకుమార్ కుటుంబ సభ్యులను పరామర్శించి, అనంతరం అదే గ్రామానికి చెందిన నాయకులు చిన్నపెల్లి దేవేందర్ మాతృమూర్తి చిన్నపెల్లి కములమ్మ సోమవారం మరణించగా వారి భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించి, ఇటీవల ప్రమాదవశాత్తు మృతిచెందిన నీరటి కొమురమ్మ, చీదురు ఏకంబ్రం, గాడిదాసు వీరాస్వామి కుటుంబాలను పరామర్శించి, అనంతరం వారి కుటుంబ సభ్యులకు ప్రగడ సానుభూతి తెలిపిన, మనోధైర్యాన్ని కల్పించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, ఈ పరామర్శలో సొసైటీ చైర్మన్ యం.మనోజ్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు ఎర్రబెల్లి రాజేశ్వర్ రావు, మాజీ మండల అధ్యక్షులు రంగు కుమార్ గౌడ్, మాజీ సర్పంచ్ లు బొట్ల కిష్టయ్య, గౌనె సంపత్, మండల మాజీ కోప్షన్ ఎంపీటీసీ ఎస్కే షబ్బీర్ పాషా, మండల నాయకులు బొట్ల మధు, మెరుగు వెంకటేశ్వర్లు, రంగు కుమార్ (ఫెర్టిలైజర్), కొప్పు రాజు, తుంగ రాజు, చిరుత విజయ్, దొమ్మటి రాజు, రాపోలు యాకయ్య, ముంజ శ్రావణ్ గౌడ్, బొట్ల భాస్కర్, జంగా వీరమల్లు, అంబటి కుమార్, చింతపట్ల సునీల్, బంధారపు రంజిత్, బొట్ల శ్రీకాంత్ సోషల్ మీడియా చిన్నపెల్లి అజయ్ తదితరులు పాల్గొన్నారు.

# పంద్రాగస్టు వేడుకలు ఘనంగా నిర్వహించాలి



## - జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్

ప్రజా కలం ఆగస్టు 11 (గద్వాల ప్రతినిధి)

స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అధికారులను ఆదేశించారు. మంగళవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం కాన్ఫరెన్స్ హాల్‌లో అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు.

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో నిర్వహించనున్న వేడుకలకు వేదిక, పారిశుధ్యం, తాగునీరు, సీటింగ్ తదితర ఏర్పాట్లు పక్కాగా చేయాలని సూచించారు. శాఖల వారీగా స్టాల్స్ ఏర్పాటు చేయడంతో పాటు విద్యార్థులతో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించాలని అన్నారు. అన్ని శాఖల అధికారులు, సిబ్బంది వేడుకలకు విధిగా హాజరు కావాలని ఆదేశించారు.

ఈ నెల 15 నుంచి అర్హులకు స్మార్ట్ రేషన్ కార్డులు అందించేందుకు ఏర్పాట్లు చేయాలని, అర్హులైన వారికి కొత్తగా చేయూత పింఛన్లు అందించేందుకు సిద్ధంగా ఉండాలని సూచించారు. అర్హులైన వారు ఈ నెల 31లోగా ఆన్‌లైన్‌లో పింఛన్ల కోసం దరఖాస్తు చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గ్రామాభివృద్ధి ప్రణాళికకు దరఖాస్తుల ఆహ్వానం

(వరంగల్/పర్వతగిరి) ఆగస్టు 11, ప్రజాకలం ప్రతినిధి.

పర్వతగిరి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక లో భాగంగా గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనుల కోసం ప్రజల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సర్పంచ్ చీదురు శంకర్, పంచాయతీ కార్యదర్శి రఘు తెలిపారు. గ్రామంలోని అంతర్గత రోడ్లు, సైడ్ డ్రైనేజీ కాల్వలు, విద్యుత్ స్తంభాలు, వ్యవసాయ భూములకు వెళ్లే రహదారులు తదితర మౌలిక వసతుల అవసరాలపై ప్రజలు తమ అభ్యర్థనలను గ్రామ పంచాయతీ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. అభివృద్ధి పనులు అవసరమైన ప్రాంతాలను గుర్తించి ప్రాధాన్యతా క్రమంలో గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికలో చేర్చనున్నట్లు వారు తెలిపారు. సంబంధిత పనులు అవసరమైన గ్రామ ప్రజలు ఈ నెల 15వ తేదీలోపు తమ దరఖాస్తులను గ్రామ పంచాయతీ కార్యాలయంలో అందజేయాలని కోరారు. ప్రజల అవసరాలను ప్రణాళికలో పొందుపరిచి గ్రామంలో మౌలిక వసతుల అభివృద్ధికి చర్యలు తీసుకుంటామని సర్పంచ్, కార్యదర్శి తెలిపారు.

## భక్తుల కొంగుబంగారం శ్రీ తిమ్మప్ప స్వామి

### – అన్నమయ్య సంకీర్తనలతో మార్మోగిన అఖండ సప్తాహ భజన



ప్రజాకలం ఆగస్టు 11 గద్వాల ప్రతినిధి: భక్తుల కొంగుబంగారంగా కొలువైన శ్రీ తిమ్మప్ప స్వామి కృపతో అందరి కోరికలు నెరవేరాలని ప్రముఖ గాయకుడు గద్వాల చంద్రశేఖరరావు ఆకాంక్షించారు. ఆదిశిలా క్షేత్రమైన మల్దకల్ శ్రీ స్వయంభూ లక్ష్మీ వెంకటేశ్వర స్వామి దేవాలయంలో ఈ నెల 8న ప్రారంభమైన అఖండ సప్తాహ భజన కార్యక్రమం నాలుగో రోజు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రముఖ గాయకుడు చంద్రశేఖరరావు హాజరై అన్నమయ్య సంకీర్తనలు ఆలపించి భక్తులను, భజన మండలి సభ్యులను అలరించారు. అంతకుముందు ఆయన స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ వ్యవస్థాపక వంశీయుడు శ్రీ కృష్ణమాన్య పట్వారి ప్రహ్లాదరావు, ఈవో సత్యచంద్రారెడ్డి ఆయనకు స్వామివారి శేషవస్త్రం అందజేసి సత్కరించారు. కార్యక్రమంలో పచ్చర్ల, నీలిపల్లి, సద్దనోనిపల్లె, ఉత్తనూరు, తుపత్రాల గ్రామాలకు చెందిన భజన మండలి సభ్యులు పాల్గొన్నారు.

## కొండపల్లి ప్రభుత్వ పాఠశాలలో దొంగల కలకలం

### – ఆఫీస్ గది తాళం పగులగొట్టి బీరువాలు ధ్వంసం



ప్రజా కలం ఆగస్టు 11 (గద్వాల ప్రతినిధి) జోగులాంబ గద్వాల జిల్లా గద్వాల మండలం కొండపల్లి ప్రాథమిక పాఠశాలలో గుర్తుతెలియని వ్యక్తులు హాల్‌చల్ సృష్టించారు. పాఠశాల కార్యాలయ గది తాళం పగులగొట్టి లోపలికి ప్రవేశించిన దుండగులు బీరువాలను ధ్వంసం చేశారు. పాఠశాలకు వరుస సెలవులు ఉండటంతో ఈ ఘటన జరిగినట్లు తెలుస్తోంది. మంగళవారం పాఠశాల పునఃప్రారంభం కావడంతో విధులకు వచ్చిన ఉపాధ్యాయులు కార్యాలయ గది తాళం పగులగొట్టి ఉండటాన్ని గమనించారు. లోపలికి వెళ్లి చూడగా బీరువాలు ధ్వంసమై ఉండటంతో వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. ఈ ఘటనకు పాల్పడింది దొంగలా.. లేక మద్యం సేవించిన వ్యక్తులా అన్నది పోలీసుల విచారణలో తేలాల్సి ఉంది. పోలీసులు ఘటనపై దర్యాప్తు చేపట్టారు.

## మంజ్రి గ్రామంలో వీఓ మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణానికి భూమిపూజ చేసిన ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ ఆగస్టు 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) భైంసా మండలంలోని మంజ్రి గ్రామంలో వీఓ మహిళా సమైక్య సంఘ భవన నిర్మాణ పనులకు ముధోల్ శాసనసభ్యులు పవార్ రామారావు పటేల్ భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ మహిళా సంఘాల బలోపేతానికి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని, మహిళలు ఆర్థికంగా, సామాజికంగా అభివృద్ధి చెందేందుకు వీఓ మహిళా సమైక్య సంఘ భవనం ఎంతగానో ఉపయోగపడుతుందని తెలిపారు. భవన నిర్మాణ పనులను నాణ్యతా ప్రమాణాలతో, వేగంగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రజాతినిధులు, మండల సీనియర్ నాయకులు, అధికారులు , మహిళలు తదితరులు పాల్గొన్నారు.

## నేరాలపై ఉక్కుపాదం..

### ప్రజల భద్రతే పోలీసుల తొలి ప్రాధాన్యం: జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు

గద్వాల ప్రతినిధి ప్రజా కలం:జోగుళాంబ గద్వాల జిల్లాలో నేరాల నియంత్రణకు కఠిన చర్యలు చేపట్టి, ప్రతి కేసులో నాణ్యమైన దర్యాప్తుతో



బాధితులకు సత్వర న్యాయం అందించాలని జిల్లా ఎస్పీ టి. శ్రీనివాసరావు, ఐపీఎస్., ఆదేశించారు. మంగళవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో నిర్వహించిన మంత్లీ క్రైమ్ రివ్యూలో పెండింగ్ కేసులు, దర్యాప్తు పురోగతిని సమీక్షించారు. సైబర్ మోసాలు, అక్రమ ఇసుక, గంజాయి, పీడీఎస్ రైస్, మట్కా, జూదంపై ప్రత్యేక నిఘా పెట్టాలని సూచించారు. రోడ్డు ప్రమాదాల నివారణకు బ్లాక్‌స్పాట్లను గుర్తించి చర్యలు చేపట్టాలని, డ్రంక్ అండ్ డ్రైవ్‌పై కఠినంగా వ్యవహరించాలని ఆదేశించారు. డయల్ 112పై ప్రజలకు అవగాహన కల్పించాలని, సీసీ కెమెరాల వినియోగాన్ని పెంచాలని, గ్రామస్థాయి పోలీసింగ్‌ను బలోపేతం చేయాలని ఎస్పీ సూచించారు. సమావేశంలో అదనపు ఎస్పీ కె. శంకర్, సీఐలు, ఎస్సైలు, ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

### తెలంగాణలో పారిశ్రామిక కారిడార్లు,

## ఇండస్ట్రియల్ పార్కుల పరిస్థితేమిటి?

### – జహీరాబాద్ లో రూ.10వేల కోట్ల పెట్టుబడులు. 1.74 లక్షల ఉద్యోగాలు

### – వివరాలు వెల్లడించిన కేంద్ర మంత్రి



ఖమ్మం ఆగస్టు 11(ప్రజా కలం న్యూస్ ) తెలంగాణలో పారిశ్రామిక కారిడార్లు, పారిశ్రామిక పార్కుల అభివృద్ధి, పెట్టుబడుల ఆకర్షణ, కొత్త పారిశ్రామిక క్లస్టర్ల ఏర్పాటు, పరిశ్రమలకు అందుతున్న ప్రోత్సాహకాలపై ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి లోక్‌సభలో మంగళవారం ప్రశ్నలు సంధించారు. వీటికి కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ సహాయమంత్రి జితిన్ ప్రసాద లిఖితపూర్వక సమాధానమిచ్చారు.

పారిశ్రామిక కారిడార్లతో భారీ పెట్టుబడులు

జాతీయ పారిశ్రామిక కారిడార్ అభివృద్ధి కార్యక్రమం కింద హైదరాబాద్-నాగ్‌పూర్ పారిశ్రామిక కారిడార్‌లోని జహీరాబాద్ పారిశ్రామిక ప్రాంతం అభివృద్ధికి కేంద్రం ఆమోదం తెలిపింది. సంగారెడ్డి జిల్లాలో 3,245 ఎకరాల్లో రూ.2,361 కోట్లతో ఈ ప్రాజెక్టును చేపడుతున్నారు. సుమారు రూ.10,000 కోట్ల పెట్టుబడులు, 1.74 లక్షల ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని కేంద్రం తెలిపింది.

వరంగల్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు..

పీఎం మిత్ర పథకం కింద గరిష్ఠంగా రూ.200 కోట్ల అభివృద్ధి మూలధన సాయం అందనుందని తెలిపారు.

రాష్ట్రానికి కొత్త పారిశ్రామిక క్లస్టర్ల ప్రతిపాదనలపై..

కొత్త పారిశ్రామిక క్లస్టర్ల కోసం రాష్ట్రాలు ప్రతిపాదనలు సమర్పించవచ్చని కేంద్రం తెలిపింది. ఇదే సమాధానంలో ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం బుగ్గపాడులో 60 ఎకరాల్లో మెగా ఫుడ్ పార్కు ఏర్పాటుకు కేంద్ర ఆహార శుద్ధి పరిశ్రమల శాఖ ఆమోదం తెలిపినట్లు వెల్లడించింది. ప్రాజెక్టు ఆమోదిత వ్యయం రూ.109.59 కోట్లుగా పేర్కొన్నారు. తెలంగాణ నూతన ఎంఎస్‌ఎంఈ విధానం-2024 కింద పరిశ్రమలకు భూమి రాయితీ, స్టాంప్ డ్యూటీ రీయింబర్స్‌మెంట్, పెట్టుబడి సబ్సిడీ, విద్యుత్ ఖర్చు రీయింబర్స్‌మెంట్, ఎస్‌జీఎస్‌టీ రీయింబర్స్‌మెంట్ వంటి ప్రోత్సాహకాలు అందుబాటులో ఉన్నాయని కేంద్రం వివరించింది.

## కొత్త పింఛన్ల మంజూరుపై స్పష్టత కరువు

### – తాజా గైడ్‌లైన్స్‌లో బీడీ కార్మికుల ప్రస్తావన కరువు.

### – 2014 నుంచి ఎదురుచూపులే.. బీడీ కార్మికులందరికీ పింఛన్ మంజూరు చేయాలి: – సీఐటీయూ డిమాండ్



నిర్మల్ ఆగస్టు 11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) బీడీ కార్మికులకు జీవన భృతి, పింఛన్ అందించాలని, ఆన్‌లైన్ దరఖాస్తుల విధానాన్ని ప్రారంభించాలని డిమాండ్ చేస్తూ ఆగస్టు 12న కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్నట్లు సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్, ఒక్క ప్రకటనలో అన్నారు. కార్మికులు పెద్ద ఎత్తున పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని నిర్మల్ జిల్లా సీఐటీయూ కమిటీ పిలుపునిచ్చింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్మికుల జీవితాల్లో ఆశల దీపాలు వెలగడం లేదని, ఎన్నికల సమయంలో పాలకులు ఇచ్చిన హామీలు నీటి మూటలుగా మారుతున్నాయని విమర్శించారు. తాజాగా రాష్ట్రంలోని కాంగ్రెస్ ప్రభుత్వం చేయూత పథకంలో కొత్త పింఛన్లు మంజూరు చేసేందుకు నిర్ణయించి, ఈ నెల 15 నుంచి దరఖాస్తులు స్వీకరించేందుకు మార్గదర్శకాలు జారీ చేసినప్పటికీ, ఒంటరి మహిళలు, వితంతువులు, గీత కార్మికులు, చేనేత కార్మికులు, దివ్యాంగులు, ఫైలేరియా, డయాలసిస్ బాధితుల నుంచి మాత్రమే నూతన పింఛన్లకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు పేర్కొన్నారని తెలిపారు. అయితే బీడీ కార్మికులకు మాత్రం అవకాశం కల్పించకపోవడం అన్యాయమని అన్నారు.

జిల్లాలో లక్షన్నరకు పైగా బీడీ కార్మికులు

నిర్మల్ జిల్లాలో బీడీ పరిశ్రమలో పనిచేసే కార్మికులు లక్షన్నరకు పైగా ఉన్నారని తెలిపారు. వీరిలో బీడీలు చుట్టే మహిళలతో పాటు పరిశ్రమలో పనిచేసే ప్యాకర్లు, చాట్వాలాలు ఉన్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం జిల్లాలో 61,933 మంది బీడీ కార్మికులకు పింఛన్లు అందుతున్నాయని తెలిపారు. 2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీడీ కార్మికులకు జీవన భృతి ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించినప్పటికీ, కొంతమందికి మాత్రమే పరిమితమైందన్నారు. ఒకే ఇంట్లో ఇద్దరు బీడీ కార్మికులు ఉంటే ఒక్కరికే పింఛన్ ఇవ్వడం, కటాఫ్ తేదీల పేరుతో వేలాది మంది కార్మికులను పథకానికి దూరం చేశారని విమర్శించారు.

ఎన్నికల సమయంలో బీడీ కార్మికులకు పింఛన్లు అందిస్తామని, పింఛన్‌ను రూ.4,016కు పెంచుతామని హామీలు ఇచ్చినా ఇప్పటికీ అమలుకు నోచుకోలేదన్నారు. ప్రభుత్వం నూతనంగా అందించనున్న చేయూత పింఛన్లలో బీడీ కార్మికుల ప్రస్తావన లేకపోవడం పట్ల కార్మికులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఒకవైపు ప్రభుత్వాల ఆంక్షలు, మరోవైపు కంపెనీల దోపిడీతో బీడీ పరిశ్రమ రోజురోజుకూ కుదేలవుతోందన్నారు. కొన్ని యాజమాన్యాలు వారంలో రెండు మూడు రోజులు మాత్రమే పని దినాలు కల్పించడంతో కార్మికుల ఉపాధి దెబ్బతింటోందని అన్నారు. చాలీచాలని కూలీతో కుటుంబాలను పోషించుకోవడం గగనంగా మారిందని, ఈ నేపథ్యంలో ప్రభుత్వం బీడీ కార్మికులకు చేయూత పింఛన్లు అందించాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు బీడీ కార్మికులందరికీ పింఛన్ అందించాలని, ఎలాంటి ఆంక్షలు లేకుండా ప్రతి అర్హత కలిగిన బీడీ కార్మికురాలికి జీవన భృతి అమలు చేయాలని డిమాండ్ చేశారు. ఓట్ల కోసం ఎన్నికల సమయంలో వచ్చే నేతలు పింఛన్ ఇప్పిస్తామని హామీలు ఇవ్వడం కాకుండా, ఆ హామీలను అమలు చేయాలని అన్నారు. బీడీ కార్మికులకు నెలకు రూ.6,000 పింఛన్ ఇవ్వాలని, ప్రతి నెల 26 రోజుల పని దినాలు కల్పించాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. ఈ కార్యక్రమంలో క్లైమేంట్ వెస్లీ, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు తగిన సమాచారం అందించాలి

### – జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ఆగస్టు 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి) జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు శాఖల వారిగా సంబంధిత సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.

కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో మంగళవారం సాయంత్రం జిల్లా సెన్సస్ హ్యాండ్ బుక్ రూపకల్పనకు సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా సమావేశం నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలోని జనాభా, అక్షరాస్యత, భౌగోళిక పరిస్థితులు, విద్య, వైద్యం, మౌలిక వసతులు, పారిశుద్ధ్యం, వివిధ ప్రభుత్వ శాఖల వారీగా లభ్యమయ్యే సమాచారాన్ని అత్యంత ఖచ్చితత్వంతో సేకరించాలని చెప్పారు. భవిష్యత్తులో జిల్లా సమగ్ర అభివృద్ధికి, ప్రభుత్వ సంక్షేమ పథకాల సమర్థవంతమైన అమలుకు, భౌగోళిక, సంస్కృతిక అంశాల్లో అభివృద్ధికి ఈ సెన్సస్ హ్యాండ్ బుక్ ప్రామాణికంగా ఉపయోగపడుతుందని అన్నారు. ప్రణాళిక, రెవెన్యూ, పంచాయతీ రాజ్, విద్య, వైద్యారోగ్య, తదితర శాఖల అధికారులు సమన్వయంతో నిర్ణీత గడువులోగా నివేదికలను సమర్పించాలని ఆదేశించారు. వివరాల సేకరణలో ఎలాంటి తప్పులకు తావు ఉండకూడదు అన్నారు. సేకరించిన సమాచారాన్ని క్షేత్రస్థాయిలో పునఃపరిశీలించిన తర్వాతే నివేదికలో పొందుపరచాలని తెలిపారు.

ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, సిపివో గంగారెడ్డి, ఆర్డీవో దేవీదాస్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కార్మికుల సమస్యలపై రాష్ట్ర అధ్యక్షుడిని కలిసిన గంజిపేట రాజు



ప్రజాకలం ఆగస్టు 11 గద్వాల ప్రతినిధి: కార్మికుల సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని కోరుతూ బీఆర్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు యాదవ్‌ను వీడీఎన్‌యూ గంజిపేట రాజు మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. ఈ సందర్భంగా భవన, ఇతర నిర్మాణ రంగాల కార్మికులు ఎదుర్కొంటున్న పలు సమస్యలను రాంబాబు యాదవ్ దృష్టికి తీసుకెళ్లారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం కార్మిక శాఖలో నమోదు చేసుకున్న కార్మికులకు వివాహ కానుక, ప్రసూతి సహాయం తదితర సంక్షేమ పథకాల కింద నిధులు మంజూరు కావాల్సి ఉన్నప్పటికీ, నెలలు గడుస్తున్నా పలువురు కార్మికుల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని తెలిపారు. పెండింగ్‌లో ఉన్న కార్మికుల సంక్షేమ నిధులను వెంటనే మంజూరు చేసేలా సంబంధిత సంక్షేమ బోర్డు ఉన్నతాధికారులతో మాట్లాడి చర్యలు తీసుకోవాలని గంజిపేట రాజు కోరారు. దీనిపై రాంబాబు యాదవ్ వెంటనే స్పందించి, కార్మికుల సమస్యలను సంక్షేమ బోర్డు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జోగులాంబ గద్వాల జిల్లాలో కార్మికుల హక్కులు, సమస్యలపై ప్రత్యేక దృష్టి సారించి విస్తృతంగా పోరాటాలు నిర్వహించాలని సూచించారు. అనంతరం బీఆర్‌టీయూ కార్మిక సంఘం నిర్మాణం, కార్మికులు ఎదుర్కొంటున్న వివిధ సమస్యలు, ప్రస్తుత రాజకీయ పరిస్థితులపై చర్చించారు. త్వరలో జోగులాంబ గద్వాల జిల్లాలో పర్యటించి కార్మిక సంఘం నిర్మాణాన్ని బలోపేతం చేసేందుకు ప్రత్యేక దృష్టి సారిస్తానని రాంబాబు యాదవ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌టీయూ పట్టణ నాయకులు వంశీకుమార్, శివ తదితరులు పాల్గొన్నారు.

### చదువు మధ్యలో ఆపేశారా?

## మళ్లీ చదువుకునే అవకాశం

### టాస్ దూరవిద్యను సద్వినియోగం చేసుకోవాలి: కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



గద్వాల ప్రతినిధి ప్రజా కలం: చదువును మధ్యలో ఆపేసిన వారికి తెలంగాణ సార్వత్రిక విద్యాపీఠం (టాస్) దూరవిద్య విధానం ద్వారా తిరిగి చదువుకునే అవకాశం కల్పిస్తున్నందున సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సూచించారు. మంగళవారం కలెక్టరేట్‌లో టాస్ 2026--27 విద్యా సంవత్సరానికి సంబంధించిన ఎస్ఎస్‌సీ, ఇంటర్ ప్రవేశాల గోడపత్రికలను కలెక్టర్ విడుదల చేశారు. ఎస్ఎస్‌సీ ప్రవేశాలకు ఆగస్టు 31 నాటికి 14 ఏళ్లు, ఇంటర్‌కు 15 ఏళ్లు నిండిన వారు అర్హులని తెలిపారు. ఎస్ఎస్‌సీకి విద్యార్హత అవసరం లేదని, ఇంటర్‌కు పదో తరగతి ఉత్తీర్ణత తప్పనిసరి అని పేర్కొన్నారు. గరిష్ట వయోపరిమితి లేదన్నారు. టాస్ ద్వారా చదువుకున్న విద్యార్థులకు ఉన్నత విద్యలోనూ అవకాశాలు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల వారు ఈ నెల 17వ తేదీలోగా, జరిమానాతో 29వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు సమీప దూరవిద్య కేంద్రం సమన్వయకర్తను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు మధుమోహన్, నర్సింగరావు, ఆర్డీవో శ్రీనివాసరావు, డీఈఓ విజయలక్ష్మి, టాస్ జిల్లా కోఆర్డినేటర్ సునీతమ్మ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## డాక్టర్ ప్రియాంక కుటుంబానికి డీకే స్నిగ్ధారెడ్డి పరామర్శ

### నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్

ప్రజా కలం ఆగస్టు 11 గద్వాల ప్రతినిధి: జోగులాంబ గద్వాల జిల్లా ఐజ మండలం ఏక్లాస్‌పురం గ్రామానికి చెందిన పీజీ మెడికో విద్యార్థిని డాక్టర్ కనికే ప్రియాంక ఇటీవల ఆంధ్రప్రదేశ్‌లోని రాజమహేంద్రవరంలో మద్యం మత్తులో కొందరు యువకులు కారుతో నిర్లక్ష్యంగా ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడ్డారు. వారం రోజులపాటు మృత్యువుతో పోరాడి మృతి చెందిన ప్రియాంక కుటుంబ సభ్యులను బీజేపీ జిల్లా యువ నాయకురాలు డీకే స్నిగ్ధారెడ్డి పరామర్శించారు.

ఈ సందర్భంగా ప్రియాంక మృతికి తీవ్ర సంతాపం వ్యక్తం చేసిన ఆమె, ఘటనకు కారణమైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధిత కుటుంబానికి న్యాయం జరిగేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు టి. రామాంజనేయులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రామచంద్రారెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యురాలు అక్కల రమాదేవి, జిల్లా ప్రధాన కార్యదర్శులు రవికుమార్ ఎక్బోటే, జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు బాబుల్‌రెడ్డి, జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు సమతగౌడ్, కిసాన్ మోర్చా అధ్యక్షుడు దరూర్ కిష్టన్న, మహిళా మోర్చా భారతి, మండల అధ్యక్షుడు గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.



# భూ రీ-సర్వేతో ప్రతి భూమికి డిజిటల్ మ్యాప్ తో కూడిన భూధార్ కార్డులు

### రైతుల సమక్షంలో పారదర్శకంగా హద్దుల నిర్ధారణ అక్కడికక్కడే విస్తీర్ణం వివరాలు

### రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు భద్రత

### సత్తుపల్లి నియోజకవర్గం బేతుపల్లి, నారాయణపురం, గంగారం గ్రామాలలో నిర్వహిస్తున్న భూ రీ సర్వే ను క్షేత్రస్థాయిలో తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ దివాకర్ టీఎస్

ఖమ్మం/ సత్తుపల్లి, ఆగస్టు- 11(ప్రజా కలం న్యూస్ )

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన భూ రీ-సర్వే ద్వారా రైతుల భూములపై ఉన్న వివాదాలు, విస్తీర్ణ వ్యత్యాసాలు, రికార్డులలోని లోపాలను ఎవరికి అన్యాయం జరగకుండా పారదర్శకంగా భూసమస్యలు పరిష్కారం కావలనేది ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ తెలిపారు.
సత్తుపల్లి నియోజకవర్గం లో మంగళవారం జిల్లా కలెక్టర్ విస్తృతంగా పర్యటించారు. బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గ్రామాలలో ప్రభుత్వం చేపట్టిన భూ రీసర్వే ప్రక్రియను క్షేత్రస్థాయిలో, సబ్ కలెక్టర్ అజయ్ యాదవ్ తో కలిసి కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. గంగారం గ్రామంలో పంట పొలాలలో గట్టు వెంబటి నడుచుకుంటూ వెళ్లి రైతుల సమక్షంలో నిర్వహిస్తున్న రీ సర్వే ను పరిశీలించారు. బేతుపల్లి, అనంతరం నారాయణపురం గ్రామాల్లో జరుగుతున్న భూ రీసర్వే ప్రక్రియ పరిశీలించి రైతులతో కలెక్టర్ నేరుగా ముచ్చటించి సర్వే పై వారి అభిప్రాయాలను తెలుసుకొని రైతుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ సత్తుపల్లి నియోజకవర్గంలో బేతుపల్లి రెవెన్యూ పరిధిలోని గంగారం, బేతుపల్లి నారాయణపురం, రామగోవిందపురం, యం.వి. పాలెం, రామనగర్, పాకాలగూడెం గ్రామాలలో సూమరు 12 వేల ఎకరాలకు భూ సర్వే కొనసాగుతుందని, 10టీమ్ లలో ఇప్పటి వరకు 4 వేల ఎకరాల రైతుల భూములను రీ సర్వే పూర్తి చేశామని కలెక్టర్ వివరించారు.ప్రతి మనిషికి అధార్ లాగా అధునిక యాంత్రాలు, సాంకేతిక పరిజ్ఞానం తో చేసున్న భూ సర్వే ద్వారా ప్రతి రైతు భూమికి డిజిటల్ మ్యాప్ తో కూడిన భూధార్ కార్డు ఉంటుందని తెలిపారు. గ్రామంలోని రైతులకు గతంలో కొంత మందికి పట్టాదారు పాస్ పుస్తకాలు లేకపోవడం, అన్లైన్ ప్రక్రియలో పేర్లు నమోదు కాకపోవడం, రికార్డుల్లో ఉన్న విస్తీర్ణానికి భూమిపై ఉన్న విస్తీర్ణానికి తేడాలు ఉండడం వంటి అనేక సమస్యలు రైతులు ఎదుర్కుంటున్న వారికి, అలాగే ఉన్న భూ విస్తీర్ణము కొంతమందికి తక్కువగా నమోదు కాగా, మరికొందరికి ఎక్కువగా నమోదైన సందర్భాలు కూడా ఉన్నాయని, రీ-సర్వే ద్వారా అలాంటి అన్ని లోపాలను రీ సర్వే ద్వారా సరిచేస్తామని అన్నారు.గ్రామంలోనీ ప్రతి రైతుకు 48 గంటల ముందుగానే నోటీసులు జారీ చేసి, రైతుల సమక్షంలోనే వారి పొలాలను కొలుస్తామని కలెక్టర్ తెలిపారు. రైతులు స్వయంగా తమ భూమి హద్దులను చూపిస్తారని, పక్కనే ఉన్న రైతులను కూడా పిలిచి పంచనామా నిర్వహించి హద్దులను నిర్ధారిస్తామని వివరించారు. భూ సర్వే కు నోటీసు ఇచ్చిన రైతులు వారి కుటుంబంలో భూ హక్కదారులు, పట్టా పాస్ బుక్ లో భూమి ఉన్న వారు అందరూ తప్పకుండా స్వయంగా సర్వేకు వచ్చి పూర్తి వివరాలు తెలియజేసి, సహకరించాలని కలెక్టర్ కోరారు. సర్వే పూర్తయ్యాక ఎంత విస్తీర్ణం నమోదైందో రైతులకు అక్కడికక్కడే



తెలియజేస్తామని చెప్పారు. రైతులకు సందేహం ఉన్న మరొక్కసారి, రైతులు విశ్వసించే వరకు పారదర్శకంగా భూ రీ సర్వే చేసి వారితో స్వయంగా ఉన్న భూమి విస్తీర్ణముకు సంతకం కూడా తీసుకుంటామని అన్నారు. భూ రీ సర్వే మొత్తం ప్రక్రియ పూర్తిగా క్షేత్ర స్థాయిలో భూ హక్కుదారిని సమక్షంలో జరుగుతుందని, రైతుల హక్కులకు ఎలాంటి నష్టం జరగకుండా ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణయాలు తీసుకుంటామని కలెక్టర్ స్పష్టం చేశారు. రైతులు అపోహలకు గురికాకుండా అధికారులు అందించే సమాచారాన్ని నమ్మకంతో భూ రీ-సర్వే కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని కోరారు.సర్వే అనంతరం గ్రామాల్లో భూ వివరాలను ప్రకటించి, వివరాలను గ్రామ పంచాయతీ, తహసీల్దారు కార్యాలయాలలో నోటీస్ బోర్డులో ఉంచుతామని, ఏలాంటి అభ్యంతరాలు ఉన్న గడువు ఇస్తామని, అభ్యంతరాలు స్వీకరించి పరిష్కరించిన తర్వాత వివరాలను పూర్తిస్థాయిలో ఆన్లైన్లో నమోదు చేసి భూధార్ కార్డులు జారీ చేస్తామని పేర్కొన్నారు. రీ-సర్వే పూర్తయిన తర్వాత భవిష్యత్తులో భూ వివాదాలు గణనీయంగా తగ్గి రైతులకు శాశ్వత భద్రత కలుగుతుందని కలెక్టర్ దివాకర టీఎస్ స్పష్టం చేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ వెంట సత్తుపల్లి తహసీల్దారు సత్యనారాయణ, గ్రామ సర్పంచ్ లు, సంబంధిత అధికారులు, రైతులు తదితరులు ఉన్నారు.

## ఈవీఎం గోదాం తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ ఆగస్టు 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

కలెక్టరేట్ సమీపంలో గల ఈవీఎం గోదాం కేంద్రాన్ని సాధారణ తనిఖీల్లో భాగంగా మంగళవారం జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అన్ని రిజిస్టర్లను పరిశీలించారు. చేశారు. సీసీ కెమెరాల పనితీరు చూశారు. అగ్నిమాపక వ్యవస్థ పనితీరు తనిఖీ చేశారు. పోలీసు సిబ్బంది నిరంతరం సీసీ కెమెరాలు పర్యవేక్షణతో మెరుగైన భద్రతను నిర్వహించాలని తెలిపారు. పటిష్ట అగ్నిమాపక వ్యవస్థ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంచుకోవాలన్నారు.

ఈ తనిఖీలో జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అగ్నిమాపక అధికారి శివాజీ, తహసిల్దార్ రాజు, అధికారులు స్వాతి, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## తళ సప్తమి వేడుకల్లో ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్



నిర్మల్ ఆగస్టు11 (ప్రజా కలం జిల్లా ప్రతినిధి) కుభీర్ మండలంలోని పార్డి(బి) గ్రామంలో శ్రీ రాజరాజేశ్వర ఆలయంలో తళ సప్తమి వేడుకల్లో ముధోల్ శాసన సభ్యులు పవార్ రామారావు పటేల్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీ రాజరాజేశ్వర స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయానికి విచ్చేసిన భక్తులకు తీర్థ ప్రసాదాలను అందజేశారు. తళ సప్తమి సందర్భంగా ఆలయంలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమాల్లో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు.ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, మండల సీనియర్ నాయకులు, గ్రామస్థులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## కోశాధికారి నరసింహారావును అభినందించిన పోలీస్ కమిషనర్..



ఖమ్మం తల్లాడ ఆగస్టు 11 (ప్రజా కలం న్యూస్ ):

ఖమ్మం పోలీస్ అసోసియేషన్ ఎన్నికల్లో ఘన విజయం సాధించి, నూతన కార్యవర్గంగా ఎన్నికైన పోలీసు అధికారులకు, సిబ్బందిని పోలీస్ కమిషనర్ సునీల్ దత్ అభినందించారు. ఈ సందర్భంగా తల్లాడ మండలం నారాయణపురం గ్రామానికి చెందిన పోలీస్ కానిస్టేబుల్ తడికమల్ల నరసింహారావు కోశాధికారిగా ఎన్నికల కావడం పట్ల ఈ ప్రాంత ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. మంగళవారం పోలీస్ కమిషనర్ ని ఆయన మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూపోలీస్ శాఖ గౌరవాన్ని మరింత పెంచేలా వ్యవహరించాలని, పోలీసు సిబ్బంది సంక్షేమం కోసం అంకితభావంతో పనిచేసేలా తమ బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తిస్తారని ఆకాంక్షిస్తున్నామన్నారు.

## విద్యార్థులకు నాయకత్వ లక్షణాలు అలవర్చాలి

- భావి నాయకులు బాలలే
- సమాజ శ్రేయస్సుకు ఉత్తమ నాయకులు అవశ్యం
- విఆర్ పురం ఎంఇఓ, ప్రధానోపాధ్యాయుడు బాబురావు

ప్రజాకలం ప్రతినిధి ఎటపాక, ఆగస్టు 11: సమాజ శ్రేయస్సులో ఉత్తమ నాయకత్వం అవశ్యమని, పిల్లల్లో విద్యార్థి దశ నుంచి నాయకత్వ లక్షణాలు అవసరమని, నేటి బాలలే భావి భారతదేశం నాయకులని విఆర్ పురం ఎంఇఓ,



ప్రధానోపాధ్యాయుడు బాబురావు అన్నారు. ఎటపాక మండలం సీతాపురం జడ్పీ ఉన్నత పాఠశాలలో బాబురావు ఆధ్వర్యంలో మంగళవారం పాఠశాల విద్యార్థుల నాయకుడు (ఎస్. పి. ఎల్) ఎంపిక నిర్వహించారు. ఇందులో భాగంగా సాధారణ ఎన్నికలు నిర్వహించే విధంగా ఎంపిక ప్రక్రియ చేపట్టారు. పాఠశాలలో విద్యార్థులు నాయకుడి ఎంపికకు ఓటు వినియోగించుకున్నారు. సార్వత్రిక ఎన్నికలు నిర్వహించినట్టు జరగడంతో ఈ ఎంపిక ప్రక్రియ ఆద్యంతం ఉత్కంఠ భరితంగా సాగింది. ఈ సందర్భంగా ఎంఇఓ మాట్లాడుతూ సమాజంలో అవినీతి, అక్రమాలు, అన్యాయం నిర్మూలనలో ఎంపికైనా ప్రజాప్రతినిధులు, నాయకుల పాత్ర కీలకమన్నారు. సమసమాజ సంక్షేమానికి,, సమగ్ర అభివృద్ధికి ప్రజాప్రతినిధులే ముఖ్యమన్నారు. పాఠశాలల్లో ఎస్. పి. ఎల్ ఎంపిక నిర్వహించడం వల్ల పిల్లలకు అవగాహన పెరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది శ్రీదేవి, సునీత, వెంకటేశ్వర్లు, దేవత, శాంతికుమారి, రవి, సలోమి కుమారు, వెంకటేష్, లక్ష్మణరావు, అభిషేక్ విద్యార్థులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## కోయూరు పోలీస్ స్టేషన్ ను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్

### - పెండింగ్ కేసులను త్వరగా ముగించాలి

మల్హర్ , ఆగస్టు 11 ప్రజాకలం ప్రతినిధి

భూపాలపల్లి జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ , ఐపీఎస్ వార్షిక తనిఖీల్లో భాగంగా కోయూరు పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి పోలీస్ సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం 'వన మహోత్సవం' లో భాగంగా స్టేషన్ ఆవరణలో ఎస్పీ మొక్కలు నాటారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, రికార్డుల నిర్వహణ, సిబ్బంది విధి నిర్వహణలను ఎస్పీ క్షుణ్ణంగా పరిశీలించారు. స్టేషన్‌లో నమోదైన పెండింగ్ కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ , కేసుల దర్యాప్తును వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. దర్యాప్తు వివరాలను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేస్తూ రికార్డులను అప్‌డేట్ చేయాలన్నారు. రోడ్డు ప్రమాద కేసులకు సంబంధించిన వాహనాల స్థితిగతులు, వాటి పరిష్కార పురోగతిపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. రౌడీ షీటర్లపై తీసుకుంటున్న చర్యలను సమీక్షిస్తూ, వారిపై నిరంతరం నిఘా కొనసాగించాలని ఆదేశించారు.రిసెప్షన్ విధులు నిర్వహిస్తున్న సిబ్బందితో మాట్లాడిన ఎస్పీ పోలీస్ స్టేషన్‌కు వచ్చే ప్రతి ఫిర్యాదుదారునితో మర్యాదపూర్వకంగా




వ్యవహరించాలని సూచించారు. అందిన ఫిర్యాదులను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేసి, నిబంధనల ప్రకారం తగిన చర్యలు చేపట్టాలన్నారు. ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ నిస్పక్షికంగా, పారదర్శకంగా సేవలు అందించాలని, తద్వారా ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసాన్ని మరింత పెంపొందించడమే లక్ష్యంగా పనిచేయాలని పేర్కొన్నారు. ఈ తనిఖీల్లో కాటారం డీఎస్పీ సూర్యనారాయణ, కాటారం సీఐ నాగార్జున రావు, కొయ్యూరు ఎస్సై మహేందర్ కుమార్ ఇతర పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ధమనకాండలో మృతిచెందిన మాల మృతవీరుల త్యాగం వృథా కాదు... అల్లాడి పాల్ రాజ్

ప్రజాకలం ప్రతినిధి భద్రాచలం, ఆగస్టు 11: ఎస్సీల వర్గీకరణ చేయడం చట్టబద్ధంగా వ్యతిరేకమని, దళితులను విడదీయరాదని, ఎస్సీల ఐక్యత దెబ్బతింటుందని మాల మహానాడు ఆధ్వర్యంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మాలలపై కర్కశంగా ప్రవర్తించి లాటి ఛార్జ్ చేయడం వల్ల 1997 ఆగస్టు 11న పాసంగి శేషయ్య, గోపతోటే నారాయణ అనే మాల యువకులు మృతి చెందారని ఆ మృతి మాల సమాజానికి తీరని లోటని అన్నారు. మాలలు ప్రభుత్వం చేసిన అన్యాయంపై నిరసన తెలియజేస్తే అప్పటి ముఖ్యమంత్రి మాదిగ కులకు అండగా ఉండి మాలలను చిత్రహింసలకు గురి చేశారని దుయ్యబట్టారు. 1991 ఆగస్టు 11 మాలల మృత వీరుల దినోత్సవం గా మాల




మహానాడు నిర్వహిస్తుందని మాల మహానాడు జిల్లా అధ్యక్షులు అల్లాడి పౌల్ రాజ్ తెలిపారు. నాడు ,నేడు చంద్రబాబు నాయుడు ప్రభుత్వం మాలలకు ఏ విధంగా అయితే అన్యాయం చేసిందో అదే రీతిలో రేవంత్ రెడ్డి ప్రభుత్వం మాలల కన్యాయం చేస్తుందని వారు వాపోయారు. రాజకీయ పార్టీలో ఉన్న మాలలు మాలమృతవీరుల త్యాగాలను గుర్తుంచుకోండి మాలల కన్యాయం చేస్తున్న ప్రభుత్వాలపై ధ్వజమెత్తాలని పిలుపునిచ్చారు.

## పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలి





మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 11:

పాఠశాలల్లో పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం ఇవ్వడంతో పాటు విద్యార్థులకు ఆహ్లాదకరమైన, ఆరోగ్యకరమైన వాతావరణం కల్పించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం నవాబ్‌పేట మండలంలోని కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్పీహెచ్ఎస్), నవాబ్‌పేట కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం (కేజీబీవీ)లను స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ తనిఖీ చేశారు.ముందుగా కారుకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల (జెడ్.పి.హెచ్.ఎస్)ను సందర్శించిన ఆయన పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ, పరిసరాల్లో పిచ్చి మొక్కలు, పొదల తొలగింపు పనులను పరిశీలించారు. పాఠశాల పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచాలని, విద్యార్థులకు పరిశుభ్రమైన వాతావరణం అందేలా పారిశుధ్య పనులను నిరంతరం చేపట్టాలని సూచించారు. ఈ సందర్భంగా పాఠశాల విద్యా, మౌలిక వసతులకు సంబంధించిన అంశాలను కూడా పరిశీలించారు.అనంతరం నవాబ్‌పేట మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం (కె .జి.బి.వి) ను సందర్శించిన స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి వారి యోగక్షేమాలు, విద్యాభ్యాసం, విద్యాలయంలో అందుతున్న వసతుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో కొంత సమయం గడిపిన ఆయన, వారి సమస్యలు, అవసరాలను తెలుసుకుని, ప్రభుత్వం అందిస్తున్న విద్య, వసతి, భోజనం తదితర సౌకర్యాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేసిన అదనపు కలెక్టర్, భోజనం నాణ్యత, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు.
కారుకొండ పర్యటనలో మండల విద్యాశాఖ అధికారి (ఎంఈఓ), పాఠశాల ప్రధానోపాధ్యాయులు, గ్రామ సర్పంచ్ తదితరులు పాల్గొన్నారు. కేజీబీవీ తనిఖీ సందర్భంగా జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి (సిఈఓ) వెంకట్ రెడ్డి, ఎంపిడిఓ, ఎంపిఓ, స్పెషల్ ఆఫీసర్ (ఎస్ఓ) తదితర అధికారులు పాల్గొన్నారు.

## మంగాపురం పాఠశాలలో నోటు పుస్తకాలు పంపిణీ..

తల్లాడ ఆగస్టు 11 ప్రజా కలం న్యూస్ సత్తుపల్లి శాసనసభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ జన్మదినం సందర్భంగా మంగళవారం తల్లాడ మండలంలోని



మంగాపురం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు నోటు పుస్తకాలను పంపిణీ చేశారు. గ్రామ సర్పంచ్ నరసింహారావు, ఉప సర్పంచ్ గుజ్జర్లపూడి చింటూ చేతులమీదుగా విద్యార్థులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే పుట్టినరోజు సందర్భంగా విద్యార్థులకు ఈ కార్యక్రమం చేయడం సంతోషంగా ఉందన్నారు. విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వ అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందని గుర్తు చేశారు. ఎమ్మెల్యే ఆధ్వర్యంలో నియోజకవర్గంలో ప్రజలందరికీ పథకాలు అందుతున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్ ఎం రామిరెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తానూర్ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచిత నోట్‌బుక్స్ పంపిణీ

తానూర్,ఆగస్టు 11(ప్రజా కలం): మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు ఉచితంగా నోట్‌బుక్స్ పంపిణీ చేశారు, ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ రవికిరణ్ ముఖ్య అతిథిగా హాజరై, అధ్యాపకులతో కలిసి విద్యార్థులకు పుస్తకాలను అందజేశారు, ఉచితంగా నోట్‌బుక్స్ లభించడంతో విద్యార్థులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు, చదువులో ముందుకు సాగడానికి ఈ పుస్తకాలు ఎంతగానో ఉపయోగపడతాయని అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు.



## పాము కాటుకు గురైన విద్యార్థికి
# మెరుగైన వైద్యం అందించాలి
### - అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్

మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 11:



పాము కాటుకు గురైన విద్యార్థికి మెరుగైన వైద్య చికిత్స అందించాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ వైద్యులను ఆదేశించారు. దేవరకద్రలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల/జూనియర్ కళాశాలలో పాము కాటుకు గురైన విద్యార్థి మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న నేపథ్యంలో అదనపు కలెక్టర్ ఆసుపత్రిని మంగళవారం సందర్శించారు. విద్యార్థి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, అందుతున్న చికిత్స వివరాలను సమీక్షించారు.విద్యార్థి చికిత్సకు స్పందిస్తున్నాడని, ప్రస్తుతం ఆరోగ్య పరిస్థితి స్థిరంగా ఉందని వైద్యులు అదనపు కలెక్టర్‌కు తెలిపారు. విద్యార్థిని నిరంతరం వైద్యుల పర్యవేక్షణలో ఉంచి, అవసరమైన వైద్య సేవలు అందించాలని అదనపు కలెక్టర్ సూచించారు.విద్యార్థి ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని వైద్యులను ఆదేశించారు.

# గిరిజన హక్కుల కోసం రాజీలేని పోరాటం చేస్తా
### ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షుడిగా భూక్య మంగీలాల్ నాయక్



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా: ఆగస్టు 11: (ప్రజా కలం న్యూస్)

నంగారా భేరి లంబాడి హక్కుల పోరాట సమితి ఎల్ హెచ్ పి ఎస్ వ్యవస్థాపక జాతీయ అధ్యక్షులు డాక్టర్ బెల్లయ్య నాయక్,తెలంగాణ రాష్ట్ర అధ్యక్షులు మూడవత్ రాంబాల్ నాయక్,రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రమేష్ నాయక్ ఆదేశాల మేరకు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షుడిగా భూక్య మంగీలాల్ నాయక్ ను నియామక పత్రాన్ని అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు భూక్య మంగీలాల్ నాయక్ మాట్లాడుతూ లంబాడి, గిరిజన సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేస్తామని, గిరిజన ప్రాంతాల అభివృద్ధికి కృషి చేస్తూ గిరిజన చట్టాల పరిరక్షణ కోసం రాజీలేని ఉద్యమాలు నిర్వహిస్తామని అన్నారు. లంబాడీలను రాజకీయంగా చైతన్యవంతులను చేసి వారికి సముచిత అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. నాపై నమ్మకం ఉంచి ఈ బాధ్యతలు అప్పగించిన జాతీయ అధ్యక్షులు డా. బెల్లయ్య నాయక్, రాష్ట్ర అధ్యక్షులు మూడావత్ రాంబాల్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బానోత్ రమేష్ నాయక్ లకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో చుంచుపల్లి సర్పంచ్ వీరన్న నాయక్, కొత్తగూడెం వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ భూక్య జనార్ధన్ నాయక్, మాజీ సర్పంచ్‌లు కున్‌సోతు రాంచందర్ నాయక్, బానోత్ గోవిందు, న్యాయవాది ధరావత్ రాధాకృష్ణ, మలోత్ రాజా, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ గూగులోతు మోహన్ నాయక్, మంగతు సేవాలాల్, జిల్లా ఉపాధ్యక్షులు గూగులోత్ రాందాస్ నాయక్, బానోత్ నరేష్ నాయక్, రాజు నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# విధులకు డుమ్మా కొట్టిన పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు
### ఆకస్మిక తనిఖీల్లో కార్యాలయాల్లో కనిపించని కార్యదర్శులు

ప్రజా కలం ఆగస్టు 11 గద్వాల ప్రతినిధి: గ్రామ పంచాయతీల్లో విధి నిర్వహణ సమయంలో ప్రజలకు అందుబాటులో ఉండని పంచాయతీ కార్యదర్శులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదేశించినట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ తెలిపారు. జిల్లాలోని పంచాయతీ కార్యదర్శులు ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు మాత్రమే విధుల్లో ఉంటున్నారన్న ఫిర్యాదుల నేపథ్యంలో అధికారులు ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. మంగళవారం గద్వాల మండలం ఈడిగోనిపల్లి, ధరూర్ మండలం ఎల్మలోనిపల్లి గ్రామ పంచాయతీలను మధ్యాహ్నం 2 గంటలకు తనిఖీ చేయగా, సంబంధిత పంచాయతీ కార్యదర్శులు కార్యాలయాల్లో అందుబాటులో లేరని గుర్తించారు. ముందస్తు అనుమతి లేకుండానే విధులకు గైర్హాజరైనట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారులు వెల్లడించారు. విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత పంచాయతీ కార్యదర్శులకు షోకాజ్ నోటీసులు జారీ చేయనున్నట్లు జిల్లా పంచాయతీ అధికారి శ్రీకాంత్ తెలిపారు.

# స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలి
### - జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.

నిర్మల్ ఆగస్టు 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి అన్ని ఏర్పాట్లను పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అధికారులను ఆదేశించారు.



ఈ నెల 15వ తేదీ స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని రాష్ట్ర ప్రభుత్వం నూతన స్మార్ట్ రేషన్ కార్డులను పంపిణీ చేయనున్నందున జిల్లాలో నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి సంబంధించి ఏర్పాట్లపై ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, సోఫీనగర్ సమీపంలోని సాగర్ కన్వెన్షన్ లో 15వ తేదీన నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీకి సంబంధించి కార్యక్రమానికి ప్రోటోకాల్ ప్రకారం ప్రజా ప్రతినిధులను ఆహ్వానించాలని పేర్కొన్నారు. కొంతమంది లబ్ధిదారులను కార్యక్రమానికి ఆహ్వానించాలని అన్నారు. ప్రోటోకాల్ ప్రకారం సీటింగ్ ఏర్పాటు చేయడంతో పాటు, సరైన లైటింగ్, సౌండ్ సిస్టం ఉండేలా చూడాలన్నారు. ఎల్‌ఈడి తెరను ఏర్పాటు చేయాలన్నారు. కార్యక్రమానికి హాజరైన వారికి ఎప్పటికప్పుడు త్రాగునీరు అందిస్తూ ఉండాలన్నారు. సంబంధిత శాఖల అధికారులంతా సమన్వయంతో పనిచేసి రాష్ట్ర ప్రభుత్వ ప్రతిష్టాత్మక నూతన స్మార్ట్ రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో జిల్లా అదనపు కలెక్టర్ రెవెన్యూ కిషోర్ కుమార్, ఆర్డిఓ దేవిదాస్, పౌరసరఫరాల అధికారి రాజేందర్, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## కుబీర్ కాలువ కూలిన ఘటనపై
# అధికారుల పరిశీలన
### - రూ.76 లక్షల పనుల నాణ్యతపై ఆరా..
### - గోప్యంగా కొలతలు తీసుకున్న ఉన్నతాధికారులు
### - అధికారుల రహస్య తనిఖీలపై స్థానికుల్లో అనుమానాలు



నిర్మల్ ఆగస్టు 11(జిల్లా ప్రజా కలం జిల్లా ప్రతినిధి,)

కుబీర్ మండల కేంద్రంలోని వడ్డెర కాలనీలో రూ.76 లక్షల వ్యయంతో చేపట్టిన మురికికాలువ నిర్మాణం పూర్తికాకముందే కూలిపోయిన ఘటనపై అధికారుల దృష్టి సారించింది. కాలువ నిర్మాణ పనుల నాణ్యత, నిర్మాణంలో పాటించిన ప్రమాణాలు, పర్యవేక్షణ తీరుపై ఆరా తీసేందుకు మంగళవారం ఉన్నతాధికారులు కుబీర్‌కు చేరుకుని పరిశీలన చేపట్టారు. దశాబ్దాలుగా వడ్డెర కాలనీ ప్రజలు మురికికాలువ సమస్యతో ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ గతంలో స్వయంగా కాలనీని సందర్శించి సమస్యను పరిశీలించారు. అనంతరం ప్రత్యేక నిధులు మంజూరు కావడంతో కాలువ నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. అయితే పనులు ప్రారంభమైనప్పటి నుంచే నాణ్యతపై అనుమానాలు వ్యక్తం చేస్తూ గ్రామస్తులు అధికారులకు పలుమార్లు సూచించినట్లు చెబుతున్నారు. ఇదిలా ఉండగా, నిర్మాణం పూర్తికాకముందే కాలువ కూలిపోవడంతో ప్రజాధనం వృథా అవుతోందంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం నాణ్యత పరిశీలన కోసం సంబంధిత ఉన్నతాధికారులు కుబీర్‌కు వచ్చి కూలిపోయిన కాలువను పరిశీలించి, కొలతలు తీసుకున్నట్లు సమాచారం.

**సమాచారం గోప్యంగా ఎందుకు?**

ఉన్నతాధికారులు కుబీర్‌కు వస్తున్న విషయం స్థానిక అధికారులకు ముందుగానే తెలిసినప్పటికీ, ఈ విషయాన్ని స్థానిక ప్రజలకు, మీడియాకు తెలియజేయకుండా గోప్యంగా ఉంచడంపై స్థానికులు ప్రశ్నలు లేవనెత్తుతున్నారు. ఎవరికీ సమాచారం లేకుండా అధికారులు వచ్చి కొలతలు తీసుకుని వెళ్లడం పలు అనుమానాలకు తావిస్తోందని వారు అంటున్నారు.కాలువ నిర్మాణంలో నాణ్యత లోపాలు ఉన్నాయా? నిబంధనల ప్రకారం పనులు జరిగాయా? అధికారుల పర్యవేక్షణ ఎలా ఉంది? కాంట్రాక్టర్‌పై చర్యలు ఉంటాయా? అనే ప్రశ్నలకు అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.

**బాధ్యులపై చర్యలు తీసుకోవాలి**

రూ.76 లక్షల ప్రజాధనంతో చేపట్టిన నిర్మాణం పూర్తికాకముందే కూలిపోవడంపై సమగ్ర విచారణ జరిపించాలని వడ్డెర కాలనీ ప్రజలు కోరుతున్నారు. పనుల్లో నాణ్యత లోపాలు తేలితే సంబంధిత కాంట్రాక్టర్‌పై, పర్యవేక్షణలో నిర్లక్ష్యం వహించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు. ప్రజాధనం వృథా కాకుండా కాలువను నాణ్యతా ప్రమాణాలతో పునర్నిర్మించాలని వారు కోరుతున్నారు.

## వసతి గృహాల పరిసరాల్లో పారిశుద్ధ్యంపై
# ప్రత్యేక దృష్టి సారించాలి
### - స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్





మహబూబ్ నగర్ ప్రజా కలం ప్రతినిధి ఆగస్టు 11 మహబూబ్‌నగర్ జిల్లాలోని వసతి గృహాల పరిసరాలను పరిశుభ్రంగా, పాములు, విషపురుగులకు ఆవాసంగా మారకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ అధికారులను ఆదేశించారు.మంగళవారం వసతి గృహాల పరిశుభ్రత, పారిశుద్ధ్య నిర్వహణపై అన్ని సంక్షేమ శాఖల అధికారులు, రెసిడెన్షియల్ విద్యాసంస్థల రీజినల్ కోఆర్డినేటింగ్ ఆఫీసర్లతో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ మధుసూదన్ నాయక్ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వసతి గృహాల పరిసరాలు, గదులు, వంటశాలలు, మరుగుదొడ్లు, ఇతర ప్రదేశాల్లో పారిశుద్ధ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని సూచించారు. వసతి గృహాల పరిసరాల్లో చెత్తాచెదారం, పిచ్చి మొక్కలు, పొదలు, నిల్వ నీరు లేకుండా చూడాలని తెలిపారు. పెరిగిన పిచ్చి మొక్కలు, పొదలను ఎప్పటికప్పుడు తొలగించి, వ్యర్థాలను సక్రమంగా తరలించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ముఖ్యంగా పాములు, ఇతర విషపురుగులు దాగేందుకు అవకాశం ఉన్న ప్రాంతాలను గుర్తించి పూర్తిగా శుభ్రం చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని, పాముకాట్ల నివారణకు అవసరమైన అన్ని ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. వసతి గృహాల భవనాల చుట్టూ పరిశుభ్రతను పాటించడంతో పాటు రాత్రి వేళల్లో తగినంత వెలుతురు ఉండేలా లైటింగ్ సౌకర్యాలను ఏర్పాటు చేసి, తరచూ తనిఖీలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

## ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తూ, పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా
# అసత్య కథనాలు ప్రచురించడం సరికాదు
### దొంగతనాలను కొండంతలుగా చూపిస్తూ ప్రజల్లో భయాందోళనలు కలిగించే కథనాలను ఖండిస్తున్నాం
### వారం రోజుల్లో 20 ఆస్తి నేరాల కేసుల ఛేదన - మరో 15 కేసుల్లో కీలక ఆధారాలు
### 13 ప్రత్యేక చెక్‌పోస్టులతో విస్తృత తనిఖీలు - నేర నియంత్రణకు పటిష్ట చర్యలు: జిల్లా ఎస్పీ జి. జానకి షర్మిల

నిర్మల్ ఆగస్టు 11(ప్రజా కలం జిల్లా ప్రతినిధి)

గత కొద్ది రోజులుగా దిన పత్రికలలో జిల్లా పోలీస్ శాఖకు సంబంధించిన అంశాలపై ఏకపక్షంగా, వాస్తవాలను పూర్తిగా పరిశీలించకుండా ప్రచురితమవుతున్న కొన్ని కథనాలు జిల్లా పోలీసుల ఆత్మస్థైర్యాన్ని దెబ్బతీసేలా ఉన్నాయని జిల్లా ఎస్పీ డా. జి. జానకి షర్మిల తెలిపారు.

జిల్లాలో జరుగుతున్న దొంగతనాలను గోరంతలను కొండంతలుగా చూపిస్తూ, వాస్తవ పరిస్థితులకు భిన్నంగా ప్రజల్లో భయాందోళనలు కలిగించే విధంగా అసత్య కథనాలు ప్రచురించడం బాధ్యతాయుతమైన జర్నలిజం కాదని ఎస్పీ పేర్కొన్నారు.

నేరం జరిగిన ప్రతి సందర్భంలోనూ పోలీసులు కేసు నమోదు చేసి, సీసీ కెమెరా ఫుటేజీలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను విశ్లేషిస్తూ దర్యాప్తు చేపడుతున్నారని తెలిపారు. నేరాల నియంత్రణతో పాటు ఇప్పటికే జరిగిన నేరాలను ఛేదించేందుకు ప్రత్యేక బృందాలను రంగంలోకి దించి నిరంతరం పనిచేస్తున్నామని వెల్లడించారు.

ఆస్తి నేరాలపై జిల్లా పోలీస్ శాఖ ప్రత్యేక దృష్టి సారించి రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలను ఏర్పాటు చేసిందన్నారు. సీసీ కెమెరాలు, సాంకేతిక ఆధారాలు, నిందితుల కదలికలు, గత నేరాల వివరాలను సమన్వయం చేస్తూ వారం రోజుల వ్యవధిలో 20 ఆస్తి నేరాల కేసులను చేధించడంతో పాటు.. మరో 15 కేసుల్లో కీలకమైన ఆధారాలు సేకరించామన్నారు.

బైంసా టౌన్, నిర్మల్ టౌన్, నిర్మల్ రూరల్, మామడ, సారంగాపూర్, లక్ష్మణచాంద, తానూర్, కడెం తదితర ప్రాంతాల్లో జరిగిన ఇంటి దొంగతనాలు, ఆలయ చోరీలు, ద్విచక్ర వాహన చోరీలు, కాపర్ వైర్ చోరీలు తదితర కేసుల్లో నిందితుల ప్రమేయాన్ని గుర్తించి దర్యాప్తు కొనసాగిస్తున్నామని పేర్కొన్నారు.

కడెం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన 5 దొంగతనం కేసులను పోలీసులు ఛేదించి, సంబంధిత నిందితులను అదుపులోకి తీసుకోవడం జరిగిందని, కేసులకు సంబంధించిన ఆధారాలను సేకరించి, నిందితుల ప్రమేయాన్ని నిర్ధారిస్తూ తదుపరి చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

బైంసా టౌన్ పరిధిలోని పోచమ్మ ఆలయంలో జరిగిన హుండీ చోరీ కేసును కేసు నమోదైన 48 గంటల్లోనే చేధించామన్నారు. సీసీ కెమెరా ఫుటేజీలను పరిశీలించి నిందితుడిని గుర్తించి అదుపులోకి తీసుకున్నామని, నిందితుడు బాలుడు కావడంతో చట్టపరమైన నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపట్టామని తెలిపారు. అదేవిధంగా బైంసా టౌన్ పరిధిలో ద్విచక్ర వాహన చోరీ, దృష్టి మళ్లింపు ద్వారా వృద్ధురాలి ఆభరణాల అపహరణ, కైలాస్ ఫ్యాక్టరీ సమీపంలోని ఇంటి దొంగతనం, గోకుల్ నగర్ అపార్ట్‌మెంట్‌లో జరిగిన చోరీ కేసులపై ప్రత్యేక దర్యాప్తు కొనసాగుతుందన్నారు. నిర్మల్ టౌన్ పరిధిలో మహాదేవ్‌పురం, శాస్త్రినగర్, సోఫీనగర్, గల్లేపేట్ రోడ్, బంగల్‌పేట్, దివ్యానగర్ తదితర ప్రాంతాల్లో జరిగిన ఇంటి దొంగతనాలు, కాపర్ వైర్ చోరీలు, ఆలయ చోరీ కేసులను చేధించామని చెప్పారు.



ఇంటి దొంగతనాల్లో బంగారం, వెండి ఆభరణాలు, నగదు, ఆలయాల్లో చోరీకి గురైన వెండి ఆభరణాలు, ఇతర వస్తువులకు సంబంధించిన కేసుల్లో నిందితుల ప్రమేయాన్ని గుర్తించి తదుపరి చట్టపరమైన చర్యలు కొనసాగిస్తున్నామని అన్నారు.

నిర్మల్ రూరల్, మామడ, సారంగాపూర్, లక్ష్మణచాంద, తానూర్, కడెం తదితర పోలీస్ స్టేషన్ల పరిధిలో నమోదైన ఆలయ చోరీలు, ఇంటి దొంగతనాలు, చోరీకి యత్నించిన కేసుల్లో కూడా కీలక ఆధారాలను సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నామని అన్నారు. దొంగతనాలను అరికట్టేందుకు భైంసా టౌన్ పరిధిలో 5 చెక్ పోస్టులు, నిర్మల్ టౌన్ 7 చెక్ పోస్టుకు, సారంగాపూర్ పోలిస్టేషన్ పరిధిలో 1 చెక్ పోస్టు సహా జిల్లాలో మొత్తం 13 ప్రత్యేక పోలీస్ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశామన్నారు. ఈ చెక్‌పోస్టుల ద్వారా అనుమానాస్పద వ్యక్తులు, వాహనాల కదలికలపై ప్రత్యేక నిఘా ఉంచి విస్తృత తనిఖీలు చేపట్టారని అన్నారు. కీలక ప్రాంతాల్లో సీసీ కెమెరాల పర్యవేక్షణను పటిష్టం చేస్తూ, గతంలో నేరాలకు పాల్పడిన వ్యక్తుల కదలికలపై కూడా నిఘా ఉంచామన్నారు. జిల్లా పోలీస్ శాఖ నేరం జరిగిన తర్వాత కేసు ఛేదించడానికే పరిమితం కాకుండా, నేరాలు జరగకుండా ముందస్తు చర్యలకు కూడా ప్రాధాన్యత ఇస్తుందని అన్నారు.

ప్రతి రోజు అధికారులు చెక్‌పోస్టులను తనిఖీ చేస్తూ, సిబ్బంది పనితీరు, వాహన తనిఖీలు, అనుమానాస్పద వ్యక్తుల పరిశీలన తదితర అంశాలను పర్యవేక్షిస్తున్నట్లు వివరించారు.

జిల్లాలో ఇటీవల జరిగిన పలు ఆస్తి నేరాలకు సంబంధించి ఒక పెద్ద నేర ముఠా కదలికలపై ప్రత్యేక బృందాలు దర్యాప్తు చేస్తున్నాయని అన్నారు. ముఠా సభ్యుల కదలికలు, గతంలో జరిగిన నేరాలతో ఉన్న సంబంధాలు, వివిధ కేసుల్లో వారి పాత్ర తదితర అంశాలను సాంకేతిక ఆధారాలతో విశ్లేషిస్తున్నామని అన్నారు.

దర్యాప్తు పూర్తయిన వెంటనే సంబంధిత నిందితులను అదుపులోకి తీసుకుని మరిన్ని కేసులను ఛేదించే దిశగా చర్యలు కొనసాగుతున్నాయని వివరించారు. దర్యాప్తు ప్రయోజనాల దృష్ట్యా ప్రస్తుతం పూర్తి వివరాలను వెల్లడించడం లేదని తెలిపారు.

జిల్లాలో గంజాయి వినియోగం, అక్రమ రవాణాను అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నట్లు చెప్పారు. ప్రజల్లో అవగాహన కల్పించడంతో పాటు అనుమానాస్పద కదలికలపై నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తూ చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని అన్నారు.

నిర్మల్ అయ్యప్ప స్వామి ఆలయంలో జరిగిన చోరీతో పాటు జిల్లాలోని ఇతర దేవాలయాల్లో జరిగిన చోరీలు, ఇళ్లలో జరిగిన దొంగతనాల కేసుల్లో నిందితుల ముఠాలపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారని వివరించారు.

కీలక ఆధారాలు లభించిన కేసుల్లో నిందితులను త్వరలోనే అదుపులోకి తీసుకుని మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని తెలిపారు.

వార్తా కథనాలను ప్రచురించే ముందు సంబంధిత అధికారులను సంప్రదించి, వార్తకు సంబంధించిన అంశాలపై వారి వివరణ తీసుకోవాలన్నారు. వారి వివరణను కూడా సముచితంగా ప్రచురించాలన్నారు.

ఒక ప్రశ్న అడిగి, దానికి భిన్నమైన అంశాలను కథనంలో ప్రస్తావిస్తూ, వాటిని సంబంధిత అధికారి చెప్పినట్లుగా ఉటంకించడం సరైన పద్ధతి కాదని స్పష్టం చేశారు.

పోలీస్ శాఖపై వాస్తవ ఆధారాలతో చేసే విమర్శలను స్వాగతిస్తామని, అయితే అసత్యాలు, నిరాధార ఆరోపణలు, వాస్తవాలను వక్రీకరించే కథనాలు ప్రచురించడం వల్ల ప్రజల్లో అనవసరమైన భయాందోళనలు ఏర్పడటంతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసు సిబ్బంది ఆత్మస్థైర్యం దెబ్బతినే అవకాశం ఉందన్నారు. అసత్య, నిరాధార కథనాలను ప్రచురించి పోలీస్ శాఖ ప్రతిష్ఠకు భంగం కలిగించే చర్యలు కొనసాగితే, చట్టపరమైన మార్గాల ద్వారా తగిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఎస్పీ తెలిపారు. ఆలయాల కమిటీలు, దుకాణదారులు, ప్రజలు తమ ఇళ్లు, వ్యాపార సంస్థలు, ముఖ్యమైన ప్రదేశాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. విలువైన వస్తువుల విషయంలో అప్రమత్తంగా ఉండాలని, అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు లేదా కదలికలు కనిపించిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. జిల్లాలో రెండు ప్రత్యేక టాస్క్‌ఫోర్స్ బృందాలు ఆస్తి నేరాల ఛేదనపై ప్రత్యేకంగా పని చేస్తున్నాయని అన్నారు. ఒక టాస్క్‌ఫోర్స్‌కు బైంసా ఏఎస్పీ సాయి కిరణ్, నాయకత్వం వహిస్తుండగా, మరో టాస్క్‌ఫోర్స్‌కు నిర్మల్ డిఎస్పీ పి. శ్రీనివాస్ నాయకత్వం వహిస్తున్నారని అన్నారు.

నేరాల నియంత్రణ, కేసుల త్వరితగతిన ఛేదన, ప్రజల ఆస్తి, ప్రాణాలకు భద్రత కల్పించడమే నిర్మల్ పోలీసుల ప్రధాన కర్తవ్యమని ఎస్పీ తెలిపారు.



## సూర్యగిరి ఎల్లమ్మ బోనాల ఉత్సవాలకు సమగ్ర ఏర్పాట్లు

**అంతర్ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించిన**

**శంషాబాద్ డిసిపి శ్రీ రాజేష్**

మహేశ్వరం, ఆగస్టు 11,(ప్రజా కలం)

మహేశ్వరం మండలం తుక్కుగూడ జిహెచ్ఎంసి రావిరాల గ్రామంలో ప్రసిద్ధి చెందిన సూర్యగిరి ఎల్లమ్మ ఆలయంలో ప్రతి ఏటా ఘనంగా నిర్వహించే బోనాల ఉత్సవాలను పురస్కరించుకుని భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సజావుగా ఉత్సవాలు జరిగేందుకు అవసరమైన ఏర్పాట్లపై మంగళవారం నాడు అంతర్ శాఖల సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి శంషాబాద్ డిసిపి రాజేష్ అధ్యక్షత వహించారు. ఉత్సవాలు సెప్టెంబర్ 1న ఆలయ ప్రాంగణం రవిరాల వద్ద జరగనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై సమీక్ష పార్కింగ్ భక్తుల వాహనాల కోసం ప్రత్యేక పార్కింగ్ ప్రాంతాల గుర్తింపు,ఉత్సవాల రోజు ట్రాఫిక్ దారి మళ్లింపు, బారికేడింగ్ ఏర్పాట్లు క్యూ లైన్ల వద్ద బారికేడింగ్, తాగునీరు, వైద్య సదుపాయాలు, ఇతర విద్యుత్ సరఫరా, వీధి దీపాలు, పారిశుద్ధ్యం, శానిటేషన్ పనులను పకడ్బందీగా చేపట్టాలని అన్నారు. ఈ సమావేశంలో ఎల్,ఓ పోలీస్, ఎండోమెంట్స్ శాఖ, ట్రాఫిక్ పోలీస్, విద్యుత్ శాఖ, మున్సిపల్ శాఖతో పాటు ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొని, తమ తమ శాఖల పరిధిలో చేయాల్సిన ఏర్పాట్లును సమన్వయంపై చర్చించారు. ఉత్సవాలు ప్రశాంతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పని చేయాలని డిసిపి రాజేష్ అధికారులకు సూచించారు.

# డ్రగ్స్ మరియు సైబర్ నేరాల నియంత్రణ కోసం పటిష్టమైన చర్యలు

**నిజామాబాద్ డివిజన్ పోలీస్ అధికారులతో నేరాల నియంత్రణ కోసం సమీక్ష సమావేశం నిర్వహించిన పోలీస్ కమిషనర్**

**రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి ప్రజలలో రోడ్డు భద్రతా నిబంధనలపై అవగాహన కల్పించాలి**

**- పాత నేరస్థులపై నిఘా పటిష్టము చేయాలి**

**-చట్ట వ్యతిరేక కార్యకలాపాల పై నిర్విరమంగా దాడులు నిర్వహణ,అవసరం అయితే పి.డి యాక్ట్ నమోదు**

**- డయల్ 112 గురించి ముమ్మరంగా ప్రచారం చేయాలి - రాబోయే పండుగల నేపథ్యంలో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు**



నిజామాబాద్,
(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 11:

మంగళవారం నిజామాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్ డివిజన్ పరిధిలో పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి పై నిజామాబాదు పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐ.పి.యస్., సమగ్ర సమీక్ష సమావేశం జక్రాన్ పల్లి పోలీస్ స్టేషన్ యందు నిర్వహించగా నిజామాబాద్ డివిజన్ ఏ.సీ.పీ,సర్కిల్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్.హెచ్.ఓ లు , ఎస్సైలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ మాట్లాడుతూ రాష్ట్ర డిజిపి సార్ ఆదేశాల మేరకు డ్రగ్స్ మరియు గంజాయి నిర్మూలన కోసం ప్రత్యేక దాడులు కొనసాగించాలని,అక్రమ రవాణాలో పాల్గొనే వారిపై పీడీ యాక్ట్ వంటి కఠిన చట్టాల కింద చర్యలు తీసుకోవాలని కమిషనర్ పేర్కొన్నారు. సైబర్ నేరాలపై ప్రజల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని,ఆన్‌లైన్ మోసాలకు గురైన బాధితులకు వెంటనే స్పందించి సహాయం అందించాలని తెలిపారు.సోషల్ మీడియాలో అసత్య ప్రచారాలు,రెచ్చగొట్టే పోస్టులపై కఠిన చర్యలు తీసుకోవాలని సూచించారు. నిజామాబాద్ డివిజన్ పరిధిలో నమోదైన వివిధ రకాల కేసులపై సమగ్ర సమీక్ష నిర్వహించారు. ముఖ్యంగా హత్య , హత్యాయత్నం , చోరీలు,మహిళలపై నేరాలు,సైబర్ మోసాలు,డ్రగ్స్ మరియు గంజాయి అక్రమ రవాణా , పేకాట,గుట్కా అక్రమ వ్యాపారం వంటి కేసులపై ప్రత్యేకంగా చర్చించారు. పెండింగ్‌లో ఉన్న కేసులను వేగవంతంగా పూర్తి చేసి బాధితులకు త్వరిత న్యాయం అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అలాగే నేరస్తుల కదలికలపై నిరంతర నిఘా ఉంచాలని , రౌడీషీటర్లు,పాత నేరస్తులు,బెయిల్‌పై విడుదలైన వారిపై ప్రత్యేక పర్యవేక్షణ కొనసాగించాలని సూచించారు.ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో రాత్రి పహారా వ్యవస్థను మరింత బలోపేతం చేసి , అనుమానాస్పద వ్యక్తులు మరియు వాహనాల తనిఖీలను కట్టుదిట్టంగా నిర్వహించాలని తెలిపారు. మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని ,షీ టీమ్స్ ,ఈగల్ టీమ్స్ ,చీతా ఫోర్స్ వంటి ప్రత్యేక బృందాలు మరింత సమర్ధవంతంగా పనిచేయాలని ఆదేశించారు. విద్యాసంస్థలు , బస్టాండ్లు,రైల్వే స్టేషన్లు మరియు జనసంచారం ఎక్కువగా ఉండే ప్రాంతాల్లో పర్యవేక్షణ పెంచాలని సూచించారు.

అలాగే పేకాట , గుట్కా,ఇసుక మరియు ఇతర అక్రమ వ్యాపారాలపై నిరంతర దాడులు నిర్వహించాలని ఆదేశించారు. పోలీస్ స్టేషన్లలో ప్రజలకు స్నేహపూర్వక వాతావరణం కల్పించాలని , ఫిర్యాదుదారులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించాలని సూచించారు. రిసెప్షన్ నిర్వహణ,రికార్డుల నిర్వహణ,స్టేషన్ పరిశుభ్రత మరియు సిబ్బంది క్రమశిక్షణపై ప్రత్యేక దృష్టి పెట్టాలని తెలిపారు. సీసీ కెమెరాల వినియోగాన్ని మరింత విస్తరించి,నేరాల నియంత్రణలో సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్ధవంతంగా ఉపయోగించాలని అధికారులకు సూచించారు. చివరిగా శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా ప్రతి పోలీస్ అధికారి బాధ్యతాయుతంగా పనిచేయాలని పోలీస్ కమిషనర్ సూచించారు.ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని ,రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక దృష్టి పెట్టాలని ఎక్కువగా రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలలో బ్లాక్ స్పాట్లను గుర్తించి,సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని సూచించారు.హైవే రోడ్డులను కలుపుతూ ఉండేటటువంటి లింకు రోడ్లకు స్పీడ్ బ్రేకర్లు వేయించడం,రోడ్డుకు అడ్డుగా ఉన్న పొదలను తొలగించే విధముగా చూడాలని అన్నారు.రోడ్డు ఇంజనీరింగ్ లోపాలు ఉన్నట్లయితే నేషనల్ హైవే మరియు స్టేట్ హైవే అథారిటీ ఇతర సంబంధిత అధికారులతో సమన్వయంతో ప్రమాదాల నివారణకు కృషి చేయాలని సూచించారు.అలాగే రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి రోజు మీ పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రంక్ అండ్ డ్రైవ్ లు నిర్వహించాలని,ఓవర్ స్పీడ్,త్రిబుల్ డ్రైవింగ్ , మైనర్లు వాహనాలు నడుపుట లాంటి వాటిపై ప్రత్యేక దృష్టి పెట్టి స్పెషల్ డ్రైవ్ నిర్వహించాలని తెలిపారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలలో రోడ్డు భద్రత నిబంధనల గురించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని తెలియజేశారు. డయల్ 112 గురించి ప్రజల వద్దకు చేరే విధంగా అనుక్షణం కృషి చేయాలి. రాబోయే పండుగల నేపథ్యంలో బందోబస్తు ఏర్పాట్లను పటిష్టంగా నిర్వహించాలని , వాహనాల తనిఖీలు 24/7 తనిఖీలు చేయాలని,వాహనాల తనిఖీలు సమయంలో సిబ్బంది అలసత్వం పనికిరాదని తెలిపారు. ఈ కార్యక్రమం నిజామాబాద్ ఏ.సి.పి ప్రకాష్ యాదవ్ , సి.సి.ఆర్.బి ఎ.సి.పి గురునాయుడు, సి.సి.ఆర్బి ఇన్స్పెక్టర్ ఆర్.అంజయ్య , స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్ శ్రీధర్ రెడ్డి,సీ.ఐ లు మరియు ఎస్హెచ్ఓలు మరియు ఎస్సై ,ఐటి కోర్స్ సిబ్బంది తదితరులు పాల్గొనడం జరిగింది.

## జలసిరి అమలులో నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు

**-కలెక్టర్ భవేష్ మిశ్రా**

**-హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపుపై అధికారులతో సమీక్ష**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 11 :

నిజామాబాద్ భూగర్భ జలాలను పెంపొందించేందుకు, వర్షపు నీటిని నిలువ చేసేందుకు వీలుగా ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జలసిరి కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహించే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ భవేష్ మిశ్రా హెచ్చరించారు. ఎల్ నినో వల్ల వర్షాభావ పరిస్థితులు నెలకొనే అవకాశాలు ఉన్న ప్రస్తుత తరుణంలో జలసిరి కార్యక్రమాలకు అత్యంత ప్రాధాన్యతనిస్తూ విస్తృత స్థాయిలో ఇంకుడు గుంతలు, ఫాంపాండ్స్ తదితర నిర్మాణాలు జరిపించాలని సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం సమావేశ మందిరంలో మంగళవారం జలసిరి, హౌసింగ్, వన మహోత్సవం, డబుల్ బెడ్ రూమ్ ఇళ్ళ కేటాయింపు తదితర అంశాలపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో కలిసి



మున్సిపల్ కమిషనర్లు, అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, ఇంజనీరింగ్ విభాగాల అధికారులతో కలెక్టర్ సుదీర్ఘ సమీక్ష నిర్వహించారు. లక్ష్యానికి అనుగుణంగా ఫాంపాండ్స్, ఇంకుడు గుంతల నిర్మాణాలు జరగని మండలాల ఎంపీడీఓ లపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. వారం రోజుల్లో నిర్దేశిత లక్ష్యానికి అనుగుణంగా నిర్మాణాలు జరిగేలా చొరవ చూపాలని, క్షేత్రస్థాయిలో రైతులను, ప్రజలను కలిసి అవగాహన కల్పించాలన్నారు. ఈ విషయంలో అలసత్వం వహించే వారిని సరెండర్ చేస్తానని కలెక్టర్ స్పష్టం చేశారు. కేవలం జీతాల కోసం పని చేయకూడదని, ప్రస్తుత విపత్కర పరిస్థితుల్లో ప్రతి నీటి బొట్టును వృధా కాకుండా కాపాడుకోవాల్సిన గురుతర బాధ్యతను గుర్తెరిగి అంకిత భావంతో విధులు నిర్వర్తించాలని హితవు పలికారు. నైరుతీ రుతుపవనాలు మొట్టమొదటగా ప్రవేశించే కేరళ రాష్ట్రంలోని వయనాడ్ జిల్లాలో మునుపెన్నడూ లేనివిధంగా సాధారణంతో పోలిస్తే 44 శాతం లోటు వర్షపాతం నెలకొని ఉందని అన్నారు. పరిస్థితి తీవ్రతను దృష్టిలో పెట్టుకుని నీటి సంరక్షణకు ఉపయుక్తంగా నిలిచే ఫాంపాండ్స్, సోక్ పిట్స్ వంటి వాటిని విరివిగా నిర్మించేలా చూడాలన్నారు. భూగర్భ జలాలు తగ్గిపోయి నీరు అందించక వృధాగా ఉన్న బోరు బావుల వద్ద వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాలు చేపట్టాలని ఆదేశించారు. తమిళనాడులోని తిరువల్లూరు జిల్లాలో వీటి నిర్మాణాల వల్ల 5 నుండి 10 అడుగుల మేరకు భూగర్భ జలాల వృద్ధి చెందాయని, ఇక్కడ కూడా అలాంటి నిర్మాణాలు చేపట్టేందుకు చొరవ చూపాలన్నారు. కాగా, వన మహోత్సవం కార్యక్రమంలో భాగంగా ఆయా శాఖలు నిర్దేశిత లక్ష్యం మేరకు మొక్కలు నాటి, వాటిని సంరక్షిన్చేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. నాటిన మొక్కలను ఈ నెల 29న ప్రతి గ్రామ పంచాయతీ పరిధిలో క్షేత్రస్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు.

మొక్కలు నాటకుండా తప్పుడు నివేదికలు సమర్పించిన వారి నుండి నిధుల రికవరీ చేపడతామని కలెక్టర్ స్పష్టం చేశారు. ఇందిరమ్మ ఇళ్ళ నిర్మాణాల ప్రగతిని సమీక్షిస్తూ, సెప్టెంబర్ 15లోపు పూర్తి స్థాయిలో లక్ష్యాన్ని సాధించాలని గడువు విధించారు. జాబ్ కార్డులు కలిగి ఉన్న ఇందిరమ్మ ఇళ్ళ లబ్దిదారులకు వీబీజీరాంజీ కింద వ్యక్తిగత మరుగుదొడ్లను మంజూరు చేయాలని సూచించారు. ప్రభుత్వం నుండి కేటాయించబడే నిధులు పూర్తిస్థాయిలో వినియోగం అయ్యేలా చొరవ చూపాలన్నారు. గుడిసెలలో నివసిస్తున్న కుటుంబాలకు యుద్ధప్రాతిపదికన ఇందిరమ్మ ఇళ్ళను మంజూరు చేసేందుకు లబ్దిదారుల జాబితా రూపొందించాలని, రెండు పడక గదుల ఇళ్ళను అర్హులైన వారికి కేటాయించేందుకు వీలుగా లబ్దిదారుల జాబితాను తక్షణమే తహసిల్దార్లకు సమర్పించాలని ఎంపీడీఓలను ఆదేశించారు. అన్ని గ్రామ పంచాయతీల స్థాయిలో సమావేశాలు నిర్వహించి ఫాంపాండ్స్, సోక్ పిట్ల నిర్మాణాలు చేపట్టేలా, ప్రత్యామ్నాయ పంటలు, ఆయిల్ పామ్ సాగు చేపట్టేలా రైతులను, ప్రజలను అవగాహన కల్పించాలని సూచించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ వి.భుజంగరావు, ట్రైనీ కలెక్టర్ సురేష్, డీ.ఆర్.ఓ గీత, నగరపాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్,జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డీ.ఆర్.డీ.ఓ సాయన్న, డీ.పీ.ఓ శ్రీనివాస్ రావు,అన్ని మండలాల ఎంపీడీఓలు, ఎంపీఓలు, పంచాయతీరాజ్ ఈ.ఈలు, ఏ.ఈలు తదితరులు పాల్గొన్నారు.

## ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానం

**-నిజామాబాద్ సీపీ పి.సాయి చైతన్య**

**-జక్రాన్‌పల్లిలో ‘మన ఊరు - మన భద్రత’ కార్యక్రమం**

**-నూతనంగా 25 సీసీ కెమెరాలు ప్రారంభం**

నిజామాబాద్,(ప్రజా కలం ప్రతినిధి) ఆగస్టు 11:

గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, నేరాల నియంత్రణకు సీసీ కెమెరాలు రక్షణ కవచంలా పనిచేస్తాయని నిజామాబాద్ పోలీస్ కమిషనర్ పి.సాయి చైతన్య, ఐపీఎస్ అన్నారు. ‘మన ఊరు - మన భద్రత - మన బాధ్యత’ కార్యక్రమంలో భాగంగా మంగళవారం సాయంత్రం జక్రాన్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో నూతనంగా ఏర్పాటు చేసిన 25 సీసీ కెమెరాలను ఆయన రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో సీపీ మాట్లాడుతూ.. సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవడం ద్వారా పోలీసింగ్‌ను మరింత సమర్థవంతంగా నిర్వహించవచ్చని తెలిపారు. నిఘా పెంచడంలో ఒక్క సీసీ కెమెరా వంద మంది పోలీసు సిబ్బందితో సమానమని స్పష్టం చేశారు. వీటి సహాయంతో గ్రామంలో తిరిగే అనుమానాస్పద వ్యక్తులను, అసాంఘిక కార్యకలాపాలను సులభంగా గుర్తించి తక్షణ చర్యలు తీసుకునే వీలుంటుందన్నారు. నేరాల నివారణతో పాటు ట్రాఫిక్ నియంత్రణకు, రోడ్డు ప్రమాదాల అడ్డుకట్టకు ఈ కెమెరాలు ఎంతగానో దోహదపడతాయని వివరించారు. సహకరించిన గ్రామ పంచాయతీకి అభినందనలు గ్రామ భద్రతను ఒక బాధ్యతగా తీసుకుని 25 సీసీ కెమెరాల ఏర్పాటుకు సహకరించిన జక్రాన్‌పల్లి గ్రామ పంచాయతీని కమిషనర్ ప్రత్యేకంగా అభినందించారు. ప్రజలంతా పోలీస్ శాఖ చేపడుతున్న కమ్యూనిటీ పోలీసింగ్ కార్యక్రమాల్లో స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. వ్యాపారులు, దుకాణాల యజమానులు తమ సొంత భద్రత కోసం తప్పనిసరిగా సీసీ కెమెరాలను అమర్చుకోవాలని సూచించారు. డ్రగ్స్, సైబర్ నేరాలపై అప్రమత్తత ప్రస్తుత తరుణంలో యువతను పాడుచేస్తున్న డ్రగ్స్ (మత్తు పదార్థాల) రవాణా, వినియోగంపై కఠినంగా వ్యవహరిస్తామని సీపీ హెచ్చరించారు. అలాగే రోజురోజుకూ పెరుగుతున్న సైబర్ నేరాల పట్ల, ఆన్‌లైన్ మోసాల పట్ల ప్రజలు నిరంతరం అప్రమత్తంగా ఉండాలన్నారు. వాహనదారులు రోడ్డు ప్రమాదాల నివారణకు ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ ఏసీపీ ప్రకాష్, సీసీఆర్‌బీ ఏసీపీ గురు నాయుడు, డిచ్‌పల్లి సీఐ తిరుపతి, జక్రాన్‌పల్లి ఎస్ఐ మహేష్, గ్రామ సర్పంచ్ బండి పద్మసత్యం, మండల ప్రెసిడెంట్ రెక్కల సురేష్, స్థానిక ప్రజాప్రతినిధులు మరియు గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## మానవత్వానికి చేయూత..

**జన్మదిన వేడుకల్లో సేవా కార్యక్రమాలు**

**అనాథ కుటుంబానికి ఆర్థిక సాయం..**

**ఆసుపత్రిలో రోగుల సహాయకులకు అల్పాహారం, పండ్లు పంపిణీ**



గజ్వేల్:11 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు గాడిపల్లి అనూప్ జన్మదిన వేడుకలను సేవా కార్యక్రమాలతో నిర్వహించారు.గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పరిధిలో పద్మశాలి యువజన సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమాల్లో భాగంగా అనాథ కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు ఆసుపత్రిలో రోగులు, బాలింతలు, గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అల్పాహారం, పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.జన్మదిన వేడుకల్లో భాగంగా తొలుత గజ్వేల్ మహంకాళి ఆలయంలో వేద బ్రాహ్మణుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.అనంతరం పద్మశాలి కులదైవమైన శ్రీ మార్కండేయ స్వామి ఆలయంలో ఐదుగురు వేద పండితుల సమక్షంలో ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ఆశీస్సులు పొందారు. అనంతరం సీతారామ ఉమామహేశ్వరి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. తదుపరి గజ్వేల్ ప్రభుత్వ ఆసుపత్రిలోని మాతా శిశు సంరక్షణ కేంద్రంలో చికిత్స పొందుతున్న రోగులు, బాలింతలు, గర్భిణులు, వారి కుటుంబ సభ్యులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. సుమారు 55 మందికి పండ్లు, బ్రెడ్ పంపిణీ చేశారు.నిరుపేద కుటుంబానికి ఆర్థిక సహాయం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన గజ్వేల్‌కు చెందిన నిరుపేద పద్మశాలి కుటుంబం సిరిగాద యాదగిరి (57) కుటుంబానికి అండగా నిలుస్తామని గతంలో పద్మశాలి సేవా సంఘం ఇచ్చిన హామీ మేరకు గాడిపల్లి అనూప్ జన్మదిన సందర్భంగా కుటుంబ సభ్యులను పరామర్శించారు.కుటుంబ సభ్యుల మధ్య జన్మదిన వేడుకలు నిర్వహించి, నిత్యావసర సరుకులతో పాటు అత్యవసర అవసరాల కోసం రూ.5,000 ఆర్థిక సహాయం అందించారు. భవిష్యత్తులో కూడా కుటుంబానికి అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని హామీ ఇచ్చి వారికి మనోధైర్యం కల్పించారు.ఈ సందర్భంగా గాడిపల్లి అనూప్ మాట్లాడుతూ జన్మదిన వేడుకలను ఆర్భాటాలకు దూరంగా ప్రజలకు ఉపయోగపడే విధంగా నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

అవసరంలో ఉన్న వారికి చేయూత అందించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం అధ్యక్షుడు బొల్లిబత్తుల దేవదాస్, చేనేత సహకార సంఘం అధ్యక్షుడు స్వర్గం రాజేశం,పద్మశాలి సంఘం మాజీ అధ్యక్షుడు దేవులపల్లి రాజారాం, పద్మశాలి యువజన సంఘం అధ్యక్షుడు తలకుకుల ప్రేమ్‌కుమార్, మార్కండేయ దేవాలయం అధ్యక్షుడు గడ్డమీద ఆంజనేయులు, పద్మశాలి కుల పెద్దలు ఆడెపు బాలచంద్రం, స్వర్గం చంద్రం, స్వర్గం రాములు, పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి గాడిపల్లి ఎల్లంరాజు, చేనేత యువజన సంఘం ఉపాధ్యక్షుడు వల్లందాసు సత్యనారాయణ, సిద్దిపేట జిల్లా పద్మశాలి ఉద్యోగుల సంఘం ప్రధాన కార్యదర్శి దేవసాని వాసుదేవ్, పద్మశాలి యువజన సంఘం ఉపాధ్యక్షుడు నర్సింలు, సహాయ కార్యదర్శి రాచకొండ మహేష్, కార్యవర్గ సభ్యులు చంద్రమౌళి, మంగల్‌పల్లి సత్యనారాయణ, షేర్ల భాస్కర్, నల్ల శివకుమార్, దేవసాని పోశెట్టి తదితర పద్మశాలి కులబంధువులు పాల్గొన్నారు.

## బొడ్రాయి వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మాదిగ సంక్షేమ సంఘం నాయకులు

మల్కాజిగిరి ఆగస్టు 11 (ప్రజా కలం ప్రతినిధి)
మల్కాజిగిరి మాదిగ సంక్షేమ నాయకులు ఆషాడ మాస బోనాల సందర్భంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి బొడ్రాయి వద్ద పోత



లింగన్న కు సోమవారం రాత్రి ప్రత్యేక పూజలను నిర్వహించారు. మాదిగ సంక్షేమ సంఘ నాయకులు సంధి గారి నర్సింగరావు మాదిగ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జి తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎం జె ఎప్పుడు రాష్ట్ర నాయకులు మనోహర్, ఎం ఈ ఎఫ్ నాయకులు ఆనంద్ కుమార్ తదితరులతో కలిసి పూజా కార్యక్రమంలో పాల్గొన్న తో పాటు మల్కాజిగిరి ప్రాంత ప్రజలు రాష్ట్ర ప్రజలంతా కూడా సుభిక్షంగా సుఖసంతోషాలతో ఉండాలని అమ్మవారిని కోరుకున్నట్లు చెప్పారు.

## మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత.

### ముబారస్ పూర్ సర్పంచ్ విజయస్వామి.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 11.
దౌల్తాబాద్ మండలం ముబారస్‌పూర్ గ్రామానికి చెందిన షేర్పల్లి యాదగిరి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న గ్రామ



సర్పంచ్ కానుగుల విజయస్వామి మృతుని కుటుంబాన్ని పరామర్శించి, కుటుంబ సభ్యులకు తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. అనంతరం మృతుని కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి, వారికి అండగా నిలిచారు. ఈ సందర్భంగా కుటుంబ పరిస్థితిని అడిగి తెలుసుకున్న సర్పంచ్, అవసరమైన సహాయ సహకారాలు అందిస్తామని భరోసా ఇచ్చారు. మృతుని కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుని, వారికి అవసరమైన సహాయ సహకారాలు అందించాలని మాజీ సర్పంచ్ యాదగిరి, గ్రామస్తులు కోరారు.

## శ్రీ అరుణాచలేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు

### - టీపీసీసీ ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 11, ప్రజా కలం
హైదరాబాద్ ప్రశాంతి హిల్స్ డివిజన్-58, నంది హిల్స్ కాలనీలోని శ్రీ అరుణాచలేశ్వర స్వామి దేవాలయాన్ని టీపీసీసీ తెలంగాణ రాష్ట్ర ప్రచార కమిటీ సభ్యులు సామిడి గోపాల్ రెడ్డి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా స్వామివారికి



ప్రత్యేక పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా, ఆరోగ్యంగా, ఐకమత్యంగా ఉండాలని స్వామిని ప్రార్థించారు. రాష్ట్రంలో శాంతి, సుఖ సంతోషాలు నెలకొనాలని, అరుణాచలేశ్వరుని ఆశీస్సులు అందరికీ ఉండాలని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయ్ కుమార్, ఆలయ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్ రెడ్డి, ఆలయ కమిటీ కార్యదర్శి, గుమ్మల రవీందర్ రెడ్డి- కాంగ్రెస్ నాయకులు మట్ట సత్యనారాయణ, కాంగ్రెస్ నాయకులు ,చరణ్ రెడ్డి సామిడి, రాష్ట్ర యూత్ సెక్రటరీ దీక్షిత్ ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షులు సార్ల రవి, ప్రకాష్, అవినాష్, ఇందిరమ్మ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు.

## ఘనంగా అమ్మవారి పలారం బండి ఊరేగింపు

ముషీరాబాద్, ఆగస్టు 11 (ప్రజా కలం ప్రతినిధి): బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకుడు రేషం మల్లేష్ ఆధ్వర్యంలో పలారం బండి అమ్మవారి ఊరేగింపు కార్యక్రమం రాంనగర్ డివిజన్ ఎస్ఆర్‌టీ కాలనీ నుంచి జెమినీ కాలనీ అమ్మవారి ఆలయం వరకు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్, ఎమ్మెల్సీ దాసోజు శ్రావణ్, ఆర్మూర్ ఎమ్మెల్యే రాకేష్ రెడ్డి, మాజీ జీహెచ్ఎంసీ స్టాండింగ్ కమిటీ సభ్యుడు శ్రీనివాస రెడ్డి, యువ నాయకుడు ముఠా జైసింహ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు సిరిగిరి శ్యామ్, అజయ్ ముదిరాజ్, కల్వ గోపి, నేత శ్రీను, జంగయ్య గౌడ్, రాకం సత్యనారాయణ, వెంకటేష్, అమిత్ బన్నీ, రాజేష్, అరుణ్‌తో పాటు పార్టీ నాయకులు, మహిళలు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.





# జర్నలిస్టుల హక్కుల కోసం ఐక్యంగా పోరాటం

### - టీయూడబ్ల్యూజే..ఐజేయూ సమావేశంలో ఎంఏ ఫైజల్..

పటాన్‌చెరు, ఆగస్టు 11 (ప్రజా కలం) ప్రతినిధి
జర్నలిస్టుల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, సంక్షేమం కోసం ఐక్యంగా పనిచేయాలని టీయూడబ్ల్యూజే, ఐజేయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎంఏ ఫైజల్ పిలుపునిచ్చారు. రామచంద్రాపురంలోని లక్ష్మీ గార్డెన్‌లో పటాన్‌చెరు నియోజకవర్గ విస్తృత సమావేశం జరిగింది. ఫైజల్ మాట్లాడుతూ,70 ఏళ్ల చరిత్ర కలిగిన సంఘం జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తోందన్నారు. బస్సు పాస్‌లు, అర్హులైన జర్నలిస్టులకు అక్రిడిటేషన్ కార్డులు ఇప్పించడంలో కీలక పాత్ర పోషించిందన్నారు. జర్నలిస్టుల ఆరోగ్య భద్రత, హక్కుల పరిరక్షణకు కృషి చేస్తోందన్నారు. జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాట్లాడుతూ




జర్నలిస్టుల గౌరవం, భద్రత, హక్కుల కోసం ఐక్యంగా పోరాడాలన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి అనిల్ కుమార్ మాట్లాడుతూ పటాన్‌చెరు జర్నలిస్టుల సహకారంతోనే జిల్లా స్థాయికి ఎదిగానని, సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు. సమావేశానికి చెన్న బసవేశ్వర్ అధ్యక్షత వహించగా ఆసీఫ్, శ్రీనాథ్, శ్రీనివాస్ రెడ్డి, భూపాల్ రెడ్డి, సంతోష్, మజీద్, శ్రీనివాస్, ఆరీఫ్, సిద్దిఖ్, ఈశ్వర్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు.
అధ్యక్షుడిగా పత్తి నర్సింహా, ప్రధాన కార్యదర్శిగా యాదగిరి, సలహాదారులుగా కాశీపతి, సులేమాన్, రామారావు ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా విఠల్, నగేష్, శివకుమార్, జెమిని రాజు, రమేష్, జీవరత్నం; సంయుక్త కార్యదర్శులుగా వేణు, ప్రభాకర్, శ్రీనివాస్, కోటేష్, శివాజీ; నిర్వహణ కార్యదర్శులుగా ఆంజనేయులు, గాండ్ల మహేష్, వివేక్, రాజు; కోశాధికారిగా శ్రీనివాస్ రెడ్డి ఎన్నికయ్యారు. కార్యవర్గ సభ్యులుగా శ్రీనివాస్, శంకర్, శేఖర్, మహేందర్ గౌడ్, సిద్ధు, శ్రీనివాస్ మామా, రాజశేఖర్, ప్రదీప్ రెడ్డి, విజయ్, నాయుడు ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గానికి నాయకులు, జర్నలిస్టులు అభినందనలు తెలిపారు..

## ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవు

### 15 కేసుల పరిష్కారం. రూ.95 వేల జరిమానా.. ఇద్దరికి మూడు రోజుల జైలు

గజ్వేల్: 11 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)
ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వాహనదారులపై కఠిన చర్యలు తప్పవని గజ్వేల్ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనల అమలులో భాగంగా గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో నమోదైన కేసులను గజ్వేల్ ప్రిన్సిపల్ జేఎఫ్‌సీఎం కోర్టులో విచారించారు.
ఈ విచారణలో మొత్తం 15 కేసులు పరిష్కారం కాగా, నిందితులకు రూ.95,000 జరిమానా విధించినట్లు పోలీసులు తెలిపారు. ఇందులో ఆరు డ్రంక్ అండ్ డ్రైవ్ కేసుల్లో నిందితులకు కలిపి రూ.60,000 జరిమానా విధించగా, ఇద్దరికి మూడు రోజుల చొప్పున జైలు శిక్ష విధించారు. జైలు శిక్ష పడిన వారిలో గజ్వేల్ మండలం వేములగట్టుకు చెందిన నీరుగొండి కర్ణాకర్ (29), తొగుట మండలం లింగాపూర్‌కు చెందిన కొత్తపల్లి వైకుంఠం (55) ఉన్నారు. అదేవిధంగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన ఏడు కేసుల్లో నిందితులకు మొత్తం రూ.35,000 జరిమానా విధించినట్లు ట్రాఫిక్ పోలీసులు వెల్లడించారు. మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల రోడ్డు ప్రమాదాలు జరిగి ప్రాణనష్టం సంభవించే ప్రమాదం ఉందని ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ




తెలిపారు. వాహనదారులు మద్యం సేవించి వాహనాలు నడపవద్దని సూచించారు. ప్రతి వాహనదారుడు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండటంతో పాటు ట్రాఫిక్ నిబంధనలను పాటించాలని కోరారు. ట్రాఫిక్ నిబంధనలను ఉల్లంఘించే వారిపై ప్రత్యేక తనిఖీలు, చట్టపరమైన చర్యలు నిరంతరం కొనసాగుతాయని గజ్వేల్ ట్రాఫిక్ పోలీసులు స్పష్టం చేశారు.

## గుంతలమయంగా జాలిగామ బైపాస్ రోడ్డు

### మరమ్మతులు చేపట్టకపోతే బీజేపీ ఆధ్వర్యంలో ఆందోళన

### మండల అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్

గజ్వేల్:11 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )
గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ పట్టణం నుంచి రామాయంపేట వెళ్లే జాలిగామ బైపాస్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారి వాహనదారులకు



నరకప్రాయంగా తయారైందని గజ్వేల్ మండల బీజేపీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిత్యం వేలాది వాహనాలు రాకపోకలు సాగించే ఈ కీలక బైపాస్ రోడ్డుపై పెద్ద ఎత్తున గుంతలు ఏర్పడటంతో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని తెలిపారు. వాహనదారులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు, భయాందోళనల మధ్య ప్రయాణించాల్సి వస్తోందన్నారు. రోడ్డు దుస్థితిపై గతంలో పలు పర్యాయాలు వార్తాపత్రికల్లో కథనాలు ప్రచురితమైనప్పటికీ సంబంధిత అధికారులు, పాలకులు స్పందించకపోవడం బాధ్యతారాహిత్యానికి నిదర్శనమని అశోక్‌గౌడ్ మండిపడ్డారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జాలిగామ బైపాస్ రోడ్డుకు తక్షణమే మరమ్మతులు చేపట్టి ప్రజల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రహదారి మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం కొనసాగితే ప్రజల తరపున బీజేపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో దాతర్‌పల్లి సర్పంచ్ రాజు, మండల ప్రధాన కార్యదర్శులు ఇప్ప స్వామి, బార్ అరవింద్, మండల ఉపాధ్యక్షులు శాతం స్వామి, మండల సీనియర్ నాయకులు కర్నాలు శ్రీనివాస్, గణపతి, మహేష్ చారి, నరేష్, బీజేవైఎం నాయకులు అనిల్, సోషల్ మీడియా కన్వీనర్ జీడిపల్లి మధు కర్ణాకర్, మహేందర్, గణేష్, కుమార్, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

## అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో వైభవంగా శివపార్వతుల కల్యాణం

### ఆధ్యాత్మికతతో పాటు సేవాగుణాన్ని పెంపొందించుకోవాలి: కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్



గజ్వేల్:11 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )
సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర ఆలయంలో ఆషాఢ మాసం చివరి మంగళవారం సందర్భంగా శివపార్వతుల కల్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం శివపార్వతుల కల్యాణాన్ని వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కల్యాణోత్సవం అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలతో పాటు మహా అన్నప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజల్లో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన 20వ వార్డు కౌన్సిలర్ అత్తెల్లి శ్రీనివాస్ దంపతులు మాట్లాడుతూ శ్రీ అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామివారి అనుగ్రహంతో ప్రజలంతా సుఖసంతోషాలతో, సుభిక్షంగా ఉండాలని ఆకాంక్షించారు. 'శివుని ఆజ్ఞ లేనిదే చీమ కూడా కుట్టదు' అనే నానుడి ప్రజల్లో భక్తిభావాన్ని ప్రతిబింబిస్తుందని అన్నారు. ఆషాఢ మాసం సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజా కార్యక్రమాలను నిర్వహించడం అభినందనీయమన్నారు. అందులో భాగంగా శివపార్వతుల కల్యాణోత్సవంలో పాల్గొనడం ఆనందంగా ఉందని తెలిపారు. ప్రతి ఒక్కరూ దైవభక్తితో పాటు సేవాగుణాన్ని అలవర్చుకుని సమాజానికి తమ వంతు సేవ చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు జగ్గయ్య శ్రీనివాస్, కమిటీ సభ్యులు, ఆలయ అర్చకులు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## అమ్మవారి ఊరేగింపు స్వాగత కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్, హనుమంతరావు

మల్కాజిగిరి ఆగస్టు 11 (ప్రజా కలం లం ప్రతినిధి)
మల్కాజిగిరి చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నాయకులు ఏర్పాటు చేసిన అమ్మవారి ఊరేగింపు తొట్టెల స్వాగత వేదిక ఏర్పాటు కార్యక్రమాలలో మెదక్ ఎమ్మెల్యే రోహిత్, మల్కాజిగిరి మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పాల్గొన్నారు. అమ్మవారి ఊరేగింపుగా వస్తున్న వారికి స్వాగతం చెబుతూ పార్టీ శ్రేణులతో కలిసి పోతరాజులతో కలిసి వేదికపై కొద్దిసేపు నృత్యం చేశారు. అమ్మవారి కృప ఆశీస్సులతో అందరు కూడా బాగుండాలని కోరుకుంటున్నట్లు ఈ సందర్భంగా వారు చెప్పారు ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ వై ప్రేమ్ కుమార్ నక్క ప్రభాకర్ గౌడ్, బి బ్లాక్ అద్యక్షుడు వెంకటేష్ యాదవ్, బి కే శ్రీనివాస్, సత్య మూర్తి, బాబు సత్యనారాయణ సంపత్ రావు రాందాస్ సంతోష్ ముదిరాజ్, బ్రహ్మయ్య, రామక్రిష్ణ, రాము, లఖన్, శంకర్ రావు, కిషోర్ తదితరులు పాల్గొన్నారు



# ప్రజా బాటలో విద్యుత్ అధికారులు.

### గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ స్వామి.

దుబ్బాక ప్రజాకలం ఆగస్టు 11.

ప్రజల విద్యుత్ సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు విద్యుత్ శాఖ అధికారులు ప్రజల వద్దకే వెళ్తున్నారు. ప్రజాబాట కార్యక్రమంలో



భాగంగా గజ్వేల్ విద్యుత్ శాఖ డీఈ ఎ.స్వామి మంగళవారం రాయపోల్ మండల కేంద్రంలో పర్యటించారు. ఏఈ శ్రీనివాసరావుతో కలిసి రాయపోల్ గ్రామంలో పర్యటించిన డీఈ స్వామి.. విద్యుత్ సరఫరా, విద్యుత్ స్తంభాలు, లైన్లు తదితర సమస్యలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. గ్రామంలో విద్యుత్ సేవలకు సంబంధించి ఎదురవుతున్న ఇబ్బందులను పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ స్వామి మాట్లాడుతూ తమ పరిధిలోని సమస్యలను వెంటనే పరిష్కరిస్తామని తెలిపారు. పరిధికి మించిన సమస్యలను ఉన్నతాధికారులు, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రజలకు విద్యుత్ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు ఎప్పటికప్పుడు అందుబాటులో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మాసాన్‌పల్లి రాజు, ఉపసర్పంచ్ హమంతు రాజు, విద్యుత్ శాఖ అధికారులు శ్రీనివాసరావు, కర్ణకర్, ప్రవీణ్, ఆంజనేయులు, సత్తయ్య, వార్డు సభ్యుడు ప్రభాకర్, నవీన్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.

# నాల్గవ తరగతి ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి

### -- ఉద్యోగ సంఘాల నాయకుల డిమాండ్ -అధ్యక్షులు మహమ్మద్ షరీఫ్.



సంగారెడ్డి, ప్రతినిధి ఆగస్టు 11(ప్రజా కలం): సంగారెడ్డి జిల్లా తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల స్టాండింగ్ కౌన్సిల్ సమావేశం మంగళవారం సంగారెడ్డి సంఘ భవన్‌లో జిల్లా నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు మొహమ్మద్ షరీఫ్, కార్యదర్శి జె. నాగరాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సమావేశానికి రాష్ట్ర తెలంగాణ నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షులు దాస్య నాయక్, కార్యదర్శి ఖాదర్ బిన్ హసన్, అసోసియేషన్ ప్రెసిడెంట్ రాజేందర్ కోశాధికారి ధనరాజ్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. అలాగే సంగారెడ్డి జిల్లా టీఎన్జీఓఎస్ సంఘం అధ్యక్షులు మొహమ్మద్ జావిద్ అలీ, కార్యదర్శి వేల్పూరు రవి పాల్గొన్నారు.

ఈ సందర్భం గా జావిద్ అలీ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగులు ప్రభుత్వ కార్యాలయాల నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నప్పటికీ, వారి సమస్యలు ఇంకా పూర్తిస్థాయిలో పరిష్కారం కాలేదన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తామని తెలిపారు. ఉద్యోగుల పదోన్నతులు, బదిలీలు, సర్వీస్ సంబంధిత సమస్యలు, పెండింగ్‌లో ఉన్న ఇతర అంశాలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని కోరారు.

దాస్య నాయక్ మాట్లాడుతూ నాల్గవ తరగతి ఉద్యోగుల సంక్షేమం, హక్కుల పరిరక్షణ కోసం సంఘం నిరంతరం కృషి చేస్తుందని నాయకులు పేర్కొన్నారు. ఆరోగ్య భద్రత కొరకు ఉద్యోగులందరూ ఐక్యంగా ఉండి సంఘాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లా అధ్యక్షులు మొహమ్మద్ షరీఫ్ మాట్లాడుతూ ఉద్యోగుల సమస్యలను ఎప్పటికప్పుడు రాష్ట్ర సంఘం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యదర్శి నాగరాజు మాట్లాడుతూ ఉద్యోగులందరూ సంఘ కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొని తమ సమస్యలను సంఘం దృష్టికి తీసుకురావాలని కోరారు.

అసోసియేట్ అధ్యక్షులు కసిని శ్రీకాంత్, వెంకట్ రెడ్డి, కోశాధికారి శ్రీనివాస్, ప్రమోద్, యాదవ రెడ్డి, విజయ్ తదితరులు సమావేశంలో పాల్గొని నాల్గవ తరగతి ఉద్యోగులకు సంఘం తరఫున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు.

సమావేశంలో పలువురు నాల్గవ తరగతి ఉద్యోగుల సంఘం నాయకులు, ప్రతినిధులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



# పలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న టీపీసీసీ కార్యదర్శి యెలిమేటి అమరేందర్ రెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 11,(ప్రజా కలం)

రంగారెడ్డి జిల్లా పరిధిలోని మహేశ్వరం నియోజకవర్గం, జీహెచ్ఎంసీ పరిధిలోని జిల్లెలగూడ బాలాపూర్ డివిజన్లలో బోనాల పండుగ సందర్భంగా నిర్వహించిన పలహార బండి ఊరేగింపు కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కంటెస్టెడ్ ఎమ్మెల్యే టీపీసీసీ కార్యదర్శి యెలిమేటి అమరేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో రంగారెడ్డి జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ క్యారగారి శ్రీధర్, గజ్జెల రామచందర్, మాజీ కార్పొరేటర్లు పోరెడ్డి భాస్కర్ రెడ్డి, సిద్ధాల శ్రీశైలం, వంగేటి మధుసూదన్ రెడ్డి, రాజేష్ ఠాకూర్, ఓం ప్రకాష్, ఎం. శ్రీనివాస్, రావుల లింగం, దాసరి కిరణ్, మైత్రి ఆనంద్, బల్వంత్ రెడ్డి, తాద్కల నితీష్ కుమార్, ప్రశాంత్, సాయి కుమార్, వారికుపాల శ్రీకాంత్, శ్రీనివాస్, కిరణ్ కుమార్, జార్జ్ శ్రీశైలం, చింతపట్ల పవన్, సూరి, మేకల మహేందర్ తదితరులు పాల్గొన్నారు.

# టి కె ఆర్ కళాశాలలో డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి జన్మదిన వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 11,(ప్రజా కలం)

తీగల కృష్ణారెడ్డి విద్యా సంస్థల కార్యదర్శి డాక్టర్ తీగల హరినాథ్ రెడ్డి జన్మదిన వేడుకలు తీగల కృష్ణారెడ్డి ఇంజినీరింగ్ అండ్ టెక్నాలజీ కళాశాలబిలో



అత్యంత ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత కళాశాల చైర్మన్ తీగల కృష్ణారెడ్డి ప్రిన్సిపల్స్, విభాగాధిపతులు, అధ్యాపకులు నియోజకవర్గ సీనియర్ నాయకుల సమక్షంలో కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు నిర్వహించారు. జన్మదినాన్ని పురస్కరించుకుని కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం భారతీయ రెడ్‌క్రాస్ సొసైటీ సంయుక్త ఆధ్వర్యంలో బిమెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ కార్యక్రమ అధికారులు డా. జె. సునీత కుమారి, డా. కె. సుకన్య,ఎన్ఎస్ఎస్ వాలంటీర్లు ఉత్సాహంగా పాల్గొన్నారు. సుమారు 350 మంది విద్యార్థులు స్వచ్ఛందంగా రక్తదానం చేసి కార్యక్రమాన్ని నిర్వహించారు. డా. తీగల హరినాథ్ రెడ్డి సందేశం తనకు శుభాకాంక్షలు తెలిపిన ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపిన ఆయన, రక్తదాన శిబిరాన్ని విజయవంతంగా నిర్వహించిన ఎన్ఎస్ఎస్ విభాగం, రెడ్‌క్రాస్ సొసైటీ, అధికారులు వాలంటీర్లను ప్రత్యేకంగా అభినందించారు.

# నిరుపేద దళిత రైతులకు న్యాయం చేయాలి

### అధికారుల జోక్యంతో

### భూ సమస్యను పరిష్కరించాలి: అప్పాల మల్లేశం



గజ్వేల్ నియోజకవర్గం:11ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి )

సిద్దిపేట జిల్లా గజ్వేల్ నియోజకవర్గం మర్కుక్ మండలం కాశిరెడ్డిపల్లి గ్రామంలోని నిరుపేద దళిత రైతులకు న్యాయం చేయాలని గ్రామ సీనియర్ నాయకుడు అప్పాల మల్లేశం డిమాండ్ చేశారు. ప్రభుత్వం కేటాయించిన వ్యవసాయ భూమిని ఇతర ప్రాంతాలకు చెందిన కొంతమంది వ్యక్తులు స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా అప్పాల మల్లేశం మాట్లాడుతూ కాశిరెడ్డిపల్లి గ్రామానికి చెందిన రైతులు తరతరాలుగా సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారని తెలిపారు. గ్రామంలోని నిరుపేద దళిత రైతులకు సంబంధించిన సుమారు 9ఎకరాల 20 గుంటల వ్యవసాయ భూమిపై కొంతమంది వ్యక్తులు హక్కు కల్పించుకునేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. దీంతో రైతులకు అన్యాయం జరుగుతోందని, సమస్యను పరిష్కరించి తమకు న్యాయం చేయాలని కోరుతూ సంబంధిత రైతులు మర్కుక్ తహసీల్దార్ కార్యాలయంలో అధికారులకు దరఖాస్తు సమర్పించినట్లు తెలిపారు. రైతుల పరిస్థితిని అధికారులు పరిశీలించి,భూమికి సంబంధించిన పూర్తి వివరాలను విచారించి,అర్హులైన నిరుపేద దళిత రైతులకు న్యాయం చేయాలని అప్పాల మల్లేశం కోరారు.రైతుల భూములను పరిరక్షించేందుకు అధికారులు తక్షణమే చర్యలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.



# సబితా ఇంద్రారెడ్డి చొరవతో శ్రీధర్, బాలాజీ కాలనీల వరద సమస్యకు పరిష్కారం

### సబితా ఇంద్రారెడ్డికి కృతజ్ఞతలు తెలిపిన బాలాజీ కాలనీ వాసుల



మహేశ్వరం , ఆగస్టు 11,(ప్రజా కలం)

వర్షా కాలంలో కురిసే వర్షాలకు పైనున్న సుమారు 40 కాలనీల నుండి వచ్చే వరద నీరంతా శ్రీధర్ కాలనీ, బాలాజీ కాలనీలలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో, శ్రీధర్ కాలనీ ఎదురుగా ఉన్న డ్రైనేజీ అవుట్‌లెట్ వద్ద పాత కల్వర్టు ప్రాంతంలో కొత్త పైప్‌లైన్ అవుట్‌లెట్ నిర్మించేందుకు చర్యలు చేపట్టారు. గతంలో ఈ ప్రాంతంలోని వరద నీటి సమస్యను స్థానిక నాయకులు ఆర్కల కామేష్ రెడ్డి గారి ద్వారా తెలుసుకున్న మాజీ మంత్రి, మహేశ్వరం నియోజకవర్గ శాసనసభ్యురాలు పట్లోల్ల సబితా ఇంద్రారెడ్డి , బడ్జెట్ తక్కువగా ఉన్నప్పటికీ ప్రజా శ్రేయస్సును ధ్యేయంగా పెట్టుకుని సమస్య పరిష్కారానికి ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా బాలాజీ కాలనీ వాసులు మేడమ్ సబితా ఇంద్రారెడ్డి కి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాట్లాడిన మీర్‌పేట్ బి.ఆర్.ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు ఆర్కల కామేష్ రెడ్డి మాట్లాడుతూ, ఇలాంటి సమస్యలు మరెన్నో కాలనీల్లో ఉన్నాయని, ఆయా కాలనీ వాసుల వినతులను స్వీకరించి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు అవసరమైన బడ్జెట్‌ను తీసుకువచ్చి ఇచ్చిన మాటను నిలబెట్టుకుంటారని అన్నారు. ఆధ్వర్యంలో, వారి సంపూర్ణ సహకారంతో ఒక్కొక్క సమస్యను పరిష్కరిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలాజీ కాలనీ అధ్యక్షుడు శాంతమూర్తి, శ్రీనివాస్ రెడ్డి, హరిబాబు కమల్ తదితరులు పాల్గొన్నారు.

# గీత కార్మికుల హామీలను వెంటనే అమలు చేయాలి

### ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా గీతన్నలకు అండగా నిలవాలి: మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్





గజ్వేల్:11 ఆగస్టు 2026 ( ప్రజా కలం ప్రతినిధి)

గీత కార్మికులకు ఎన్నికల ముందు ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్ డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యల పరిష్కారం కోసం రాష్ట్రంలోని ప్రతి జిల్లా, మండలంలో చైతన్య యాత్రలు నిర్వహిస్తున్నామని తెలిపారు. గజ్వేల్ క్యాంపు కార్యాలయంలో గజ్వేల్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్‌ను గజ్వేల్ మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ కళ్యాణ్‌కార్, పద్మాబాయి నర్సింగరావు శాలువాతో సన్మానించారు. అనంతరం గజ్వేల్ పట్టణంలోని ఆర్‌అండ్‌ఆర్ కాలనీలో గీత కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించిన గీతన్నల చైతన్య యాత్రలో శ్రీనివాస్ గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రమాదవశాత్తు గీత కార్మికుడు మృతి చెందితే రూ.10 లక్షల ఎక్స్‌గ్రేషియా అందిస్తామని ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయడం లేదని శ్రీనివాస్ గౌడ్ విమర్శించారు. కల్లు దుకాణాల మూసివేతతో గీత కార్మికులు ఉపాధి కోల్పోయి తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మద్యం దుకాణాల్లో గీత కార్మికులకు 25 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని ఇచ్చిన హామీని కూడా ప్రభుత్వం నెరవేర్చలేదని ఆరోపించారు. కల్తీ పేరుతో గీత కార్మికులను వేధించడం, అక్రమ కేసులు నమోదు చేయడం వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. హైదరాబాద్‌తో పాటు రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లో మూసివేసిన కల్లు దుకాణాలను తక్షణమే తెరవాలని కోరారు. గీత కార్మికులపై ఎక్సైజ్ దాడులు, మామూళ్ల దందాను అరికట్టాలని, అక్రమంగా నమోదు చేసిన కేసులను ఎత్తివేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గీత కార్మికుల సమస్యలు ఏ ఒక్క పార్టీకి సంబంధించినవి కావని, అన్ని రాజకీయ పార్టీలకు చెందిన నాయకులు, ప్రజాప్రతినిధులు పార్టీలకు అతీతంగా గీతన్నలకు అండగా నిలవాలని శ్రీనివాస్ గౌడ్ పిలుపునిచ్చారు. గీత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిర్వహిస్తున్న చైతన్య యాత్రలకు ప్రజలు, గీత కార్మికులు పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని కోరారు. రాబోయేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని, తమ పార్టీ తిరిగి అధికారంలోకి వచ్చిన అనంతరం గీత కార్మికులను వేధించిన వారిని వదిలిపెట్టబోమని శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గీత కార్మికుల హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ గంగిశెట్టి చందన రవీందర్, బీఆర్ఎస్ రైతుబంధు సమితి రాష్ట్ర మాజీ కోఆర్డినేటర్ దేవి రవీందర్, మాజీ మార్కెట్ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, ఉడేం కృష్ణారెడ్డి, స్థానిక కౌన్సిలర్ కోట బాబు, శ్రీధర్, లక్ష్మాపూర్ మాజీ సర్పంచ్ కొలిచేలిమి స్వామి, బొగ్గుల సురేష్, కప్ప పోచయ్య, నవాజ్ మీరా, శివ, కృష్ణగౌడ్, మల్లేశంగౌడ్, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ గౌడ సంఘం అధ్యక్షుడు పల్లిపాటి కాకనగౌడ్, యాదగౌడ్, భాస్కర్‌గౌడ్, రాజుగౌడ్, అంజాగౌడ్, ఎర్రవల్లి యాదగౌడ్, కిష్టాపూర్ రామగౌడ్ తదితర గౌడ సంఘం, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు..

# అమ్మవారు ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మార్పీఎస్ నాయకులు

మల్కాజిగిరి,ఆగస్టు 11 (ప్రజా కలం ప్రతినిధి)

మల్కాజిగిరి వినాయక్ నగర్ డివిజన్ లో బిఆర్ఎస్ నాయకులు తులసి సురేష్ ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారి పలారం బండి ఊరేగింపు కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ నాయకులు మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా ఇన్చార్జ్ తిప్పారపు లక్ష్మణ్ మాదిగ, ఎం జె ఎఫ్ రాష్ట్ర నాయకులు మనోహర్, మల్కాజిగిరి మాదిగ సంక్షేమ సంఘ నాయకులు దళిత రత్న సంధిగారి నర్సింగరావు మాదిగ, ఎంఈఎఫ్ నాయకులు ఆనంద్ కుమార్ తదితరులతో కలిసి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తులసి సురేష్ వేయప్రయాసాలకు ఓర్చుకొని ఎంతో అద్భుతంగా అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని నిర్వహించడం ఎంతో అభినందించే తగ్గదని అమ్మవారి కృపతో అందరూ సంతోషంగా ఉండాలని కోరుకుంటున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున స్థానిక యువత మహిళలు తదితరులు పాల్గొన్నారు.





# శాకాంబరీ అవతారంలో భక్తులకు దర్శనమిచ్చిన ఉజ్జయిని మహంకాళి

## - మహిళల ఆధ్వర్యంలో
## భారీ ర్యాలీతో ఆలయానికి చేరుకున్న ఉత్సవ అమ్మవార్లు.

వేములవాడ ఆగస్టు 11 ( ప్రజా కలం ప్రతినిధి) :
ఆషాఢ మాసం పురస్కరించుకొని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల ఉత్సవాలు భక్తిశ్రద్ధలతో వైభవంగా కొనసాగుతున్నాయి, ఉత్సవాల్లో భాగంగా మూడవరోజు ఉదయం అమ్మవార్లకు వేద పండితులచే ప్రత్యేక పూజలు,అభిషేకాలు నిర్వహించారు.అనంతరంమహిళల ఆధ్వర్యంలో భారీ ర్యాలీతో బోనాల ఉత్సవ అమ్మవార్లను ఉజ్జయిని మహంకాళి ఆలయానికి తీసుకువచ్చారు,ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో మహిళలు,భక్తులు ఈ కార్యక్రమంలో పాల్గొని అమ్మవార్లకు ఘనంగా స్వాగతం పలికారు.మహిళలు భక్తిశ్రద్ధలతో అమ్మవారి నామస్మరణతో ర్యాలీగా ఆలయానికి చేరుకోవడంతో పట్టణంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొంది.డప్పుచప్పుళ్ళు,మంగళ వాయిద్యాలు, భక్తుల జయుజయుధ్వానాలతో ఆలయ పరిసరాలు మార్మోగాయి, ఉత్సవాల్లో భాగంగా ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించిన అనంతరం శ్రీ ఉజ్జయిని మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లను శాకాంబరీ అవతారంలో సర్వాంగ సుందరంగా అలంకరించారు. వివిధ రకాల కూరగాయులు, ఆకుకూరలు,పండ్లు తదితరాలతో అమ్మవార్లను విశేషంగా అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు, శాకాంబరీ అవతారంలో కొలువుదీరిన ముగ్గురు అమ్మవార్లను



దర్శించుకునేందుకు భక్తులు పెద్ద సంఖ్యలో ఆలయానికి తరలివచ్చారు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు,శాకాంబరీ దేవి అన్నదాతలకు,పాడిపంటలకు ప్రతీకగా భావించబడుతుండటంతో రైతులు,మహిళలు,భక్తులు అమ్మవారిని దర్శించుకుని సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని ప్రార్థించారు, అమ్మవారి కరుణాకటాక్షాలతో ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు, ఉత్సవాల సందర్భంగా ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్,సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.భక్తుల రాకతో ఉజ్జయిని మహంకాళి ఆలయం ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది.ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు,భక్తులు,పుర ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు,ఆలయ కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# కల్యాణలక్ష్మితో ఆడపిల్లల కుటుంబాలకు ఆర్థిక భరోసా

మల్కాజిగిరి ఆగస్టు 11 (ప్రజా కలం ప్రతినిధి)
పేద కుటుంబాలలో ఆడపిల్లల వివాహాలకు కల్యాణలక్ష్మి పథకం ఆర్థిక భరోసా కల్పిస్తోందని మల్కాజిగిరి ఎమ్మెల్యే తెలిపారు.మల్కాజిగిరి తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 21 మంది కల్యాణలక్ష్మి లబ్ధిదారులకు ఎమ్మెల్యే, తహసీల్దార్ కలిసి చెక్కులను అందజేశారు.ఈ సందర్భంగా మొత్తం రూ.21,02,436 విలువైన చెక్కులను లబ్ధిదారులకు



పంపిణీ చేశారు.పేద కుటుంబాలకు ప్రభుత్వం అందిస్తున్న కల్యాణలక్ష్మి ఆర్థిక సాయం ఆడపిల్లల వివాహ సమయంలో ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని ఎమ్మెల్యే పేర్కొన్నారు.అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.ఈ కార్యక్రమంలో రెవెన్యూ అధికారులు,సిబ్బంది, లబ్ధిదారులు తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు ఉచిత నోట్ పుస్తకాల పంపిణీ.

దుబ్బాక ప్రజాకలం ఆగష్టు 11:ప్రభుత్వ జూనియర్ కళాశాల దౌల్తాబాద్‌లో విద్యార్థులకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఈ విద్యా సంవత్సరం నుంచి ఉచితంగా అందిస్తున్న నోట్ పుస్తకాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మధు శ్రీవాస్తవ చేతుల మీదుగా విద్యార్థులకు నోట్ పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మధు శ్రీవాస్తవ మాట్లాడుతూ విద్యార్థుల విద్యాభ్యాసానికి నోట్ పుస్తకాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని తెలిపారు. ప్రభుత్వం ఉచితంగా అందిస్తున్న ఈ నోట్ పుస్తకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ప్రతిరోజూ క్రమం తప్పకుండా తరగతులకు హాజరై, ఉపాధ్యాయులు బోధించే పాఠ్యాంశాలను శ్రద్ధగా అభ్యసించాలని కోరారు. విద్యార్థుల విద్యాభివృద్ధికి కళాశాల అధ్యాపక బృందం ఎల్లప్పుడూ అవసరమైన సహాయ సహకారాలను అందిస్తుందని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థులకు ఉచితంగా నోట్ పుస్తకాలను అందించడం ద్వారా వారి చదువుకు ఆర్థికంగా తోడ్పాటు అందిస్తోందని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఉన్నత లక్ష్యాలను సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అధ్యాపకులు సుధాకర్, లక్ష్మీనారాయణ, దయానంద్, శివకుమార్, మంగ్తా నాయక్, శ్రీనివాసరెడ్డి, కే. శ్రీనివాస్, నాగేశ్వరరావు, పవన్ కుమార్‌తో పాటు అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు. ఉచితంగా నోట్ పుస్తకాలు అందుకోవడం పట్ల విద్యార్థులు ఆనందం వ్యక్తం చేశారు. నోట్ పుస్తకాలు తమ రోజువారీ చదువుకు, తరగతి పాఠాలను నోట్ చేసుకోవడానికి ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు.



# అమ్మవార్ల ఆశీర్వాదం...వేములవాడ ప్రజల అదృష్టం

## - ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్ ఆది.

వేములవాడ,
ఆగస్టు 11(ప్రజాకలం ప్రతినిధి ) :
ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని వేములవాడ పట్టణంలోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి ఆలయంలో బోనాల జాతర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతున్నాయి, ప్రతినిత్యం అమ్మవార్ల ఆరాధనలతో ఆలయ ప్రాంగణం ఆధ్యాత్మిక సందడితో అలరిస్తుంది,ఈ సందర్భంగా మంగళవారం రాష్ట్ర ప్రభుత్వ విప్,వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు,

అనంతరం ఆలయంలో కొలువుదీరిన శ్రీ ఉజ్జయిని మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేసి అమ్మవార్ల ఆశీస్సులు పొందారు.ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ఆషాఢ మాసం ప్రజలందరికీ పవిత్రమైన మాసమని పేర్కొన్నారు.బోనాల జాతర మహోత్సవాలలో అమ్మవార్లను దర్శించుకోవడం తాను చేసుకున్న పుణ్యమన్నారు. ఆలయంలో శ్రీ ఉజ్జయిని



మహంకాళి,శ్రీ ప్రత్యంగిరా,శ్రీ భగలాముఖి అమ్మవార్లు ఒకే చోట కొలువుదీరి భక్తులకు దర్శనమివ్వడం వేములవాడ ప్రజల అదృష్టమని తెలియజేశారు,అఖిలాండ శక్తి స్వరూపిణులైన అమ్మవార్ల కరుణాకటాక్షాలు ప్రజలందరిపై ఎల్లవేళలా ఉండాలని మనస్ఫూర్తిగా ఆకాంక్షించారు, అమ్మవార్ల దయతో సమృద్ధిగా వర్షాలు కురిసి పాడిపంటలు సుభిక్షంగా ఉండాలని,రైతులు సంతోషంగా ఉండాలని కోరుకున్నారు,ప్రజలంతా ఆయురారోగ్యాలతో,సుఖసంతోషాలతో జీవించాలని అమ్మవార్లను ప్రార్థించినట్లు తెలిపారు,ఆషాఢ మాసం పురస్కరించుకొని ఆలయంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా బోనాల జాతర మహోత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్న ఆలయ కమిటీని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రత్యేకంగా అభినందించారు. ముఖ్యంగా ఆలయ కమిటీ చైర్మన్ మహంకాళి శ్రీనివాస్ గౌడ్‌ను ప్రత్యేకంగా అభినందిస్తూ,ఆలయ అభివృద్ధి,భక్తుల సౌకర్యాల కల్పనలో కమిటీ చేస్తున్న కృషిని ప్రశంసించారు.

ఈ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌ను శాలువాతో ఘనంగా సత్కరించారు అనంతరం అమ్మవార్ల చిత్రపటాన్ని ఆయునకు అందజేశారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు,మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు,కాంగ్రెన్ పార్టీ పట్టణ అధ్యక్షుడు,కౌన్సిలర్ తుమ్ మధు,కౌన్సిలర్లు తోట రాజు,కొండ శేఖర్,అన్నారం శ్రీనివాన్,కుమ్మరి శ్రీనివాన్,కాంగ్రెన్ నాయకులు చంద్రగిరి శ్రీనివాస్ గౌడ్,నాగుల విష్ణు ప్రసాద్, పాత సత్యలక్ష్మి, బైరి సతీష్ ముదిరాజ్ లతో పాటు ఆలయ కమిటీ సభ్యులు కందుల క్రాంతి కుమార్,భివండి శ్రీనివాస్,నరేష్ ,మైలారం రాము తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే చింతా వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేతల ఫైర్ చింతా ఖబర్దార్

## - మరోసారి జగ్గారెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఖబర్దార్ అని చింతా ప్రభాకర్ కు హెచ్చరిక.

## అభివృద్ధిపై బహిరంగ చర్చకు సిద్ధమా? ఎమ్మెల్యే చింతా కు సవాల్

## - టిపిసిసి ప్రధాన కార్యదర్శి తోపాజీ అనంత కిషన్.

సంగారెడ్డి ప్రతినిధి ఆగస్టు 11( ప్రజా కలం):
సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ చేసిన వ్యాఖ్యలపై నియోజకవర్గ కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా స్పందించారు. జగ్గారెడ్డిపై విమర్శలు చేస్తే ఖబర్దార్ అంటూ హెచ్చరించారు. తాము చేసిన ఆరోపణలపై బహిరంగ చర్చకు సిద్ధమా అని ఎమ్మెల్యే చింతా ప్రభాకర్‌కు సవాల్ విసిరారు. 2017లో సంగారెడ్డిలో రాహుల్ గాంధీ సభ విజయవంతం కావడంతో కేసీఆర్, హరీష్ రావులు జగ్గారెడ్డిపై కక్ష పెంచుకున్నారని ఆయన చేసిన వ్యాఖ్యలకు చింతా ప్రభాకర్ కౌ ఇచ్చిన కౌంటర్ పై కాంగ్రెస్ నేతలు మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చింతా ప్రభాకర్ కుటుంబానికి సంబంధించిన భూముల వ్యవహారంపై ప్రశ్నలు లేవనెత్తారు. సీలింగ్ భూమి రిజిస్ట్రేషన్, దళితుల భూములు,



సదాశివపేటలో రోడ్ల కబ్జా, మాలకుంట కబ్జా తదితర అంశాలపై ఎమ్మెల్యే సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ చైర్మన్‌గా ఉన్న సమయంలో మహిళా కౌన్సిలర్ల పట్ల వ్యవహరించిన తీరుపైనా ప్రశ్నించారు. సదాశివపేటలో ఎక్కడికి రమ్మన్నా మేము అక్కడికి వస్తాం.. బహిరంగ చర్చకు సిద్ధమా? అంటూ కాంగ్రెస్ నేతలు సవాల్ విసిరారు. ఇకపై బీఆర్ఎస్ నాయకుల అవినీతి చిట్టాను ఒక్కొక్కటిగా బయుటపెడతామని హెచ్చరించారు. సంగారెడ్డి అభివృద్ధిపై సైతం చింతా ప్రభాకర్‌కు కాంగ్రెస్ నాయకులు సవాల్ విసిరారు. ఐఐటీ, ఇంటింటికీ మంజీరా నీరు, సంగారెడ్డి--లింగంపల్లి నాలుగు లేన్ల రహదారి, ప్రభుత్వ పాలిటెక్నిక్, అగ్రికల్చర్, పీజీ కాలేజీల ఏర్పాటు, కరోనా సమయంలో ఆక్సిజన్ సిలిండర్ల అందజేత వంటి కార్యక్రమాలను జగ్గారెడ్డి చేపట్టారని తెలిపారు. సంగారెడ్డి నియోజకవర్గంలో అభివృద్ధి జగ్గారెడ్డితోనే సాధ్యమైందన్నారు. నియోజకవర్గంలో ప్రజలకు ఏ కష్టం వచ్చినా, గుర్తుకు వచ్చే పేరు జగ్గారెడ్డిదేనని వివరించారు. ప్రజల కష్టాలు తీర్చే నాయకుడు జగ్గారెడ్డి అని గుర్తు చేశారు. సమావేశంలో నియోజకవర్గ కన్వీనర్ చేర్యాల ఆంజనేయులు, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి తోపాజి అనంత్ కిషన్, సీడీసీ చైర్మన్ రామ్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ మునిపల్లె సత్యనారాయణ, కూన సంతోష్, షఫీ హాఫీజ్, కిరణ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలను వ్యతిరేకించండి

## ఏఐటియుసి రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి బి. దత్తు నాయక్

మహేశ్వరం, ఆగస్టు 11,(ప్రజా కలం)
క్విట్ ఇండియా ఉద్యమ ఆగస్టు 10 స్ఫూర్తితో కందుకూరు మండల కేంద్రంలో జైల్ బరో కార్యక్రమం ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగల రాజు ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ర్యాలీ, రాస్తారోకో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బి . దత్తు నాయక్ ఏఐటియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి హాజరై మాట్లాడుతూ క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర రాష్ట్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిరసన ప్రదర్శన ధర్నాలు జైల్ భరో కార్యక్రమాలు నిర్వహించాలని సెంట్రల్ ట్రేడ్ యూనియన్ పిలుపునివ్వడం జరిగింది. అనేక పోరాటాలతో త్యాగాలతో భారతదేశ కార్మిక వర్గం



సాధించుకున్న 44 చట్టాలను రద్దుచేసి వాటి స్థానంలో కార్మికుల వ్యతిరేకంగా 4 లేబర్ కోడ్ ను తీసుకొచ్చి కార్మికులను బానిసలుగా తయారుచేసి కార్పొరేట్ శక్తులకు మేలు చేసేందుకు 47 కోట్ల మంది కార్మికులకు నష్టం జరిగే విధంగా వివరిస్తుంది. అదేవిధంగా కేంద్ర ప్రభుత్వం 90% కార్మిక వర్గానికి సామాజిక భద్రత లేకపోవడం కాక వారికి కనీస జీవన ప్రమాణాలు కూడా దూరం చేస్తూ సామాజిక భద్రత ప్రయోజనాలను రద్దు చేస్తుంది. రైతులకు వ్యతిరేకంగా చట్టాలను వ్యవసాయ కార్మికులకు ఉపాధి హామీ పథకాన్ని రద్దు చేయడం, ఆ పథకాన్ని బడ్జెట్ కేటాయించక పోవడం,విద్యుత్తు మోటార్లకు మీటర్లు పెట్టడం సామాన్యుడు బ్రతకలేని పరిస్థితిగా ఈరోజు కేంద్ర ప్రభుత్వం వ్యవహరిస్తా ఉంది. కార్మికులకు కనీస వేతనం 26 వేల రూపాయలు చెల్లించాలని ఉన్నత డాక్టర్ ఆక్రేడ్ ఫార్ములా మేధావులు ఐఏఎస్ చెప్తుంటే వారి మాటను పట్టించుకోవడం లేదు. దేశ సంపద మొత్తం ఆదాని అంబానీలకు కట్టబెట్టి సామాన్యుల మోయలేని భారాన్ని పెంచుతుం ఓడి. ఈ విధానం మార్చుకోకపోతే రాబోవు రోజులో పెద్ద ఎత్తున ఆందోళన పోరాటాలకు కార్మికులు సిద్ధం కావాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏఐటీయూసీ జిల్లా కార్యవర్గ సభ్యులు కొమ్మగల రాజు, దేవేంద్ర గౌడ్ మండల కార్యదర్శి యాదగిరి, రవి, పప్పు శాం సంగ్ నరసింహ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఆషాఢ గోరింటాకు సంబరాలతో కళకళలాడిన గజ్వేల్ మహిళా డిగ్రీ కళాశాల

## గోరింటాకు సంప్రదాయంతో పాటు ఆరోగ్య ప్రయోజనాలూ ఉన్నాయి: ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం

గజ్వేల్:11 ఆగస్టు ( ప్రజా కలం ప్రతినిధి )
ఆషాఢ మాసాన్ని పురస్కరించుకుని గజ్వేల్ మహిళా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గోరింటాకు సంబరాలను ఘనంగా నిర్వహిం చారు.కళాశాల మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థినీలు ఉత్సాహంగా పాల్గొని పరస్పరం గోరింటాకు పెట్టుకున్నారు.దీంతో కళాశాల ప్రాంగణంలో పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ ప్రొఫెసర్ అనిత అబ్రహం మాట్లాడుతూ ఆషాఢ మాసంలో గోరింటాకు పెట్టుకోవడం వెనుక శాస్త్రీయ,ఆయుర్వేద ప్రాధాన్యత ఉందని తెలిపారు.వర్షాకాలంలో వచ్చే కొన్ని సీజనల్, చర్మ సంబంధిత సమస్యల నివారణకు గోరింటాకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు.ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ కన్వీనర్ డాక్టర్ డి.సుజాత మాట్లాడుతూ గోరింటాకు కేవలం ఆరోగ్య ప్రయోజనాలకే కాకుండా తెలుగు సంస్కృతి, సంప్రదాయాల్లో ప్రత్యేక స్థానం కలిగి ఉందన్నారు. ఆషాఢ మాసంలో మహిళలు,చిన్నారులు ఒకచోట చేరి గోరింటాకు పెట్టుకోవడం ఆనవాయితీగా వస్తోందని తెలిపారు.గోరింటాకు చర్మ సమస్యలు, కాళ్ల పగుళ్లు,గోళ్ల ఆరోగ్యం, శిరోజాల సంరక్షణ తదితర అంశాల్లో ఆయుర్వేదపరంగా ఉపయోగకరంగా ఉంటుందని వివరించారు.ఈ సందర్భంగా విద్యార్థినీలు సంప్రదాయ దుస్తుల్లో పాల్గొని, ఒకరికొకరు గోరింటాకు పెట్టుకుంటూ సందడి చేశారు. సంప్రదాయాన్ని విద్యార్థినీలకు పరిచయం చేస్తూ, ఆషాఢ మాస ప్రాధాన్యతను తెలియజేసేలా కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కళాశాల ఐక్యూఏసీ కన్వీనర్ ఎం.ఎం.లక్ష్మి,సీనియర్ అధ్యాపకులు




శ్రీలత,డాక్టర్ సరోజ,కస్తూరి బాయి, డాక్టర్ సి. హెచ్. శోభారాణి, జె.వి.ఆర్.అర్చన, సి. హెచ్. ఉమారాణి,సరోజన,డాక్టర్ జ్యోతి,శృతి,అధ్యాపకులు డాక్టర్ బి.మురళీధర్, డాక్టర్ ఎ.బాలచంద్రం, కళాశాల కార్యాలయ సిబ్బంది, పెద్ద సంఖ్యలో విద్యార్థినీలు పాల్గొన్నారు.




## పేద ప్రజలకు నిత్యావసర సరుకులు పంపిణీ చేసిన త్రైవ్ ఫర్ యూత్ స్వచ్ఛంద సంస్థ

మల్కాజిగిరి,ఆగస్టు 11 (ప్రజా కలం ప్రతినిధి)

అమెరికా కేంద్రంగా పేద ప్రజలకు సేవలందిస్తున్న త్రైవ్ ఫర్ యూత్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో మంగళవారం కాప్రా సర్కిల్ పరిధిలోని అరుల్ కాలనీలో బీబీసీ క్రైస్తవ ప్రార్థనా మందిరంలో 15 పేద కుటుంబాలకు బియ్యం, నిత్యావసర సరుకులను ఉచితంగా పంపిణీ చేశారు. సంస్థ నిర్వాహకులు ప్రభేష్ ఎర్నేని ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రభేష్ ఎర్నేని మాట్లాడుతూ.. కరోనా సమయంలో పేద, మధ్యతరగతి కుటుంబాలు ఆహారం కోసం తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్న నేపథ్యంలో, ఎవరూ ఇబ్బందులు పడకూడదనే ఉద్దేశంతో సేవా కార్యక్రమాలను కొనసాగిస్తున్నట్లు తెలిపారు. పేద ప్రజలకు బియ్యం, నిత్యావసర సరుకులు అందించడంతో పాటు, ఆర్థికంగా వెనుకబడిన చిన్నారులు, విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్నామని చెప్పారు. యువతకు ఆర్థిక సహాయం చేయడంతో పాటు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీబీసీ మినిస్ట్రీస్ ఫాస్టర్ రవికుమార్, సంఘ పెద్దలు ప్రవీణ్, చిట్టిబాబు, అనిల్, శ్యాంసన్, దీపిక తదితరులు పాల్గొన్నారు.

## వసంతపురి సబ్‌స్టేషన్‌లో ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యం పెంపు

మల్కాజిగిరి ఆగస్టు 11(ప్రజా కలం ప్రతినిధి)

పెరుగుతున్న విద్యుత్ డిమాండ్‌కు అనుగుణంగా వినియోగదారులకు నాణ్యమైన, నిరంతరాయ విద్యుత్ సరఫరా అందించేందుకు టీజీఎస్పీడీసీఎల్ విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తోంది. ఇందులో భాగంగా హబ్సిగూడ సర్కిల్ పరిధిలోని సైనిక్‌పురి డివిజన్, మల్కాజిగిరి సబ్ డివిజన్, వసంతపురి సెక్షన్‌లోని 33/11 కేవీ సబ్‌స్టేషన్‌లో పవర్ ట్రాన్స్‌ఫార్మర్ సామర్థ్యాన్ని 12.5 ఎంవీఏ నుంచి 16 ఎంవీఏకు పెంచారు.



అప్‌గ్రేడ్ చేసిన 16 ఎంవీఏ పవర్ ట్రాన్స్‌ఫార్మర్‌ను టీజీఎస్పీడీసీఎల్ డైరెక్టర్ (ఆపరేషన్స్) డా. ఎన్. నరసింహులు రిబ్బన్ కట్ చేసి, స్విచ్ ఆన్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎండీ జితేష్ వి. పాటిల్, ఐఏఎస్ మార్గదర్శకత్వంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యుత్ మౌలిక సదుపాయాలను బలోపేతం చేస్తున్నట్లు తెలిపారు.

సబ్‌స్టేషన్ సామర్థ్యాన్ని పెంచడం వల్ల వసంతపురి, మల్కాజిగిరి, సైనిక్‌పురి, పరిసర ప్రాంతాల్లో విద్యుత్ లోడ్ పంపిణీ మెరుగుపడటంతో పాటు వోల్టేజ్ హెచ్చుతగ్గులు, విద్యుత్ అంతరాయాలు తగ్గే అవకాశం ఉందన్నారు. భవిష్యత్తులో పెరిగే విద్యుత్ డిమాండ్‌ను కూడా సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు ఈ సామర్థ్య పెంపు దోహదపడుతుందని పేర్కొన్నారు. వినియోగదారులకు సురక్షితమైన, విశ్వసనీయమైన, నిరంతరాయ విద్యుత్ సేవలు అందించడమే టీజీఎస్పీడీసీఎల్ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో చీఫ్ ఇంజనీర్ (ఆపరేషన్స్), మేడ్చల్ జోన్ రమేష్, హబ్సిగూడ సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్ వెంకన్నతో పాటు సంబంధిత డివిజనల్, సబ్ డివిజనల్ అధికారులు, ఇంజనీర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

### మినీ వ్యాన్‌లో 20 క్వింటాళ్ల బియ్యం స్వాధీనం

### గోల్నాకలో సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ దాడి

హైదరాబాద్, ఆగస్టు 12 (ప్రజాకలం):

అక్రమంగా తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారు. గోల్నాక జిందా తిలస్మాత్‌నగర్‌లోని ధర్మకాట వద్ద మంగళవారం తెల్లవారుజామున ఈ పట్టివేత జరిగింది. సివిల్ సప్లైస్ ఎన్‌ఫోర్స్‌మెంట్ టాస్క్‌ఫోర్స్ అధికారుల వివరాల ప్రకారం.. హైదరాబాద్ సీఆర్ఓ కార్యాలయానికి చెందిన సీఎస్‌డీటీ ఎం.వసంతకుమారి, అంబర్‌పేట సర్కిల్ ఏసీఎస్ఓ కార్యాలయానికి చెందిన సీనియర్ చెకింగ్ ఇన్‌స్పెక్టర్ మహమ్మద్ రెహమాన్‌ఖాన్‌కు రేషన్ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం అందింది. దీంతో అప్రమత్తమైన అధికారులు తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో జిందా తిలస్మాత్‌నగర్‌లో తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో ధర్మకాట వద్ద అనుమానాస్పదంగా కనిపించిన టీజీ 11టీ 0799 నంబరు మినీ వ్యాన్‌ను అడ్డుకుని తనిఖీ చేశారు. అందులో తరలిస్తున్న 20 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించి బియ్యంతో పాటు మినీ వ్యాన్‌ను స్వాధీనం చేసుకున్నారు. పట్టుబడిన బియ్యం, వాహనాన్ని అంబర్‌పేట పోలీసులకు అప్పగించారు. వాహనానికి సంబంధించిన వ్యక్తిగా ఓల్డ్ మలక్‌పేటకు చెందిన మహమ్మద్ రిజ్వాన్ అలీని అధికారులు గుర్తించారు. నిందితుడిపై కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.



## ప్రజా కలం కథనంతో

# కదిలిన సర్కారు యంత్రాంగం

- చీకటి ఆసుపత్రి కథనంపై ఒక్కరోజులోనే స్పందించిన ఎమ్మెల్యే..
- నా దృష్టికి ఎందుకు రాలేదు? అంటూ అధికారులపై సీరియస్..
-జనరేటర్ మొరాయింపుపై ఆగ్రహావేశాలు.. ఆర్ఎంఓనూ వదలని ఎమ్మెల్యే..
- నేరుగా కలెక్టర్‌కు ఫోన్.. క్షణాల్లో రూ.4 లక్షల నిధులకు గ్రీన్ సిగ్నల్..
- ప్రజా కలం కథనం.. ప్రజా ప్రతినిధిని కదిలించిన వైనం..






పటాన్‌చెరు, ఆగస్టు 11 (ప్రజా కలం) ప్రతినిధి

రాత్రికి రాత్రే యంత్రాంగాన్ని కదిలించిన అరుదైన ఘటన ఇది.! ప్రజారోగ్యంతో సాగుతున్న నిర్లక్ష్యపు వ్యవహారంపై ప్రజా కలం దినపత్రిక సంచలనాత్మకంగా బయటపెట్టిన కథనం, ఇరవై నాలుగు గంటలు తిరగకుండానే ఫలితాన్నిచ్చింది.! పటాన్‌చెరు ప్రభుత్వ ఆసుపత్రిలో టార్చ్‌లైట్ల వెలుతురులో డాక్టర్లు చికిత్స చేయాల్సిన దయనీయ దృశ్యాలు, రోగుల ప్రాణాలతో సాగిన చెలగాటాన్ని కళ్లకు కట్టినట్టు చూపిన ఈ కథనం..నేరుగా ఎమ్మెల్యే దృష్టికి చేరి, యంత్రాంగాన్ని కుదిపేసింది.!..

**ఎందుకు దాచారు?..**

**అధికారులపై ఎమ్మెల్యే ఫైర్.!..**

మంగళవారం ఉదయాన్నే తన క్యాంపు కార్యాలయంలో అత్యవసర సమావేశం ఏర్పాటు చేసిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, ఆసుపత్రి ఆర్ఎంఓ శ్రీనివాస్, వైద్యులు, అభివృద్ధి కమిటీ సభ్యులను తీవ్రంగా నిలదీశారు.! కరెంట్ పోతే, జనరేటర్ కూడా పనిచేయకపోతే నా దృష్టికి ఎందుకు తీసుకురాలేదు? అంటూ ఆగ్రహం వ్యక్తం చేసిన ఆయన తీరు అధికారుల్లో గగ్గోలు రేపింది.! రోగుల ప్రాణాలతో ముడిపడిన అంశంలో ఇంతటి నిర్లక్ష్యం తనకు ససేమిరా నచ్చలేదని తేల్చిచెప్పారు..


ప్రజా కలం
PRAJA KALAM Telugu Daily
RNI NO.TELTEL/2010/33275
11 Aug 2026 - Page 12

చీకటిలో ఆసుపత్రి..

ప్రాణాలతో చెలగాటం..

-పటాన్‌చెరు ఆసుపత్రిలో కరెంట్ గోవిందా.!..
-టార్చ్ లైట్లే దిక్కు..మొబైల్ వెలుతురులో డాక్టర్ల చికిత్స..
-ఎమర్జెన్సీ కేసులకు గడ్డు పరిస్థితి..
- ఆసుపత్రి నిర్లక్ష్యానికి రోగుల ప్రాణాలు గాలిలో దీపం..
-ఎలక్ట్రీషియన్ మాయం..వైద్యశాఖ అధికారుల మౌనం..

పటాన్‌చెరు, ఆగస్టు 10 (ప్రజా కలం) ప్రతినిధి

ప్రజారోగ్యంతో చెలగాటమా? ప్రభుత్వ ఆసుపత్రిలో కరెంట్ కష్టాలు – రోగుల ప్రాణాలతో నిర్లక్ష్యపు ఆట! మనిషి ప్రాణానికి విలువ లేదా? రోగుల క్షేమం కంటే అధికారుల నిర్లక్ష్యమే ఎక్కువా? అనే ప్రశ్నలు ఇప్పుడు పటాన్‌చెరు వాసుల నోళ్లలో మార్మోగుతున్నాయి. పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రి లాంటి అత్యంత కీలకమైన ప్రాంగణంలో కనీస విద్యుత్ సదుపాయం కూడా లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి,పాలనా వైఫల్యానికి నిదర్శనంగా నిలిచింది. రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు..

**ఉదయం నుంచి అంధకారంలో ఆసుపత్రి, టార్చ్ లైట్లే దిక్కు!..**

పటాన్‌చెరు ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో సోమవారం ఉదయం నుంచి విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోయింది. కరెంట్ లేకపోవడంతో వైద్య సిబ్బంది మొబైల్ ఫోన్ టార్చ్ లైట్ల వెలుతురులోనే రోగులకు చికిత్స అందించాల్సిన దయనీయ పరిస్థితి నెలకొంది. ఆధునిక వైద్యం అందించాల్సిన ఆసుపత్రిలో ఇలాంటి దుస్థితి నెలకొనడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి..

**చీకట్లో కొట్టుమిట్టాడుతున్న రోగులు..ఎవరు బాధ్యులు?..**

వార్డులన్నీ చీకటిమయంగా మారడంతో చికిత్స కోసం వచ్చిన రోగులు, వారి బంధువులు నరకయాతన అనుభవించారు. చీకట్లో మందులు ఇవ్వడం, ఇంజెక్షన్లు చేయడం వంటి పనులు వైద్య సిబ్బందికి ప్రాణసంకటంగా మారాయి. ముఖ్యంగా ఎమర్జెన్సీ కేసుల్లో, వెంటిలేటర్లు, మానిటర్ల వంటి పరికరాలపై ఆధారపడే రోగుల పరిస్థితి మరింత ప్రమాదకరంగా మారిందని సమాచారం.ఏ క్షణంలో ఏం జరుగుతుందో తెలియని భయానక వాతావరణం ఆసుపత్రిలో నెలకొంది..

**గంటలు గడిచినా అందుబాటులో లేని ఎలక్ట్రీషియన్..**

విద్యుత్ సమస్యను తక్షణమే పరిష్కరించాల్సిన ఎలక్ట్రీషియన్ గంటల తరబడి అందుబాటులో లేకపోవడం అధికారుల నిర్లక్ష్యానికి పరాకాష్టగా నిలిచింది. ఇంత ప్రధానమైన ఆసుపత్రిలో అత్యవసర విద్యుత్ సమస్యలను పరిష్కరించడానికి కూడా సిబ్బంది లేకపోవడం ఏమిటని స్థానికులు నిలదీస్తున్నారు. బ్యాకప్ జనరేటర్ ఏర్పాటు ఎందుకు లేదని, ఇలాంటి అత్యవసర పరిస్థితుల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు ఎందుకు చేయలేదని ప్రశ్నిస్తున్నారు..

**అధికారుల మౌనం..మండిపడుతున్న స్థానికులు..**

ఈ ఘటనపై సాయంత్రం వరకు వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి స్పందన లేకపోవడం మరింత ఆగ్రహావేశాలకు కారణమవుతోంది. ప్రజల ప్రాణాలతో ముడిపడిన ఇలాంటి తీవ్ర అంశంపై సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు, రోగుల బంధువులు డిమాండ్ చేస్తున్నారు. ఈ వ్యవహారం ప్రస్తుతం జిల్లావ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది..

**లోగుట్టు బయటపడింది..**

**రూ.4 లక్షల వైరింగ్ బాంబు.!..**

అసలు సమస్య ఎంత తీవ్రమైనదో సమావేశంలో బహిర్గతమైంది.! ఆసుపత్రి మొత్తం విద్యుత్ వైరింగ్‌నే మార్చాల్సిన దుస్థితి నెలకొందని, అందుకు ఏకంగా రూ.4 లక్షలు అవసరమని అధికారులు వెల్లడించడంతో అందరూ ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు.! ఆలస్యం చేయకుండా చకచకా కదిలిన ఎమ్మెల్యే, తక్షణమే జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు నేరుగా ఫోన్ చేసి నిధుల మంజూరుపై ఒత్తిడి తెచ్చారు.! క్షణాల్లోనే స్పందించిన కలెక్టర్..నిధులు వెంటనే విడుదల చేస్తామని హామీ ఇవ్వడం విశేషం.!..

**ఇక పునరావృతం కావొద్దు..కఠిన ఆదేశాలు.!..**

కేవలం తాత్కాలిక పరిష్కారంతో సరిపెట్టకుండా, శాశ్వత పరిష్కారం దిశగా ఎమ్మెల్యే అడుగులు వేశారు.! నిధులు మంజూరైన వెంటనే వైరింగ్ పనులు ప్రారంభించాలని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను గట్టిగా హెచ్చరించారు.! కరోనా సమయంలో సీఎస్ఆర్ నిధులతో ఏర్పాటు చేసిన జనరేటర్‌ను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంచాలని కూడా ఆదేశించడం గమనార్హం.!..

**తదుపరి అస్త్రం..**

**ఆసుపత్రి అభివృద్ధి కమిటీ భేటీ.!..**

సమస్య ఇక్కడితో ఆగకుండా, ఆసుపత్రి మౌలిక వసతులపై సమగ్రంగా చర్చించేందుకు త్వరలోనే అభివృద్ధి సలహా కమిటీ సమావేశం నిర్వహించాలని ఎమ్మెల్యే ఆదేశించారు.! పేద, మధ్యతరగతి ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించడమే తమ లక్ష్యమని, ప్రజారోగ్య విషయాల్లో ఎలాంటి నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఆయన స్పష్టం చేశారు.!..

**ప్రజా కలం: సంచలనం.. అధికారుల్లో కదలిక.!..**

ఒక్క కథనంతో యంత్రాంగాన్ని కదిలించి, ప్రజా సమస్యకు తక్షణ పరిష్కారం దిశగా చర్యలు తీసుకునేలా చేసిన ప్రజా కలం తీరుపై స్థానికులు, పాఠకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.! ప్రజా సమస్యలపై నిత్యం అప్రమత్తంగా ఉంటూ, బాధ్యులను నిలదీసే తన పోరాటాన్ని ప్రజా కలం ఇకపైనా కొనసాగిస్తుందని పత్రిక యాజమాన్యం స్పష్టం చేసింది.!

# రైతు భూమిపై కబ్జా యత్నం

### 1986లో కొనుగోలు చేశానంటున్న యాదయ్య.. పోలీసులకు ఫిర్యాదు

### భూమి వద్దకు వందల మంది రావడంతో ఉద్రిక్తత

### కబ్జాకు యత్నించిన వారిపై చర్యలు తీసుకోవాలి: జల్పల్లి నరేందర్‌యాదవ్







మహేశ్వరం, ఆగస్టు 11 (ప్రజా కలం ప్రతినిధి)

మహేశ్వరం మండలం మంఖల్ జీహెచ్‌ఎంసీ పరిధిలోని సర్వే నంబర్ 60లో తనకు చెందిన 5 ఎకరాల 30 గుంటల భూమిని కొందరు కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని రైతు సర్వేంద్రి యాదయ్య ఆరోపించారు. ఈ మేరకు పహాడీషరీఫ్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాదయ్య కథనం ప్రకారం.. 1986లోనే సదరు భూమిని తాను కొనుగోలు చేశానని, ఇందుకు సంబంధించిన రిజిస్ట్రేషన్ పత్రాలు, ఇతర ఆధారాలు తన వద్ద ఉన్నాయని తెలిపారు. అయితే గోపాలరావు అనే వ్యక్తి వందల మంది వ్యక్తులను, మహిళలను భూమి వద్దకు తీసుకొచ్చి కబ్జా చేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కొందరు నకిలీ పత్రాలు సృష్టించి భూమిపై హక్కు పొందేందుకు ప్రయత్నిస్తున్నారని పేర్కొన్నారు. సమాచారం అందుకున్న పోలీసులు భూమి వద్దకు చేరుకుని పరిస్థితిని అదుపులోకి తీసుకువచ్చినట్లు యాదయ్య కుటుంబ సభ్యులు తెలిపారు. తన భూమిని తనకు దక్కేలా చర్యలు తీసుకోవాలని, కబ్జాకు యత్నిస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు పోలీసులను కోరారు.

**రైతులకు అండగా ఉంటాం**

ఈ ఘటనపై టీపీసీసీ ఉపాధ్యక్షుడు, ఎస్సీ సెల్ డిపార్ట్‌మెంట్ వైస్ చైర్మన్ జల్పల్లి నరేందర్‌యాదవ్ స్పందించారు. పేద రైతులకు కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని అన్నారు. అమాయక రైతుల భూములను అక్రమంగా స్వాధీనం చేసుకునేందుకు ప్రయత్నిస్తే ప్రభుత్వం, పోలీసులు కఠినంగా వ్యవహరించాలని కోరారు.

సర్వే నంబర్ 60లోని భూమిపై వివాదం ఉంటే రెవెన్యూ, పోలీసు అధికారులు సమగ్రంగా విచారణ జరిపి వాస్తవాలను తేల్చాలని సూచించారు. నకిలీ పత్రాలు సృష్టించి ఇతరుల భూములను కబ్జా చేసేందుకు ప్రయత్నించే వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని పహాడీషరీఫ్ సీఐని కోరినట్లు తెలిపారు.

కార్యక్రమంలో కుంభం సురేష్‌యాదవ్, మహేశ్వరం నియోజకవర్గ సోషల్ మీడియా అధ్యక్షుడు ఎర్ర చంద్రమోహన్, రైతు యాదయ్య కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

Corporate .Office :1-7-511/4, Gemini Colony, Near Pochamma Temple, Zamistanpur, HYDERABAD, TELANGANA, 500020 Cell: 9010972526

Printed, Published and owned by KALAKONDA RAMAKRISHNA, Printed at TEJOMAI PUBLICATION, H.No. 2-24/98/BLN Colony, IDA Uppal Medchal-Malkajgiri, Hyderabad, Telangana-50013
Published from H.No.10-1-7, Bada Bazar, Beside Pothalingaiah Temple, Azam Raod, Nizamabad,TS -503001 TELANGANA - 503001.
Editor: KALAKONDA RAMAKRISHNA, PRGI.No. TELTEL/2010/33275, Cell: 90109 72526, Email:prajakalam2010@gmail.com